శ్రీ

# ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

**Journal of the Telugu Academy**

**KAKINADA.**

సంవత్సరము చందా రు 3—0—0

**సంపుటము ౪౮** మార్గశీర్ష-ఫాల్గుణములు **సంచిక ౫-౬**

Vol 48 Parts 5-6

## విషయసూచిక

# స్వ వి ష యము

ఆంధ్ర సాహిత్యపరిషత్పత్త్రికనుండి శాస్త్రవిషయముల నాంధ్ర భాషలో నందిచ్చుట సంభావ్యమని యూహించి, ఈ వఱకే యారంభమై కొంతవఱకు వెలువడియున్న శ్రీ భాగవతుల కుటుంబ రాయశాస్త్రిగారి వ్యక్తివివేకమును మరల ముద్రింప నారంభించి యుంటిమి. శ్రీ కుటుంబరాయశాస్త్రిగారి యనువాదసరణి యీవఱకు పరిషత్పత్త్రికా పాఠకులకు విదితమే. పతఞ్జలిమహర్షి విరచిత మైన మహాభాష్యమునందలి ప్రథమాహ్నికమగు పస్పశాహ్నికమునకు శ్రీ శ్రీ భాష్యం అప్పలాచార్యులవారు ఆంధ్రానువాదము కావించియున్నారు. దానిని సేకరించి వ్యాకరణశాస్త్రవిషయమును బ్రకటించుట మొదలుపెట్టితిమి. బౌద్ధాచార్యుఁడయిన నాగార్జునుఁడు రచించిన మాధ్యమిక కారికలను శ్రీ కొల్లూరు సోమశేఖర శాస్త్రి గారి వ్యాఖ్యానముతో నీ వఱకు ముద్రించియుంటిమి. ఇఁక మీఁద శ్రీ సోమశేఖరశాస్త్రిగారే యాంధ్రీకరించిన వైశేషిక దర్శనమును కూడ రాఁబోవు సంచిక నుండి ముద్రింపఁదలఁచితిమి.

భారతదేశమునందలి విజ్ఞానమునకుఁ జెన్నిఘులయిన వ్యాకరణాది శాస్త్ర గ్రంథములు పఠనపాఠన క్రమమునుండి సడలిపోవుచున్నవి. వానిని జదువుటకు నవగాహనము చేసికొనుటకుఁ దగిన యాస్థాసామర్థ్యములు కొఱవడుచున్నవి. ఈవిధముగ తఱిగిపోవుచున్న యీ శాస్త్ర గ్రంథముల సంప్రదాయరక్షకీ విధమయిన యాంధ్రీకరణములు, తత్ప్రకటనము గొంతసహాయకారులు కాఁగలవని యీ యుద్యమమున కుపక్రమించితిమి పాఠకమహాశయు లీవిషయమునకుఁ దమ సహకారము నొసఁగవలయునని మా ప్రార్థన.

ఇట్లు,

సంపాదకుఁడు.

# మనుచరిత్రము—రసము

డాక్టరు. దివాకర్ల వేంకటావధాని.

ఆంధ్రప్రబంధముల కాద్యము నాదర్శప్రాయము నైనది, మనుచరిత్రము. కాలప్రభావమునుబట్టియు నభిరుచివిశేషమునుబట్టియుఁ బ్రబంధకవు లెల్లరును శృంగారరసపరిపోషణమున కనువగు వస్తువులనే స్వీకరించిరి. పెద్దనయు మనుచరిత్రమున నారసమునే ప్రధానముగా గ్రహించెను. వరూధినీ మాయాప్రవరుల సమాగమము, స్వరోచి మనోరమాదులను వివాహమాడి వారియం దభిమతభోగముల ననుభవించుట, వనదేవత స్వరోచియాలింగనము నపేక్షించుట మున్నగు సన్నివేశము లాకావ్యమున శృంగారరసమున కాలంబనములు. కాని యాఘట్టములన్నింట నొకేవిధమైన శృంగారము పోషింపఁబడియుండలేదు. పాత్రస్థితి మనోవృత్తిభేదములనుబట్టి యది కొంత వైవిధ్యము నొందినది. అది యొక్కచో నాభాసరూపమును, వేఱొకచో వియోగరూపమును, మఱియొక్కచో సంభోగరూపమును బొందుటయే కాక రెండుచోట్ల శాంతముతో సంఘర్షమునుగూడఁ గాంచినది.

ప్రవరాఖ్యుఁడు మకరాంకశశాంకమనోజ్ఞమూర్తియు, అలేఖ్యతనూవిలాసుండును మాత్రమే కాక నిర్మలధర్మకర్మదీక్షాపరతంత్రుఁడు కూడను. సౌందర్యవైరాగ్యములను విరుద్ధగుణము లాతనియెడ నపురూపముగా మేళనము చెందినవి. అందుచే నాతని చక్కఁదనము కాంతిసేయు జారకామినులకుఁ బూచినసంపెంగపోలుపు మధుకరాంగనలకువలె భోగబాహ్యమైపోయినది. వరూధిని కీవిషయము తెలియదు. ఆమె సౌందర్యపిపాసయు, భోగలాలసయుఁ గల గంధర్వయువతి. ననవిల్తుశాస్త్రంపుమినుకు లావర్తించుపనియామెకు వెన్నతోఁ బెట్టినవిద్య. పసరు కరఁగిపోవుటచే నింటి కరుగు నుపాయముఁ గానక

త్రోవ యడుగుటకై తనకడకు వచ్చిన నలకూబరసన్నిభుఁడైన ప్రవరునిఁ గాంచి యాతఁ డెవ్వరో యెందు కరుదెంచెనో యెఱుంగకయే యామె యాతని వలచినది. అతనిఁ జూచియుఁ జూడకముందే యామె మేన మీనాంకానల సూచకధూమాంకురములనఁ బులక లంకురితములయ్యెను. అతఁడు తన్నుఁ బరిగ్రహించినచో మరు నేలని బంటుగా డక్కఁగొనవచ్చు నని యామె యెంతయో మురిసిపోయినది. దీనికంతకును సుర గరు డోరగ నరఖేచర విద్యాధర కుమారులందును గానరానిదియు, యక్షతన యేందు జయంత వసంత కంతుల గెలువ సాధనమగునదియు నగు నాతనిచక్కఁదనమే కారణము. అచ్ఛమైన సౌందర్య మున్నచో నామె కితరగుణాగుణములతోఁ బనియే లేదు. అందుచే నామె సిగ్గు విడిచి పోయి యాతనిదారి కడ్డమునిల్చినది. అతఁ డడిగినప్రశ్నకు బదులుగా నామె తనయుదంతము నంత నెఱిఁగించి తనగృహమున కరుదెంచి బడలికలు వాసి చను మని ప్రార్థించినది. ఆమెలో మదనత్వర యెంత యధికముగా నుండెనో కాలాతిక్రమణ మగుచుండుటచే సత్క్రియాకాండము తీర్చుటకై యింటికేఁగవలె నను త్వర ప్రవరునియం దంత యధికముగా నుండెను. నాఁడిల్లు చేరనిచో సమస్తధర్మములు తూలు ననియు నాతనిభయము. మఱియు వ్రతుఁడై దినములు పుచ్చు నుత్తమవిప్రునిఁ దన్నామె కామించుట యవిచారమూలక మని యాతఁడు భావించెను. వరూథిని కను వేదుఱుచేఁ గలిగిన వలపుతమిచే భోగానుభవమును సమర్థించుచుఁ బెక్కుయుక్తు లుగ్గడించెను. ప్రవరుఁ డవియెల్లఁ గాముకునకే కాని తనవంటివానికిఁ గా దని నిరసించెను. బ్రాహ్మణుఁ డింద్రియవశగతుఁడై మదనబాణములకుఁ బాలైనచో బ్రహ్మానందాధిరాజ్యపదవీచ్యుతుఁడై చెడు నని యాతని యభిప్రాయము. ఇంద్రియసౌఖ్యావహమైన యింపే పరబ్రహ్మ మని యామె విశ్వాసము. సిగ్గులేని

యీ జవ్వనిమాటలు తనకు సిగ్గును వెగటును గలిగింప నాతఁడు నాకరణుల్ దర్భలు నగ్నులుం బ్రియములైన ట్లన్యముల్ గా వ్వాడల్ తిరమే చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపైఁ 'దేనియ' లని యామె వాదమును దీవ్రముగా ఖండించెను. అంత నామె వలపు నిలుపలేక రతిసంరంభముతో నాతనిఁ గౌఁగిలించి యధరం బాసించెను. ఆతఁడు "హా శ్రీహరీ !" యనుచు నోరమోమిడి తదీయాంసద్వయం బంటి పొమ్మని త్రోసివైచెను. పిమ్మట నామె యేమి చెప్పుచున్నను వినక యతఁ డవ్వనజగంధి మేనిజవ్వాడిపస కదంబించునొడలు కడిగికొని వార్చి తన కుపాస్యుఁడైన గార్హపత్యాగ్నిని వేఁడుకొని తదనుగ్రహమునఁ దనగృహము చేరెను. ఇచ్చట శృంగార మేకత్రమాత్రనిష్ఠ మగుటచే నాభాసత్వమును బొందినది.

వరూధిని శృంగారరసకల్లోలిని. ప్రవరుఁడు శాంతమహారసముద్రము. ఆకల్లోలిని సముద్రము నాక్రమించుటకై సంరంభించినది. కాని సముద్రము విజాతీయమైన యాభావప్రవాహమునకు సందీయక యతిరస్కృతమూర్తియై నిల్చినది. ఇచ్చట శాంతశృంగారములకును, ధర్మకామములకును, బ్రహ్మేంద్రియానందములకుఁ, గర్మభోగనిష్ఠలకును గలిగిన సంఘర్షణము నాన్యతోదర్శనీయమై మనుచరిత్రను మనుచరిత్రగా నొనరింపఁ జాలినది.

ప్రవరుఁ డరిగినపిమ్మట వరూధిని యాతని నట వెదకి యెందును గానక వియోగసాగరమున నోలలాడినది. చొక్కపుఁ బ్రాయమును సోయగమును గల వల్లభుఁ డక్కున గారవింపఁ బ్రియమందని తనచక్కఁదనమును జవ్వనమును వ్యర్థము లని వాపోయినది. విరహదహనదాహమున దేహము తల్లడిల్ల నిట్టూర్పులు పుచ్చుచు వివిధదశాంతరము లొంది వేఁగఁజొచ్చినది. పిమ్మట నామె కేళీవనిఁ జొచ్చి వియోగవేదన కోర్వఁజాలక తనువుఁ దొఱఁగఁ దలంచెను. చెలికత్తె

లామె నోదార్చి మరలఁ బానుపుకడకుఁ గొనిరాఁగా నామె చంద్రమన్మథమలయమారుతముల నుపాలంభించి చాపము పెల్లున మూర్ఛమునింగెను. సఖులు వివిధశీతలోపచారము లొనరించి యామెను సంజాతసంజ్ఞ నొనరించిరి. ఇంతలో రాత్రి తెల్లవాఱెను. వరూథిని సర్వకార్యపరాఙ్ముఖియై యుండఁ జెలికత్తె లనునయించి, మెట్టెటులో మేను కైసేసికొన నాల్కొలిపి, చింతచే సగమైన యామె నంతికోద్యానమునకుఁ గొనిపోయిరి. ఈఘట్టమున విరహశృంగారము సమగ్రసుందరముగా వర్ణింపఁబడినది.

అంతకుముందే గంధర్వకుమారుఁ డొకఁడు వరూథినివిలాసము లీక్షించి రాగాంధుఁడయి, కోరి, హత్తక మదనతాపము నందుచుండెను. అతఁడు జరిగినదంతయు నెఱిఁగి శాంబరీమహిమచేఁ బ్రవరుని రూపమునే కాక తద్దేహాశిఖదీప్తినిగూడ గ్రహించి యుద్యానవనమునఁ బూలు చిదుముచుండెను. వరూథిని చెలికత్తెలతోఁ గొంత సేపు పుష్పాపచయ మాచరించి తరువాత వారు జలక్రీడ సవరించుచుండఁ గొలనిగట్టునఁ గూర్చుండి చూచుచుఁ బూవులుకోయుచున్న యాకపటభూసురునిఁ గాంచెను. వెంటనే యామె యాతనిఁ జేర నరిగి తనవలరాచవేదుఖు నెఱింగించి తన్నేలుకొనఁ బ్రార్థించెను. గంధర్వుఁడేవో కొన్ని కపటోక్తులు పలికి, యామెదీనతఁ గాంచి వ్రతము విడువఁ బూనినట్లు నటించి కవయునెడఁ గన్నుఁగవ మూయవలెనని తనదేశాచారము నగ్గడించి యామెచే నంగీకరింపఁ జేసెను. చెలికత్తెలు వారి నిరువుర వరూథినిమణిమండితాలయమునఁ గూర్చి యాత్మగృహముల కరిగిరి. పిమ్మట వరూథినియు గంధర్వకుమారుఁడు నొకలతాగృహమునఁ బొంగెడు కాంక్షతో భోగింప నారంభించిరి. వారట్లు బహుకాలము భావజతంత్రైకపరత్వమున నుండ, వరూథిని గర్భము దాల్చెను. ఇంకను దా నచ్చటనే యున్న వంచన మెఱింగి

యీయచ్చర శపించునో యనుభీతిచే నామె కేవో యనునయవాక్యములు పల్కి గంధర్వుఁడు వచ్చుచుఁ బోవు చుండెద నని నమ్మించి తనయిచ్ఛఁ జనియెను.

ఇచ్చటిశృంగారము సంభోగాత్మకము. కాని యిచ్చటను అది యొకవిధముగా నాభాసరూపమే యగుట సంభవించినది. గంధర్వకుమారుఁడు వరూథినిని వలచెను. వరూథిని ప్రవరాఖ్యుని మనసారఁ బ్రేమించెను. గంధర్వుడు శాంబరీమహిమచేఁ బ్రవరుని రూపమునే కాక తేజమును గూడ గ్రహించియుండుటచే వరూథిని తాను వల్లభునితోఁ గూడినట్లే సంతోషించెను. ఆమెకు గంధర్వుఁ డాచరించిన వంచన తెలియదు. ఆమె దైహికముగా గంధర్వునే కూడినను మానసికముగాఁ బ్రవరాఖ్యుని పొందే యనుభవించెను. తత్త్వము పరిశీలింప నిచ్చటను అనురాగ మేకత్రైవావస్థితమే. ఈ విషయము పాఠకులకుఁ దెలియును. అందుచే నిటఁ గావ్యస్థపాత్రలదృష్టితోఁ జూచిన సంభోగశృంగారమే యైనను బాఠకులపాలికి శృంగారరసాభాసమే యైనది. ఇది చాల విచిత్రమైన సంఘటనము.

ఇందీవరాక్షుఁడు, రాక్షసత్వము నుండి విముక్తుఁడైన పిదప కృతజ్ఞతమై స్వరోచికిఁ దన కూఁతు నిచ్చి పెండ్లి చేసెను. పెద్దన యీ వివాహమహోత్సవమును సాంగోపాంగముగా వర్ణించెను. ఈ ఘట్టమున శృంగారరసము చక్కఁగాఁ బోషింపఁబడినది. తరువాత స్వరోచి మనోరమ కోరిక ననుసరించి విభావసీ కళావతుల వ్యాధి మాన్పి వారు ప్రార్థింపఁగా వారిని గూడ వివాహమాడెను. పిమ్మట నాతఁ డాముగ్గురునాయికలం గూడి పెద్దకాల మిష్టభోగముల ననుభవించెను. బహునాయకరతివలె బహునాయికారతియు నాభాసమే యని కొందఱు శంకింపవచ్చును. "పుంసో౽ప్యనేకనాయికానురాగే రసాభాసత్వ మితి కేచిత్" అను నభిప్రాయమును వెల్లడించి, కుమార

స్వామి ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానమున నట్టిచో దక్షిణ నాయికానురాగమును ఆభాసమే కావలసివచ్చును గావున నదియుక్తము గాదని నిరసించెను. అందుచే స్వరోచి బహునాయికారతి దక్షిణ నాయకతా సూచకమే కాని యాభాసతాకరము కాదు.

స్వరోచి పంది నేయఁ బోవుచుండ నాపై శరమేసి నిగ్రహింపుమని కోరిన హారిణి నది యట్లు జీవితముపై రోయుటకుఁ గారణమేమని యతఁ డడుగ నది యన్యసతులయందు నాసక్తుఁడైన వానిఁ దమకమునఁ గూడఁ దలంచుటకంటె మరణమైన మేలని బదులు చెప్పెను. అంత నాతఁడు "నీ హృదయ మెవ్వనిపై నిలిచె"నని యడుగ నది "చెదరక నామనంబు నృపశేఖర ! నీయెడ నిల్చి మన్మథ ప్రదరపరంపరానిహతి పాల్పడి వ్రేగెడి" నని చెప్పి "హరిణాంగన నీవు నరుండ నే ముదం బొదవంగ నీకు నాకు మిథునోచితకృత్యములెట్లు చేకుఱు" నని యాక్షేపింప "నన్నాలింగనము చేయు మదియే చాలు" నని ప్రార్థించెను. అంతఁ గృపార్ద్రుఁడైన స్వరోచి యాహరిణిని గౌఁగిటఁ జేర్చెను. వెంటనే యది సౌందర్య సేవధియైన యెలంతయై నిల్చెను. పిదప స్వరోచి యడుగ నామె తాను వనదేవత ననియు, నతనియందు మనువర్యుం బడయవలె నని దివిజులు ప్రార్థింప నట్లు వచ్చితి ననియు, ననురాగవతియైన తన్ను వరించి తనయం దపత్యంబుఁ బడసినఁ బుణ్యలోకావాప్తి యగు ననియుఁ దెల్పెను. స్వరోచి యంత నావనదేవత నేకచిత్తముతో నంగీకరించి యామెయందు మనువును బడసెను.

స్వరోచి కౌఁగిలించుకొనువఱకును వనదేవత హరిణాంగనాకారముననే యుండెను. అది కౌఁగలించుకొను మని కోరఁ గరుణార్ద్రచిత్తుఁడై యాతఁ డట్లు చేసెను. ఇది యనౌచిత్యసూచకమై రసాభాసమున కాకరముగా నున్నది. అనురాగ ముభయనిష్ఠమయ్యుఁ దిర్య

త్సంపర్కము గాంచుట యందుకుఁ గారణము. ఈరసాభాసము హరిణి వనదేవతగా మాఱినపిమ్మట శృంగారమైనది. ఈశృంగారము మను సంభవమునకు హేతు వగుటచేఁ బరమధార్మికమై ప్రకాశించినది.

మనుచరిత్రమునఁ గళావతి స్వరోచికిఁ దన జన్మ వృత్తాంతము చెప్పుచోట పారిశ్రి యుదంతమునకుఁ బ్రసక్తి కల్గినది. అతఁడు ఫల మూలచ్ఛదనాంబుభుక్తిఁ జపనాభ్యాస క్రియాయుక్తి నిర్దళితాంతర్గత శాత్రవ ప్రకర జాగ్రద్గర్వ సర్వస్వుఁడై" శీతవాతాతపములకు మన మనుత్సాహము గానక యరుదైన తప మాచరించెను. ఇట్టి శాంత మూర్తి పుంజికస్థలయంగములఁ గాంచి వివేకము కలఁగఁ బంచశర కాండవిడంబిత ధైర్యసారుం డయ్యెను. పిదప నతఁడు తపమంతయుఁ జాలిపోవ నన్నియు విడిచి యాయంగనతో మనోజక్రీడా విపులైశ్వ ర్యము లనుభవించెను. ద్వితీయాశ్వాసమున వలెనే యిటఁ గూడ శాంత శృంగారములకు సంఘర్షణము సమకూడినది. కాని యిట ముని నిగ్రహహీనుఁ డగుటచే శాంతమే వీఁగిపోవలసి వచ్చినది.

మనోరమ చెలులతో వెండికొండపై విహరించుచు బాల్యచాప లమునఁ బూచివలె నున్న యొక వాచంయముని మోము పట్టుకొన నామౌని భగ్నానుసంధానుఁడై కన్నులు తెఱచి యామెను శపించుటే కాక కవలుచుఁ దనచేతి నాగబెత్తముఁ గొని యదయుఁడై యామెను బసరముఁ గొట్టినట్లు కొట్టెను. అంత నామె చెలికత్తెలు నిందింప నాతఁ డాగ్రహమున వారిని గూడ శపించెను. మనోరమ సఖు లన్న ట్లాతని తపము శాపనిమిత్తమే మయ్యెను. ఇందీవరాక్షుఁడు వంచ నమై తన దగ్గఱనుండి యాయుర్వేదము గ్రహించు టెఱిఁగి బ్రహ్మ మిత్రుఁ డిట్లే యాతనికి ఘోరమైన శాప మొసంగెను. ఈ రెండు తావుల శాంతమునకు రౌద్రముతో సంఘర్షణము సంభవించినది.

రెండు చోట్లను గూడ రౌద్ర మతిమాత్రమై శాంతమును గ్రిందు చేసినది.

రాక్షసరూపమున నున్న యిందీవరాక్షుఁడు గంధర్వుఁడుగా మాఱునెడ నద్భుతరస మున్నది. అట్లే దేవాపి ప్రత్యాఖ్యానకుపితుఁడై రాత్రి సమయమున పారర్షిని జంపిన ఘట్టమున బీభత్స మున్నది. మనువు పుట్టి విష్ణువును గూర్చి యన్యదుష్కరమైన తప మాచరించి యా దేవునిచే వరములు గాంచెను. దీనితోఁ గావ్యము ముగిసినది. ఇట్లుపసంహృతియం దిట శాంతరసము పోషితమైనది. పెద్దన మనుచరిత్రమున నాకాలప్రభావమును బట్టి శృంగారమునే ప్రధానరసముగాఁ గ్రహించినను ఆరంభావసానములందు శాంతమున కఖండ విజయము కలిగించి తనకాలమర్యాద నతిక్రమింపఁ జాలెను.

మను సంభవమునకు హేతువైనది వనదేవతా స్వరోచుల సమాగమము. ఇటఁ గొంతదనుక శృంగారాభాసమును దదుపరి శృంగారమును గనవచ్చుచున్నవి. రసాభాసము రసమగునా? అనౌచిత్యము వలన నాభాసత్వ మావహిల్లును. కాని సదోషత్వము వలన కావ్యమునకును, గీటవిద్ధత్వమువలన రత్నమునకును భంగము రాని విధమున ననౌచిత్యదోష మించుక యున్నంతమాత్రమున రసమునకు భంగము కలుగదు. రసాభాసము వర్ణింపరాదను నిషేధమును ఎచ్చటను గానరాదు.

# ప్రాచీనాంధ్ర చారిత్రిక భూగోళము — నాడులు

కుందూరి ఈశ్వరదత్తు.

(గతసంచికల తరువాయి)

క్రిందటి సంచికలో బారహాద్రోంతి రాజ్యముల స్థలనిర్దేశమును జేయునపుడు 'బారహా'యనునది నేటి 'బారువా'యని నిర్ణయించితిని. కాని యానిర్ణయము సమంజసముకాదేమో యని సంశయము గలుగుచున్నది. కారణ మేమనఁగా పూసపాటిరాజుల పూర్వబిరుదావళిలో "భారుహా (బారహా)మన్న గండపెండేరవిరాజితుఁడు" లేక "భారుహామన్యరాజన్య కోటీరకోటిహీర చారుశుమ్యమాణ సమాశ్రిత పాద పంకజుఁ"డనునొకబిరుదు పూసపాటి తిమ్మభూపాలవిరచిత కృష్ణవిజయ కావ్యమందుఁ గలదని కవిజీవితకారుఁడు వేములవాడ భీమకవి జీవిత చరిత్రమునం దుదాహరించెను. కృష్ణవిజయగ్రంథము పరిశీలించుటకు నాకు వీలుకలుగలేదు. ఈబిరుదు ననుసరించి 'ద్రోంతి'వలెనే, బారహా సహితము నొకరాజ్య మనియు నీబారహారాజ్యము ప్రత్యేకముగ నాంధ్రకావ్యములందుఁ బేర్కొనఁబడెననియు మనము తెలిసికొనుచున్నాము. కాని 'బారహా' 'బారువా'కాదగునా? యని విచారింప వలసియున్నది. ద్రోంతి వలెనే యిదియు మధ్యప్రదేశప్రాంతమే యగు ననుట కవకాశము గలదు. శ్రీకట్టి సాంబమూర్తి శాస్త్రిగారు భారతి పత్రికలో 'బారహా' యనునది నేటి మధ్యప్రదేశమునందుఁ గలదని వ్రాయుచు,నది కాకపోవచ్చుననియు, నేఁటి 'బారువా' యనునదియే 'బారహా'వైయుండునని నిశ్చయించిరి. చరిత్ర పరిశోధక శేఖరులు శ్రీ సోమశేఖరశర్మగారు వారురచించిన రెడ్డిరాజ్యచరిత్రలో బారహా ద్రోంతి రాజ్యములఁ గూర్చివ్రాయుచు, 'బారహా'యనఁగా పండ్రెండ నియు, బారహాద్రోంతిరాజ్యములనఁగా పండ్రెండు వరుసరాజ్యము లనియు, నవ్వియవి నేటివిశాఖపట్టణ గంజాముమండలములకు పశ్చిమమున మధ్యప్రదేశమునకుఁ గల సామంతరాజ్యములనియు నిర్ణయించిరి,

తమ్మభూపాలకృత కృష్ణవిజయములోని పూసపాటి రాజుల బిరుదముఁ బట్టియు, మడికి సింగన్న పద్మపురాణోత్తరఖండములోని ముప్ప భూపాలుని, బిరుదు ననుసరించియు "బారహా" యొకటియు, 'దొంతి' యొకటియు వేఱువేఱు మన్నెరాజ్యములనియు, శ్రీనాథుఁడు వాని రెంటిని జోడించెననియుఁ దెలియనగును. అదియునుగాక శ్రీవేంకటపతి భూపాలకృత "ఉషాభ్యుదయము"లో పూసపాటి తమ్మభూపాలుఁడు "బారుహామన్నె భూపాలర్చితార్హ పాదాబ్జాతుఁ"డని యితని వర్ణించునొకసీసపద్యములోఁగలదు.

సీ॥ దుర్ధరారాతి సందోహ తమఃపట
లార్కుఁడై తనరె నే యధికయశుఁడు,
జయవాటికా పురస్థాన దుర్గాలబ్ధ
వైభవుం డయ్యె నేపార్థివుండు
బారుహా మన్నెభూపాలార్చితార్హ
పాదార్హుఁ డయ్యె నేపార్థివుండు
ధార్మికమతితోడ తమ్మమాంబాప్రాణ
వల్లభుం డయ్యెనే బల్లిదుండు,
గీ॥ నతఁడు వినుతికిఁ దగు సమస్తావనీశ
చంద్రహృద్భల్ల విభుఁడు సాంద్రచతుర
సైన్యవారణ దారుణ సాహసాంక
బాహుబలహేళి తమ్మభూపాలమౌళి.

ఈ "బారహా"యను మన్నెసంస్థానము మధ్యప్రదేశములోని నరసింహాపురము జిల్లా గర్వార తాలూకా యందలి 'బారహా'యై యుండవచ్చునని యూహించుచున్నాను. 'దొంతి'యు మధ్యప్రదేశములోనిదే యైయుండెను. ఈ విషయము పరిశోధనము గావింపఁదగినది. ఇంతదనుక ఆంధ్రసారస్వతసమ్మతమైన 'బారహాదొంతిమన్నె

భూపాలురం గూర్చి గల ప్రమాణములం జూపితిని. స్థలనిర్ణయమును గావించితిని. ఇంక చరిత్రపరిశోధక విచక్షణులకు వదలివేయు చున్నాను.

### కి ల్ల డ సీ మ

క్రిందటి వ్యాసములో నుదహరించిన 'కిల్లడసీమలోపలి గొబ్బూరు గ్రామము చీపురుపల్లి తాలూకాలోనిది. అనకాపల్లి తాలూకాలో సహితము గొబ్బూరు అను గ్రామము కలదు. కాని శాసనకర్త జంతరునాంటి సింగరాజు కొడుకు ప్రతాపసూర్మరాజగు టచే నీ కిల్లడసీమలోని గొబ్బూరు జంతరునాంటి పరిపాలకుల యధీన ములోనుండు గ్రామమగునని యూహించి, చీపురుపల్లి తాలూకా లోని గొబ్బూరె అగునని నిర్ణయించితిని.

### దిమిలినాడు

దిమిలివిషయము కుబ్జవిష్ణువర్ధనుని చీపురుపల్లి శాసనములో పేర్కొనంబడినది. శ్రీవిష్ణువర్ధన మహారాజు దిమిల విషయములోని కల్వకొండ గ్రామమును విష్ణుశర్మ మాధవశర్మ లనునిద్దరి బ్రాహ్మణు లకు దానమొసంగెను. దాక్షారామములోని కులోత్తుంగచోడదేవని యొక్క శాసనములో "వేంగినాణ్డైన ఉత్తమచోడమణ్డలమున డిమిల నాంటి తొణ్ణవాడ జియ్యహారినాంటి జియ్యహారితిరుమలయి శ్రీపరాంత కేశ్వర మహాదేవరకు సీయూరి వలయుచుట్టు...సర్వకర పరిహారము ...నాచంద్రార్కము సనుభవింపంగలవారుగా దయసేసిరి" అని డిమిల (దిమిల) నాడు వేంగినాంటిలోని యంతర్భాగముగాం జెప్పం బడినది. ఈ దిమిల గ్రామము ఎలమంచిలికి మూండుమైళ్ళ దూర మున నున్నది.[1]

1. దక్షిణ హిందూదేశ శాసన సంపుటము 4, సంఖ్య 1224.

### ప్లక్కి విషయము లేక పాళకి విషయము

ఈప్లక్కి లేక పాళకివిషయము కుబ్జవిష్ణువర్ధనుని తిమ్మాపురము, చీపురుపల్లి శాసనములలోను, ఇంద్రవర్మ రామతీర్థము శాసనములోను పేర్కొనఁబడినది. తిమ్మాపురము శాసనములో కూములూరు గ్రామమును, చీపురుపల్లి శాసనములో చెఱుపూరు గ్రామమును, రామతీర్థము శాసనములో పెరువాటక గ్రామమును నీవిషయములోని గ్రామములుగ వ్రాయఁబడెను. ఈప్లక్కివిషయము చీపురుపల్లి తాలూకా ప్రాంతమై యుండనోపునని యూహించుచున్నాను. పై నుదహరింపఁబడిన గ్రామముల స్థలనిర్దేశపరిశోధన మింకను గావింపవలసియున్నది. 2

### సారకినాడు

విశాఖపట్టణమండలములోని విజయనగరము తాలూకాలోని రెండుశాసనములు సారకినాటిని పేర్కొనుచున్నది. ఆరెండు శాసనములును అనంతవర్మదేవుని శా. శ. 1061 నాఁటి శాసనములు. ఆ రెండును సారకినాటిమఱుచెఱ్వు గ్రామములోని సోమేశ్వరదేవర కిచ్చిన దానశాసనములు. విజయనగరము తాలూకాలో సారిక యను గ్రామము కలదు. ఈసారికనాటికి ఆ గ్రామమునుబట్టి పేరు వచ్చియుండును. మఱుచెఱువు మరువాడనైయుండనోపును. 3

### కళింగము

కళింగము పూర్వసముద్రతీరమున చరిత్రప్రసిద్ధిని గాంచిన దేశములలో నొకటి. పురాణేతిహాసరూప సంస్కృత సారస్వతమునం

---

2- 1. తిమ్మాపురము శాసనము-ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము. 9పుటలు 317-318.

2. చీపురుపల్లి శాసనము-ఇండియన్ ఏంటిక్వెరీ సంపుటము 20-పుట 16.

3. రామతీర్థము శాసనము-ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము. 12పుట 133.

---

3. దక్షిణ హిందూదేశ శాసనసంపుటము 10. సంఖ్యలు 690-691.

ముదాహరింపఁబడినట్లును, ఆంధ్రశాసన వాఙ్మయములందు వక్కాణింపఁబడినట్లును విదితమె. ప్రస్తుతము కళింగ దేశ విస్తీర్ణము ముఖ్యాంశము.

రాజశేఖరుఁడు కావ్యమీమాంసలో కళింగమును భరతఖండములో పూర్వదేశము లోనిదిగా విశదపఱచెను.

"తత్ర వారాణస్య పురతః పూర్వదేశః. యత్రాంగ కళింగ కోసల తోసల ఉత్కళ మగధ ముద్గర విదేహ పుండ్ర ప్రాగ్జ్యోతిష తామ్రలిప్తక మలద మల్లవర్తక సుహ్మ బ్రహ్మోత్తర ప్రభృతయో జనపదాః"

వాత్స్యాయన కామసూత్రములకు వ్యాఖ్యాతయైన జయమంగళుఁడు కళింగ దేశసీమానిర్ణయ మిట్లు గావించియున్నాఁడు.

"వంగాలౌహిత్యాత్ పూర్వేణ, అంగామహానద్యాః పూర్వేణ కళింగా గౌడవిషయాద్దక్షిణేన..."

అనఁగా కళింగ దేశము గౌడ దేశమునకు దక్షిణమున నుండెను.

అశోకుని కళింగశాసనములు, ఖారవేలుని హాంథిగుంఫా శాసనమును, సముద్రగుప్తుని గయాశాసనమును, కళింగమును బేర్కొనె నని చరిత్రజ్ఞులకు విదితమే. గయాశాసనములోని పిష్టపురమహేంద్రుని తర్వాత పిష్టపుర మేలిన రాజులఁగూర్చి శాసనములు దెలుపుచున్నవి. మాఠరవంశజుఁడును, వాసిష్ఠీపుత్రుఁడును నగు శక్తివర్మ రాగోలు శాసనములో నతఁ డిట్లభివర్ణింపఁబడెను

"సిద్ధిరస్తు స్వస్తి విజయ పిష్టపురాత్ కళింగాధిపతి ర్మాగధ కులాలంకరిష్ణు ర్వాసిష్ఠీపుత్రో మహారాజశ్రీ శక్తివర్మా కళింగ విషయే రాకలువగ్రామే సర్వసమన్వాగతా న్గృహపతితో"

ఈ శాసనమునుబట్టి శక్తివర్మ కళింగాధిపతియనియు, పిష్టపురము కళింగరాజ్యములోనిదియనియు స్పష్టము. ఈ రాకలువ

గ్రామము శ్రీకాకుళము తాలూకాలోని రాగోలు గ్రామము [4]

తర్వాత నితని వంశములోని వాఁడైన అనంతశక్తివర్మ శృంగవరపుకోట శాసనములో నితనితాత గుణవర్మ దేవరాష్ట్రాధిపతి యనియు అనంతవర్మ కళింగాధిపతియనియుఁ దెలుపఁబడినట్లు దేవరాష్ట్రమును గూర్చి వ్రాసినపుడు విశదీకరించితిని. ఈ దేవరాష్ట్రమును, ఎలమంచిలి కళింగవిషయమును విశాఖపట్టణమండలములోని సర్వసిద్ధితాలూకా ప్రాంతమైయుండునని యుఁజరిత్రకారుల నిర్ణయము. కావున కళింగ మనునది నేటి పిఠాపురము మొదలు ఆ కాలమున నుత్తరమున శ్రీకాకుళము తాలూకా వఱకును వ్యాపించియుండెను. పిఠాపురమె దక్షిణసరిహద్దుగా నుండెను.[5]

పై శాసననిబంధన మట్లుండగా మంచనకవి తాను రచించిన కేయూరబాహుచరిత్రలో కొమ్మనమంత్రిని గూర్చి "కళింగ రాష్ట్రంబులోని యెలమంచి లాదిగా నెలమి ముప్పదిరెండు విష్ణుప్రతిష్ఠలు వెలయఁజేసె" నని వర్ణించియున్నాఁడు. రామకృష్ణకవి పాండురంగమాహాత్మ్యములోని నిగమశర్మోపాఖ్యానంబునందు సభాపతియను బ్రాహ్మణుని వర్ణించుచు "సతఁడు కళింగ దేశాభరణంబగు పీఠికాపురం బధిష్ఠించి సకలమహీసురపర్వ శ్రేష్ఠుండై వెలసె నని" చెప్పియున్నాఁడు. పూర్వము శాసనములం దుదాహృతమైన విషయమె పురాణములందును పిఠాపురమొకప్పుడు కళింగ దేశాంతర్గతమై యుండెననియుఁ దెలియుచున్నది.

పై నుదహరింపఁబడిన ప్రమాణముల ననుసరించి కళింగము

---

4. రాగోలు శాసనము. ఎపిగ్రాఫియా ఇండికా-సంపుటము. 12. ఫలకలు 1-3 శాసనములో తేదీలేదు.

5. అనంతవర్మ శృంగవరపుకోట శాసనము ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము 23. సంఖ్య 9. (క్రీ. శ. 450-500.)

దక్షిణమున గోదావరీతీరమువఱకు వ్యాపించియుండె ననుటకు సందేహము లేదు. పై విషయమె పాశ్చాత్యచరిత్రకారులు సహితము స్థిరపఱచిరి.[6] వరాహవర్తనీవిషయము. జంతుర్నాడుల గూర్చి వ్రాసిన పుడాసీమలు గాంగవంశరాజులకాలమున కళింగములోనివె యని వ్రాసియుంటిని.

### కళింగదండపాట

సింహాచలములోని శ్రీకృష్ణదేవరాయల క్రీ. శ. 1519 నాటి శాసనములో నామహారాజు "ప్రతాపరుద్ర గజపతి మహారాయల చేతను పుచ్చుకొన్న గ్రామాలు కళింగదండపాటలోని గ్రామాలు పెదగాణిగ్రామము అగనపూడిగ్రామము అదుకుచెల్లెపల్లెలు గంధవరంపాల్లెను పిన్న అగ్నపూడిపలెను ఉభయం గ్రామాలు౨"సింహగిరి అప్పనికి భోగము నిమిత్తము దానము చేసినది చెప్పఁబడినది. పైన చెప్పఁబడిన పెదగాణియు, గంగవరంపల్లెయు, నేటి విశాఖపట్టణము తాలూకాలోని పెదగాణియు, గంగవరముగ్రామములే.

సింహాచలములోని మఱియొక శాసనములో ప్రతాపవీర నరసింహదేవ మహారాజులభార్య పార్వతి కళింగదేశములోని 'అనకపల్లి నావులపల్లి, పిశినికవాడ, ఎడువాకనాడు ముమ్మడివాడ క్రయముగా విలిచి సింహాద్రినాథునికి సమర్పించెనని గలదు. అనకపల్లి(అనకాపల్లి) పిశినికవాడ (పిషిణికాడ) అనకాపల్లి తాలూకాలోఁగలవు.[7]

కాఁబట్టి కళింగ మనునది ఇప్పటి విశాఖపట్టణ శ్రీకాకుళజిల్లాలకు (ఏజెన్సిభాగము తప్ప) సరివచ్చుభూభాగము. ఈప్రాంతములో

---

6. కన్నింగ్ హామ్ ప్రాచీనభూగోళ చరిత్ర పుట.516

రేప్సన్ ప్రాచీన హిందూదేశము. పుట 164.

(Ancient Gegrophy of India P. 516 Ancient India P. 164)

7. దక్షిణహిందూదేశ శాసన సంపుటము, 6 సంఖ్యలు 731, 695

దొరకిన శాసనములన్నియుఁ దెలుఁగు భాషలోనే లిఖింపఁబడినవి. ఈ దేశమునకు కళింగాంధ్ర దేశమను నామమే సార్థకమైనది. అదృష్ట వశమున కళింగ మిప్పు డాంధ్రప్రదేశములోఁ గలసి పోయినది.

### కళింగము-త్రికళింగము

పూర్వచాళుక్యరాజన్యుల శాసనములలో వారు కళింగమును, త్రికళింగమును స్వాధీనపఱచుకొనినట్లు శాసనాధారము లనేకము లున్నవి. చాళుక్యభీముని బందరు శాసనమువల్లను మల్లపదేవుని పిఠాపురముశాసనమువల్లను మూఁడవ విజయాదిత్యుఁడు కళింగగాంగ రాజుల నోడించి, వారినుండి సువర్ణమును బలాత్కారముగఁగొని, కొన్ని యేనుఁగులను గప్పముగ గ్రహించెనని తెలియుచున్నది. విజయాదిత్యుని యొకశాసనములో "సత్రికళింగ వేంగిమండల మపాలయత్" అని వ్రాయఁబడినది. రెండవ అమ్మరాజు వేంగీదేశమును త్రికళింగ దేశసహితముగ రక్షించె నని మఱియొక శాసనముఁగలదు.

"తస్యమహేశ్వరమూర్తేః భీమభూపతేః ఉమాసమానాకృతేః లోకమహాదేవ్యాః కుమారాభఃఖలు యస్మభవదమ్మరాజాఖ్యః ఆసౌ సమ్యగ్ధర్మన్యాయేన వేంగీదేశం త్రికళింగసహితం రక్షతి స్మ" మొదటి అమ్మరాజు శాసనములో చాళుక్యభీముని కుమారుఁడైన విజయాదిత్యుఁడుత్రికళింగాటవీ యుక్తముగ వేంగిదేశమును పదియాఱు మాసములు పరిపాలించి దివంగతుఁ డయ్యెనని వ్రాయఁబడినది.

"తత్సూను ర్విజయాదిత్యః షణ్మాసాన్ వేంగిమండలం త్రికళింగాటవీయుక్తం పరిపాల్య దివం యయౌ" ॥

పై శాసన దృష్టాంతముల ననుసరించి కళింగము వేఱు, త్రికళింగము వేఱను విషయము స్పష్టము. అంతకుఁబూర్వమే పూర్వగాంగోర్వీపతు లీత్రికళింగము నేలుచుండిరని మొదటి ఇంద్రవర్మ మహాసామంతవర్మల (క్రీ. శ. 537; 562) శాసనములను బట్టి తెలియుచున్నది

కడపటి వర్మాభిధానులకు కళింగాధిపతులు అనుబిరుదు గలదు. త్రికళింగాధిపతి యను పేరు వహించి డెబ్బదియేండ్లు అవిచ్ఛిన్నముగా కళింగమేలిన పూర్వగాంగులలో అనంతవర్మ చోడగంగు సుప్రసిద్ధుఁడు ఇతఁడు క్రీ.శ. 1078 మొదలు క్రీ. శ. 1152 వఱకు కళింగమేలిన సుప్రసిద్ధభూపాలుఁడు.

త్రికళింగాధిపతులని పేరుపొందిన రాజన్యులలో కటకము నేలిన సోమవంశీయు లను నరపతులును కాలచురివంశజులగు చేది దేశపు రాజులును గలరు.

శ్రీ రామదాసుగారు ఆంధ్రచారిత్రక పరిశోధకమండలివారి త్రైమాసిక పత్రికలో త్రికళింగమును గూర్చి వ్రాయుచు, త్రికళింగ మనునది కళింగదేశమునకు తూర్పునను దక్షిణకోసలప్రాంతమునైన దేశభాగ మని నిర్ణయించిరి. వారే మఱియొక చోట త్రికళింగ మను నది మహేంద్రపర్వతమునకు పశ్చిమమును, మహానది కుత్తరమున లాంగుల్యనదీ జన్మస్థలప్రాంతము నగు దేశమని నిర్ణయించినట్లు మూఁడవ వజ్రహస్తుని గంజాముశాసనసంపాదకులు వ్రాసియున్నారు. వారు రామదాసుగారితో పూర్తిగ నేకీభవింపకున్నను త్రికళింగ మనునది, కళింగమునకు పశ్చిమప్రాంతారణ్య భూభాగమని నిర్ణయించిరి. అదియే త్రిలింగాటవి కాఁబోలు.

---

అనంతవర్మ చోడగంగుని

1. చికటిశాసనము భారతి సంపుటము సంచిక 2.
2. బొడ్డపాడు శాసనము భారతి సంపుటము 3 సంచిక 5.
3. కొర్ని శాసనము భారతి సంపుటము 2 సంచిక 2

Andhra Historical Research Sosiety Journal Vol: I. Page16, 23.

మూఁడవ వజ్రహస్తుని గంజాము శాసనము. ఎపిగ్రాఫియా ఇండికా సంపుటము. 23-సంఖ్య. 11

పై వ్రాతలనన్నిటిని సమన్వయింపఁగా, త్రికళింగ దేశము, మహానది కుత్తరప్రాంతమును, మహేంద్రపర్వతమునకు పశ్చిమమును, దక్షిణ కోసల దేశములోని దక్షిణ ప్రాంతములై యుండవచ్చునని యూహింపనగును.

### త్రిలింగదేశము

త్రిలింగ దేశ సీమానిర్ణయమును గావించు శాసన సారస్వత ప్రమాణము లీదిగువ నుదాహరించుచున్నాను. బ్రహ్మాండపురాణము లోనిదగు నీదిగువశ్లోకము ఆంధ్రచరిత్రకారుఁడుదాహరించియుండెను.

“శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతం
ప్రాకారంతు మహ త్కృత్వా త్రీణి ద్వారా నుపాకరోత్.

కాకతీయ ప్రతాపరుద్రుని యాస్థానపండితుఁడగు విద్యానాథకవి ప్రతాపరుద్రీయములో నాటక ప్రకరణమున త్రిలింగ దేశ వ్యాప్తిని వివరించియున్నారు.

స్వామిం స్త్రిలింగదేశ పరమేశ్వర !
యైర్దేశస్త్రిభి రేవయాతి మహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా
యేషాం కాకతిరాజకీర్తి విభవైః కైలాస శైలాః కృతాః,
తే దేవాః ప్రసరత్ప్రసాదమధురా శ్రీశైలకాళేశ్వర
ద్రాక్షారామ నివాసినః ప్రతిదినం త్వచ్ఛ్రేయసే జాగ్రతు.

నాటక ప్రకరణము పంచమాంకము శ్లోకము 44.

విద్యానాథకవికి నూఱుసంవత్సరములు తర్వాత నుండిన విన్నకోట పెద్దన్న విశ్వేశ్వర భూపతి కంకిత మిచ్చిన కావ్యాలంకార చూడామణిలో త్రిలింగ దేశ సీమానిర్ణయమును జెప్పియుండెను.

కం. ధర శ్రీపర్వత కాళే
శ్వర ద్రాక్షారామ సంజ్ఞ వఱలు త్రిలింగా
కరమగుట నంధ్ర దేశం
బరుదారఁ ద్రిలింగ దేశమనఁ జను గృతులన్.

పెద్దన కావ్యాలంకార చూడామణిని క్రీ. శ. 1403 తర్వాత రచించి యుండెనని తక్కిన యాధారములతో శ్రీ సోమశేఖరశర్మ భారతి పత్రికలో నిర్ణయించియున్నారు. విన్నకోట పెద్దనకు సమకాలికుఁడును రెడ్డిభూమీశ్వరుఁడునైన పెద్దకోమటి వేమభూపాలుని యాస్థానకవియునైన వామనభట్టబాణుఁడు తాను రచించిన వేమభూపాలీయములో అద్దంకినగరము త్రిలింగ జనపదములోనిదిగా వర్ణించెను.

శ్రీనాథమహాకవి భీమేశ్వరమండలమును (దాక్షారామ) త్రిలింగ విషయ మంగళా లంకారమని నివర్ణించెను. రెడ్లనాటి శాసనములలో ఆంధ్ర దేశమునకు త్రిలింగ సంజ్ఞయే వ్యవహారసిద్ధమైయున్నట్లు ప్రకాశింపఁబడినది. ముమ్మడినాయకుని శ్రీరంగశాసనమునందును, సింగయ నాయకుని అక్కలపూడి శాసనమునందును త్రిలింగ దేశము పేర్కొనఁబడినది. శ్రీనాథుని పొన్నుపల్లి ఆలపాడు శాసనములలో వెలనాడు త్రిలింగవిషయము లోనిదిగా వర్ణింపఁబడెను.

శ్లో॥ ప్రావాత్త్రిలింగవిషయే వెల్నాడో ర్దివిసీమని
కృష్ణవేణ్యా స్తరంగిణ్యాః ప్రతీరే పర్యవస్థితః॥

పొన్నుపల్లి శాసనము (క్రీ. శ. 1408)

శ్లో॥ ప్రాదాత్త్రిలింగవిషయే వెలనాండౌ మనోరమే।
తుంగభద్రా తరంగిణ్యాః ప్రాక్తీరే పర్యవస్థితః.

ఆలపాడు శాసనము (క్రీ. శ. 1413)

నరసారావుపేటలోని అప్పాపురము శాసనములో నొకదాని యందు ఆంధ్రదేశ చారిత్రిక భూగోళము నీ క్రిందివిధమున వివరించెను. "స్వస్తి సమస్త ప్రశస్తి సహితంబై అనల్పంబైన కల్పారంభ కాలంబున మహా వరాహ దంష్ట్రాశిఖరంబున నుద్ధృతంబై పంచాశత్కోటి యోజన విస్తీర్ణంబైన భూమండలంబునందు జంబూద్వీపం

బులో భారతవర్షంబున భారతఖండంబున మేరుపర్వతంబునకు దక్షిణదిగ్భాగంబున శ్రీశైల వాయసముద్రపార్శ్వంబున నోంకార నదీ తీరంబున త్రిలింగ దేశాలంకారంబైన కోటభూమి కమ్మనాంటి సీమాస్థలంబునందు నాదిండ్లపురంబున"... •

త్రిలింగ దేశములో కోట (ధరణికోట) భూమియు, కమ్మనాడును, నంతర్భాగములని పై శాసనము వివరించుచున్నది. త్రిలింగమును గూర్చి యిదివఱకు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక, ఇరువదియెనిమిదవ సంపుటము, నాల్గవసంచికలో విపులముగాఁ జర్చించియున్నాను ఈవ్యాసములో నొక్కసీమానిర్ణయము ముఖ్యాంశముగనుక, త్రిలింగ దేశసీమఁగూర్చి శాసన సారస్వత ప్రమాణముల నిచ్చియున్నాను. శ్రీశైలము, ద్రాక్షారామము సుప్రసిద్ధ శైవక్షేత్రములు. మొదటిది కర్నూలుమండలములోనిది. రెండవది తూర్పుగోదావరి మండలములోనిది. కాళేశ్వరము తెలంగాణములో కరీంనగరజిల్లాలో గోదావరీ తీరమందున్న మంథెన కాళేశ్వరము. అద్దంకి గుంటూరు మండలములోనిది. కాఁబట్టి త్రిలింగ దేశమనునది, ఇప్పటి తూర్పుగోదావరి, కృష్ణ, పడమటి గోదావరి, గుంటూరు, కర్నూలు మండలప్రాంత భూమియు, తెలంగాణములోని కరీమ్‌నగరము, వరంగల్లు, నల్లగొండ హైదరాబాదు,మహబూబునగరు,ఖమ్మంజిల్లాలో ప్రాంతములనియు నిర్ణయింపవచ్చును. పైని వివరింపఁబడిన కళింగ,త్రికళింగ, త్రిలింగములు వేర్వేఱు జనపదములనియు, నొకదానితో నొకదానికి సంబంధము లేదనియు గ్రహింపవచ్చును. తెలుఁగుపదము త్రికళింగమునుండిగాని, త్రిలింగమునుండిగాని పుట్టియుండలేదు. ఈ విషయమై తెలుఁగు దేశమునుగూర్చి వ్రాయునపుడు మరలఁ జర్చించెదను.

[సశేషము]

---

దక్షిణహిందూదేశ శాసనల సంపుటము 10 సంఖ్య 578.

# వ్యక్తివివేకము

భాగవతుల కుటుంబశాస్త్రి.

(సంపుటము 45. 4వ సంచికనుండి)

ఈవాక్యము వేణీసంహార నాటకములోనిది. సూతుఁడు దుర్యోధనునితోఁ జెప్పుచున్నాఁడు.

తా. ఒకేరథమునెక్కి, అటునిటు నిన్నుఁగుఱించి యడుగుచు వారిద్దఱు వచ్చుచున్నారు.

కశ్చ కశ్చ—ఎవరు ? ఎవరు ?

"అర్జునశ్చ సకర్ణారిః, సచ కూ్రరో వృకోదరః"

(వే. సం. 5. అంకము)

తా. కర్ణునకు శత్రువైన యాయర్జునుఁడు, కూ్రరుఁడైన యా వృకోదరుఁడును అని సమాధానము.

ఇచట, నిద్దఱు వచ్చుచున్నారని చెప్పినపుడు, దగ్గఱనున్న వారందఱును, సహజముగ నెవ రెవరు ? అని రెండుపర్యాయములు ప్రశ్నించినారు. కశ్చ, కశ్చ-అనుటకు బదులుగ "కౌతౌ" అని యేక శేషఁజేసి వారిరువు రెవరు ? అని ప్రశ్నించినను ప్రశ్నింపవచ్చును. కాని వ్యస్తముగనున్నప్పటి రమణీయత రాదు. వ్యస్తముగనున్నపుడు ఇరువురిలో నొక్కొకనికిని పృచ్ఛన్తౌ (అడుగుచు) ప్రాప్తౌ (వచ్చినారు) అను క్రియలతో ప్రత్యేకసంబంధ ముండును. అట్లు ప్రత్యేకముగ నున్నపుడు, ప్రష్టకుఁగల జిజ్ఞాసాతిశయము వ్యంగ్యమగును. ఏకశేషఁ జేయుచో నా ప్రత్యేకజిజ్ఞాస వ్యక్తముకాదు.

ఎచట నీవిధముగ నిది ప్రధాన మిది యుప్రధానమని మనము చెప్పఁదలచుకొనమో, యెచట విశేషణ విశేష్యభావమున కాదు యా వస్తువులస్వరూపమును మాత్రము తెలియఁజేయుటయే తాత్పర్యమో

యచట సమాసముం జేసినను, చేయకున్నను దోషములేదు. మనయిష్ట మువచ్చినట్లు చేయవచ్చును. ఉదా:—

స్తనయుగ మశ్రుస్నాతం సమీపతరవర్తి హృదయశోకాగ్నేః
చరతి విముక్తాహారం వ్రతమివ భవతో రిపుస్త్రీణామ్.

అర్థము:—అశ్రుస్నాతం=భర్తృవియోగమువలన హృదయమునందుఁగల్గిన శోకమనెడు నగ్నికి,సమీపతరవర్తి=బాగుగా దగ్గఱగానున్నట్టియు, విముక్తాహారమ్=వి+ముక్తాహారమ్=తీసివేసినముత్యాలహారములు గలట్టియు (విముక్త+ఆహారమ్=వదలిన ఆహారముగలట్టియు) భవతః=నీయొక్క, రిపుస్త్రీణామ్, స్తనయుగమ్=శత్రుస్త్రీలయొక్క స్తనయుగము (కర్త) వ్రతమ్, చరతీవ=వ్రతము నాచరించుచున్నదా యన్నట్లున్నది.

తా. వ్రతము చేయువారు స్నానముచేసి, అగ్ని నారాధించి, విముక్తాహారులగుదురు. (ఆహారమును విసర్జింతురు)ప్రస్తుత మొకరాజు శత్రువులనందఱను చంపినాఁడు. ఆశత్రువుల భార్యలు విలపించుచు, శోకమున మునిఁగి, మెడలోనిహారములను తీసివేసినారు. ఈవిషయమునే కవి యిట్లు వర్ణించినాఁడు."నీశత్రుస్త్రీల స్తనయుగము కన్నీటితోస్నానమాడి,హృదయ శోకాగ్నికి సమీపమున నున్నదై,విముక్తాహారమై వ్రతము నాచరించుచున్నదా యన్నట్లున్నది. ఇచట విముక్తాహారత యనునదియే శబ్దసాధర్మ్యము. అర్థములో భేదమున్నది. సాదృశ్యములేదు.

ఇచట రిపుస్త్రీణామను పదమునకు భవతః యనునది విశేషణము. స్తనయుగమను దానికి రిపుస్త్రీణామనునది విశేషణము. ఈవిశేషణములవలన నాపదముల యర్థమునకువచ్చు నుత్కర్షాతిశయ మేమియులేదు. కేవలము సంబంధము మాత్రము వివక్షితము. అందుచే నిచట భవద్రిపుస్త్రీణామ్ అనిగాని, రిపు-స్త్రీస్తనయుగమనిగాని భవ

దరివధూస్తనద్వితయ మనిగాని సమాసముం జేయకుండుట వలన వచ్చు విశేషముగాని, చేయుటవలనవచ్చు దోషముకాని లేదు. ఈ శ్లోకమునందే రిపుస్త్రీణామ్ అను సమాసమునందు రిపుపదము స్త్రీ సంబంధిత్వమును దెల్పినట్లే పైసమాసములయందును, విశేషణములు సంబంధిత్వమును మాత్రము తెల్పును. ఇంతవఱకుఁదెల్పిన విషయమీ సంగ్రహశ్లోకములయందు ప్రతిపాదితమైనది.

"వినోత్కర్షాపకర్షాభ్యాం స్వదన్త్యర్థా నజాతుచిత్
తదర్థమేవ కవయోఽలంకారాన్ పర్యుపాసతే. 14
తౌ, విధేయానువాద్యత్వ వివక్షైకనిబన్ధనౌ
సా సమాసే న్త మాయాతీత్యసకృత్ ప్రతిపాదితమ్. 15
అత ఏవచ వైదర్భీరీతి రేకైవ శస్యతే
యత స్సమాససంస్పర్శ స్తత్ర నైవోపపద్యతే. 16
సంబంధమాత్ర మర్థానాం సమాసో హ్యావబోధయేత్
నోత్కర్షమపకర్షంవా—వాక్యాత్తూభయమ ప్యదః. 17

తా. ఉత్కర్షమో యపకర్షమో లేనిదే ఏయర్థమును రమణీయముగ నుండదు. ఆయుత్కర్షాపకర్షలను ప్రతిపాదింపనెంచియే కవు లుపమారూపకోత్ప్రేక్షాద్యలంకారములను కూర్తురు. ఒకవాక్యమునం దాయావిషములను విధేయములుగనో, అనువాద్యములుగనో వివక్షించినపుడే (చెప్పఁదలచినపుడే) యాయావిషయములయొక్కయుత్కర్షాపకర్షలు భాసించును. సమాసముఁ జేయుచో నాయుత్కర్షాపకర్షభావము భాసింపదు.అందువలననే వైదర్భీరీతి సర్వోత్తమమని ప్రశంసింపఁబడుచున్నది. ఆరీతియందు సమాస సంస్పర్శయే యుండకపోవుటచే నందుత్కర్షాపకర్షములు స్ఫుటముగ భాసించును. సమాసమందున్ననో సంబంధము మాత్రమే భాసించును గాని యుత్కర్షాపకర్ష

ములు భాసింపవు. సమాసరహితమైన వాక్యమున సంబంధముమాత్ర మేగాక యుత్కర్షాపకర్షములుకూడ భాసించును.

సమాసమునం దుత్కర్షాపకర్షములు భాసింపవనుట కుదాహరణము.

ఊర్ధ్వాక్షితాప గలితేన్దు సుధాలవాక్త
జీవత్కపాలచయ ముక్త మహాట్టహాసమ్
సన్త్రస్త ముగ్ధగిరిజావలితాంగ సంగ
హృష్టం వపు ర్జయతి, హారి, పినాకపాణేః"

అర్థము : ఊర్ధ్వాక్షి...హాసమ్ = నుదుటియందున్న యగ్ని రూపమైన నేత్రముయొక్క వేడిచే కరిగిన చంద్రునియొక్క యమృత లేశముయొక్క సంపర్కముచే బ్రతుకుచున్న పుఱ్ఱెలసమూహముచేతం జేయంబడిన మహాట్టహాసము (పెద్దనవ్వు) గలట్టియు, సంత్రస్త... హృష్టం=భయపడిన అమాయకురాలగు పార్వతియొక్క, త్రిప్పంబడిన శరీరముయొక్క సంపర్కముచే సంతోషము నందినట్టియు, హారి=హారములు గలట్టియు, పినాకపాణేః=ఈశ్వరునియొక్క, వపుః=శరీరము, జయతి=జయించుచున్నది.

తా॥ ఈశ్వరుని నుదుటియందున్న మూండవకన్ను, అగ్ని స్వరూపము. ఆ యగ్ని వేడిమికి శివుని శిరస్సునందున్న అమృతమయుండగు చంద్రుండు కరిగిపోయినాడు అయమృతపుంబొట్లు శివుండు ధరించు పుఱ్ఱెలమీాదం బడినవి. అపు డవి ప్రాణవంతములైనవి. ఒక్కసారి పక్కున నవ్వినవి. ఈనవ్వునకుం గారణము పార్వతికిం దెలియలేదు. ఆమె భయపడినది. ప్రక్కకు తిరిగినది. అపు డామెశరీరము శివుని శరీరమునకుం దాకినది. ఆనందాతిశయముచే శివునియొడలెల్ల గగుర్పాటునొందినది. అట్టి యీాశ్వరశరీరముజయించుచున్న దనిభావము.

ఇచ్చట మొదటి మూఁడుపాదములయందలి రెండు సమాసముల యందును సంబంధము మాత్రమే భాసించును. ఉత్కర్షాపకర్షలు భాసింపవు.

వాక్యమునం దుత్కర్షాపకర్షలుకూడ భాసించు ననుట కుదాహరణము.

న్యక్కారోహ్యాయమేవ, మే యదరయ, స్తత్రాప్యసౌ తాపసః
సోఽప్యత్రైవ నిహన్తి రాక్షసకులం,జీవత్యహో రావణః,
ధిక్ ధిక్ శక్రజితం, ప్రబోధితవతా కిం కుంభకర్ణేన వా
స్వర్గగ్రామటికా విలుంఠనవృథోచ్ఛూనైః కిమేభి ర్భుజైః.

సందర్భము :— శ్రీరాముఁడు రాక్షస సంహారముసేయుచుండ రావణుఁ డనుకొనుచున్నమాటలు :— మే=నాకు (మూఁడు లోకములనువశముచేసికొనిన నాకు-అని భావము) అరయః—శత్రువులు (ఒకఁడు కాదు-అనేకులు.నాకనేకులు శత్రువులుండుట యనుచితము- "మే"- అను పదములోని షష్ఠీవిభక్తికి సంబంధ మర్థము- అనేక శత్రుసంబంధానౌచిత్యము క్రోధమునకు విభావము. అరయః- అను పదమునందలి బహువచన మీభావమును ధ్వనింపఁజేయును) ఇతి యత్=అనుటయే, న్యక్కారః=అవమానము (నింద) తత్రాపి=అందును, అసౌ, తాపసః—తపసుచేసుకొను నితఁడు నాయకుఁడా! తత్ర=అపి=అను రెండునిపాతల సముచ్చయము. అత్యంత మసంభావ్యత్వమును కలలోనైన నూహింపరాని దనువిషయమునువ్యక్తముసేయును. తపో విద్యతేయస్యసః తాపస :—తపసున్నవాఁడు తాపసుఁడు- ఇచట తద్ధిత ప్రత్యయ మున్నది- దీనిని మత్వర్థమందురు. ఈమత్వర్థీయ తద్ధితప్రత్యయము- పౌరుష కథాహీనత్వమును సూచించును) సోపి=మనుష్య మాత్రుఁడైన ఆతాపసుఁడును (రాముఁడును) అత్ర+ఏవ=నేనున్నయీతావుననే, రాక్షసబలమ్, నిహన్తి—ఒకరి నిద్దఱను

గాదు. రాక్షసవంశమును నిశ్శేషముగా చంపివేయుచున్నాఁడు. (ఇచట నిహన్తి అనుక్రియాపదములోని "తి" ప్రత్యయము సః, కులమ్, అత్ర అను పదములోని కర్తృ, కర్మాది కరణకారకములును కలిసి రావణ పౌరుషము వ్యర్థమను విషయమును ధ్వనింపఁజేయును). అహో= ఎంతయాశ్చర్యము! రావణః జీవతి=రావణుఁడు జీవించియున్నాఁడు రావయతీతిరావణః మూఁడులోకముల నేడ్పించినవాఁడు రావణుఁడు. అని వ్యుత్పత్త్యర్థము. అట్టినేను ప్రస్తుతము కూడ జీవించియే యున్నాను!) శక్రజితమ్=ఇంద్రుని జయించిన ఇంద్రజిత్తును, ధిక్ ధిక్ ఛీఛీ (అతఁడును మనుష్యమాత్రుని చేతిలో నోడిపోయినాఁడు.)

ప్రబోధితవతా=బాగుగా మెలకువ వచ్చిన కుంభకర్ణేనవా= కుంభకర్ణునితోనైనను ఏమిలాభము! (ఏమియు లేదని భావము) స్వర్గగ్రామటికా విలుంఠన వృథోచ్ఛూనైః=స్వర్గమనెడు చిన్నగ్రామముయొక్క నాశనముచేత వ్యర్థముగ బలిసిన, ఏభిః భుజైః=ఈ చేతులచేతను, కిమ్=ఏమిప్రయోజనము?(శక్రజిత్ అను పదమునందలి కృత్ప్రత్యయము, ధిక్ ధిక్ అను నిపాతలు కలిసి ఇంద్రుని జయించుటయనెడిది ప్రస్తుతము కల్పిత కథయేమోయని యనుపించుచున్నదను భావమును వ్యంగ్యముసేయును. గ్రామటికా అనుపదములోని, తద్ధిత ప్రత్యయము, స్త్రీలింగమును కలిసి, స్వర్గమును జయించుటలోఁ గొప్పతనమేమియుఁ గన్పడుటలేదను భావమును వ్యక్తముసేయును. విలుంఠనము నందలి 'వి' యను నుపసర్గ-విశేషముగ నను నర్థము నిచ్చి, నిర్దయతను సూచించును. వృథాపద ము తనపౌరుషమునందలి నింద్యత్వమును వ్యంగ్యముసేయును. భుజైః అనుపదములో బహువచనమున్నది. ఇన్నిభుజములుండియు నేనేమియుఁ జేయలేకపోతినని నీభుజములన్నియు బరువుచేటే యను భావము నభివ్యంగ్యము సేయును. ఇట్లే శ్లోకమును విభజించినకొలఁదియు లేశలేశముగ నమృ

తేము సృవించుచు పాఠకుల చిత్తమునాయత్తముఁ జేసికొనును.

పై శ్లోకములో విడివిడిగ పదములుండుటచేతనే యిన్ని విశేషములు స్ఫురించుచున్నవి. మే యదరయః అనునపుడు "మే","అరయః" అనుపదములు వ్యస్తములుగ నున్నను సంబంధము భాసించుచునే యున్నది. అర్థములలో నుత్కర్షాపకర్షలును భాసించుచునే యున్నవి అటులే మిగిలిన పదములన్నింటియందును నా యీ విశేషములు వ్యంగ్యమగుచున్నవి. ఈశ్లోకమునే మార్చి మదరయః, అనిగాని, "అయమేవ మన్న్యక్కారః యత్ తాపసతస్త్రిత్వమ్" మొదలగు రీతినిగాని సమాసయుతమైన రచనయున్నచో నందు పూర్వోక్తములైన విశేషములు భాసింపవు.

శ్లో. కిన్తు ప్రవృత్తి రేతస్య రసాభివ్యక్త్యపేక్షయా
శాన్త శృంగార కరుణాసన్తరేణ ప్రశస్యతే. 18
యతస్సమాసో వృత్తంచవృత్తయః కాకవస్తథా
వాచికాభినయాత్మత్వా ద్రసాభి వ్యక్తిహేతవః 19

తా. సమాసము రసానుగుణముగనుపయుక్తము కావలయును. శాన్తశృంగార కరుణరసములను వదలినచో మిగిలినరసముల విషయమున సమాసరచనము ప్రశంసనందును. అల్పము, మధ్యమము, అనల్పము అను విభేదములుగల సమాసము,అనుష్టుప్పు, చంపకమాలాది వృత్తములు, మాధుర్యవ్యంజక వర్ణోపేతమైన, యుపనాగరిక, ఓజః ప్రకాశక వర్ణయుతమైన పరుష, తదితర వర్ణసహితమైన కోమల, యను నామములుగల వృత్తులు (వీనినే కొందఱు రీతు లనినారు)హర్ష భయశోకాదులచేఁ గలుగు వికృతస్వరూపమైన కాకుధ్వనులు; (ఇవి యాకాంక్షయందు ప్రశ్నగర్భములు, ఆక్షేపగర్భములు, వితర్కగర్భములు నని మూఁడురకములు;ఆకాంక్షలేనపుడు విధిరూపములు; ఉత్తరరూపములు నిర్ణయరూపములు నని మూఁడురకములుగను.

నున్నవి. ఇవియన్నియును వాచికాభినయమున నంతర్భావము నందు టచే రసాభివ్యక్తిహేతువులే యగును. అందుచే రసానుగుణముగ సమాసము నుపయోగింపవచ్చునని తేలినది.

శ్లో. పదార్థాన్తావధిః కార్యో నాధికో గద్యతాస్థితః
గద్యే హి వృత్తవైకల్యే న్యూనా తద్వ్యక్తిహేతుతా 20.

తా. అసమాసము, శ్లోకార్థములో (శ్లోకపాదములో) సగము కాని, పాదాంతమువఱకుఁ గాని యుండవచ్చును. (కొందఱి మతమున శ్లోకపాదము పూర్తియగువఱకుఁగాని యుండవచ్చునని యర్థము) అంతకంటె నధికముగ నుండరాదు. ఉన్నచో నదియు గద్యమే యగును. పద్యములోనున్నంత రసాభివ్యక్తి పద్యశూన్యమగు గద్యయం దుండదు. "ఊర్ధ్వాక్షితాప గలితేన్దు సుధాలవార్త"మను సమాసభూయిష్ఠమగు పద్యమే యిందుకుదాహరణము-పై పద్యమున శ్లోకపాదమును మించిన సమాసమున్నది. అందుచే నచట దసాభివ్యక్తి యధికముగ నుండదు.

శ్లో. తస్యాచ్ఛిన్నః పదార్థానాం సంబంధశ్చేత్ పరస్పరమ్
న విచ్ఛేదోన్తరా కార్యో రసభంగకరో హి సః. 21

తా. ఈ సమాసరచనమున నింకొక నియమమునుఁ గూడ గుర్తింపవలయును. సమాసములోనున్న పదములకుఁ గల పరస్పర సంబంధము తెగిపోవనిచో, సమాసమునకు మధ్యయందు విచ్ఛేదమును చేయఁగూడదు, అట్లుచేయుట రసభంగమునకు హేతువగును. ఉదాహరణము-"మాద్యద్దిగ్గజ గండభిత్తికషణైః భగ్నస్రవచ్చందనః

తా. మదించిన దిగ్గజముల కుంభస్థలములయొక్క రొరపిడులచే భగ్నమై, స్రవించుచున్న చందనముగలది" ఇచట కషణములచే (ఒరపిడిచే) విఱిగిపోయి అనునర్థము వచ్చుటచే, కషణపదమునకును సంబంధము తెగిపోలేదు. సాక్షాదన్వయమే యున్నది. అందుచే

నిచట "కషణైః" అని సమాసమును విఱిచివేయుట రసాభివ్యక్తికి భంగకరము. కావున "మదాద్యద్దిగ్గజగండ భిత్తికషణభ్రష్ట ద్రిపచ్చందనః" అనియున్నచో బాగుండెడిది. కొన్ని గ్రంథములలో నీపాఠమే యున్నది.

ప్రిథానావిమర్శదోషము:—ఇంతవఱకును విధేయానువాద్య భావమును గుఱించి చర్చించియుంటిమి. ఒకవిషయమునకు ప్రిధానత్వము లేనిచో విధేయత్వమును నుండదు. అందుచే నారెండును సహచరులే యనవచ్చును. కావున పూర్వచర్చయందలి విధేయత్వము ప్రాధాన్యోపలక్షకమే. ఇపుడు ప్రిధానావిమర్శముకూడ దోషమే యని తెలియవలయును.

ఉదాహరణము:—

"స్నేహం సమాపిబతి కజ్జల మాదధాతి
సర్వాన్ గుణాన్ దహతి పాత్రి మధఃకరోతి,
యోఽయం కృశానుకణసంచయసంభృతాత్మా
దీపః ప్రికాశయతి తత్ తమసో మహత్త్వమ్"

అర్థము :—యః, అయం=ఏ, ఈ, కృశానుకణసంచయసంభృతాత్మా=అగ్నికణముల కూడికచే నిర్మితమైన స్వరూపముగల (శరీరముగల) దీపః=దీపము, స్నేహం=నూనెను, సమాపిబతి—బాగుగా త్రాగివేయును (పీల్చివేయును) కజ్జలమ్=కాటుకను (మసిని) ఆదధాతి=కలుగచేయును, సర్వాన్=అన్ని, (అన్నివిధములైన) గుణాన్=వత్తులను, దహతి=తగులఁబెట్టును, పాత్రిమధఃకరోతి=నూనె యుండు పాత్రిను (బుడ్డిని) అధఃకరోతి—క్రిందనుంచును (పైన దీపజ్వాల, క్రింద దీపపుబుడ్డి యుండును) ప్రికాశయతి=వస్తువులను ప్రికాశింపఁజేయునో తత్=అది తమసః=చీకటియొక్క, మహత్త్వమ్=గొప్పదనము. ఇది దీపపరమగు నర్థము. ఈ వర్ణనమువలన తమోగుణావిష్టుఁడగు పురుషు

నియొక్క వృత్తాంతముగూడ స్ఫురించును. తదనుకూలమగు నర్థ మీ క్రిందివిధముగ నుండును. కృశాను...భృతాత్మా=కోపమనెడుఅగ్ని కణనిర్మిత స్వభావముగలవాఁడు, స్నేహమ్ సమాపిబతి=ప్రేమను మ్రింగివేయును; కజ్జలమాదధాతి=దోషములను ప్రకటించును. (కజ్జల పదమునకు దోషము లక్ష్యార్థము) సర్వాన్ గుణాన్=సద్గుణముల నన్నిటిని, దహతి=తగులఁబెట్టును. పాత్రమ్=యోగ్యుని,(విద్వాంసుని అధః కరోతి=తిరస్కరించును. తత్=అది, తమసః=తమోగుణము యొక్క, మహత్త్వము.

ఇచట ప్రకాశింపఁజేయుసను క్రియయొకటియే ప్రధాన మైనది. స్నేహ పానము, గుణదహనము మొదలగుక్రియ లప్రధాన ములు. కాని అన్నిటిని, కవి, సమానశ్రేణిలోనే వర్ణించినాఁడు. అన్నియు సమాపకక్రియలే యగుటచే నన్నిటికిని సమప్రాధాన్యమే వచ్చును. అట్లుచెప్పుట దోషము.మిగిలిన క్రియలనన్నిటిని శతృ నత్తము లుగఁ జెప్పి, ప్రకాశయతి యను నొకక్రియనే యుపయోగించుచో నీదోషము పోవును.

అపుడు శ్లోకము.

"స్నేహం పిబ న్నధచ కజ్జల మాదధానః"

జ్వాలన్ గుణాన్ విమలపాత్రమధశ్చ కుర్వన్"

అనురీతి నుండవలయును.

ఇచట మఱియొక దోషము గూడఁగలదు-"యః అయం"అను నపుడు యః అనుపదము దీప-అనుపదముతో నన్వయించును. తత్-అనునది-"దీపః ప్రకాశయతి" అను వాక్యార్థమును పరామర్శించును. యచ్ఛబ్ద మేయర్థమును పరామర్శించునో, తచ్ఛబ్దముగూడ నాయర్థ మునే పరామర్శింపవలయును గాని, మఱియొక యర్థమును పరామ ర్శింపరాదు.ప్రస్తుత మిచటి యత్తత్, అనుశబ్దములు విభిన్నార్థపరా

మర్శకము లగుటచే దోషమే. ఆ దోషమును పరిహరించుటకు "యత్" అను నపుంసకలింగశబ్దమునే యుపయోగింపవలయును. అపుడు యత్తత్ శబ్దములు రెండును వాక్యార్థమునే పరామర్శించును.

"యచ్చా యమగ్నికళాసంచయ సంభృతాత్మా" అని శ్లోకములోని మూడవపాదమును మార్చవలయును.

అప్రధానక్రియలను శత్రంతములుగ నుంచి, ప్రధాన క్రియను సమాపకక్రియగఁ జెప్పిన పద్యమున కుదాహరణ మిాక్రింది శ్లోకము.

శ్లో॥ "బిభ్రాణః శక్తిమాశు, ప్రశమితబలవత్తారకౌర్జిత్యగుర్వీం
కుర్వాణో లీలయాధః శిఖినమపి, లసచ్చన్ద్రకాన్తావభాసమ్
ఆధేయా ద్ధస్తకారే రతిమతిశయినీ మావహన్ వీక్షణానామ్
బాలో లక్ష్మీమపారా మపర ఇవగుహో౽హర్పతేరాతపో వః.

అర్థము : ఈ శ్లోకములోని విశేషణములు (1) సూర్యాతపమునకును (2) కుమారస్వామికిని వర్తించును.

ప్రశమిత...గుర్వీమ్ (1) ప్రశమిత=తగ్గింపఁబడిన, (నాశనము చేయఁబడిన, బలవత్=బలముగల, తారక+ఔర్జిత్య=నక్షత్రముల యొక్క తేజస్సు గలిగియుండుటచే గుర్వీమ్=సకల ప్రపంచమును ప్రకాశింపఁజేయునంత గొప్పదగు, శక్తిమ్=సామర్థ్యమును, బిభ్రాణః=ధరించుచున్నట్టియు (శత్రంతము)- (2) నాశనముచేయఁబడిన బలవంతుఁడగు, తారక+ఔర్జిత్య, గుర్వీమ్=తారకుఁడను రాక్షసుని యొక్క ప్రభావముగలదియు, బరువైనదియునగు, శక్తి="శక్తి"అను పేరుగల యాయుధమును, మోయుచున్నటియు

లసత్...భాసమ్ (1) లసత్=ప్రకాశించుచున్న చంద్ర=చంద్రునియొక్క, కాన్త=మనోహరమైన, అవభాసమ్ కాన్తిగలట్టియు (అవభాసః యస్మాత్ సః-అగ్నినుండియే చంద్రుఁడు తన కాన్తిని బొందుచున్నాఁడని భావము) చంద్రపదమునకు సువర్ణమనియు నర్థ

ము. ఆ పక్షమున-ప్రకాశించుచున్న సువర్ణమురొయొక్క- మనోహరమైనకాన్తి యెవనియందున్నదోయను నర్థమువచ్చును- శిఖినమ్, అపి=అగ్నిహోత్రుని కూడ, లీలయా=విలాసముతో, అధః కుర్వాణః=తిరస్కరించుచున్నట్టియు

(2) లసత్,=ప్రకాశించుచున్న, చంద్రక=నెమలి కన్నులచే అస్త=రమణీయమైన, అవభాసః=కాన్తిగల, శిఖినమ్=నెమలిని, లీలయా=విలాసముతో, అధఃకుర్వాణః=తనకు వాహనముగఁజేసికొనుచున్నట్టియు (1) అన్ధకారే=చీకటియందు, వీక్షణానామ్=నేత్రములకు, అతిశయినిమ్,రతిమ్=ఎక్కువ ప్రీతిని, ఆవహన్=కలుగఁజేయుచున్నట్టియు (2) అన్ధక+అరేః=శివునియొక్క, నేత్రములకానన్దమును గూర్చుచున్నట్టియు

(1) అహర్పతేః=సూర్యునియొక్క, బాలః, ఆతపః=లేతయెండ (2) బాలః, గుహఃఇవ=బాలుఁడైన కుమారస్వామివలె, వః=మీకు, అపారామ్ లక్ష్మీమ్=అనన్తమైన సంపదను, ఆధేయాత్ కలుగఁజేయుఁగాక.

ఇచట బిభ్రాణః, కుర్వాణః, ఆవహన్-అనునవి శత్రన్తములు-అప్రధానవ్యాపారములను దెల్పును. ఆధేయాత్-అనునదొకటియే ప్రధానక్రియ. అది యటులే సమాపక క్రియగానేయున్నది-ప్రధానాప్రధానక్రియ లిట్లే యుండవలయునని ప్రస్తుత విషయము.

అన్ని వ్యాపారములును ప్రధానములే యగుచో వానినిఁ దెల్పునవన్నియు క్రియలేయైనను దోషములేదు. ఉదాహరణము.

శ్లో॥ సౌధా దుద్విజతే, త్యజ త్యుపవనమ్, ద్వేష్టిప్రభామైన్దవీమ్
ద్వారా న్నశ్యతి చిత్రకేలిసదసో, వేషం విషం మన్యతే
ఆస్తే కేవల మబ్జినీకిసలయప్రస్తారశయ్యాతలే
సంకల్పోపనత త్వదాకృతి రసాయత్తేన చిత్తేన సా॥

అర్థము:—సా=నీమెడబాటు ననుభవించుచున్న ఆనాయిక సౌధాత్=మేడనుండి, ఉద్విజతే=భయపడుచున్నది. ఉపవనమ్=ఉద్యానవనమును, త్యజతి=వదలివెళ్ళుచున్నది ఐన్దవీమ్=చంద్రికాన్తిని (వెన్నెలను ద్వేష్టి=ద్వేషించుచున్నది, చిత్రకేలిసదసః=విలాసముగ నాడుకొనుటకై యుద్దేశింపఁబడిన యింటియొక్క, ద్వారాత్=వాకిటినుండి సశ్యతి=పారిపోవును. అటపోవుటకే యిచ్ఛగింపదు. వేషమ్=అందముగ నలంకారాదులను ధరించుటను, విషమ్=విషముగ, మన్యతే=తలఁచుచున్నది-సంకల్పోప.........యత్తేన - మనసునందలి యూహలచే తన హృదయమున స్థాపితమైన నీయాకారమునందలి యానందమునకు వశమైన చిత్తముతో, అబ్జినీ...శయ్యాతలే=కోమలములైన పద్మదళములతో నేర్పాటైనశయ్యయందు, కేవలమ్, ఆస్తే=వ్యాపారరహితమై, ఉన్నది.

ఇందు, విరహావస్థయందున్న నాయికకు సంబంధించిన ఉద్వేజనము, ద్వేషము-మొదలగుక్రియ లనేకములు వర్ణితములైనవి. ఆమె విరహావస్థను సూచించుటకీ క్రియలన్నియు నావశ్యకములే యగుటచే నవియన్నియు సమప్రాధాన్యములే. అందుచే నామె చేష్టలన్నియు ప్రధానక్రియలతోనే వర్ణితములైనవి.

శ్లో. యత్రైకకర్తృకానేకా ప్రాధాన్యేతరభాక్ క్రియా
తత్రాఖ్యాతేన, వాచ్యాద్యా, శతాద్యై రపరా పునః
అన్తరశ్లోకము-21

తా. ఏకకర్తృకములై, ప్రధానములును, అప్రధానములును నగు క్రియలున్నపుడు, ప్రధానక్రియ నాఖ్యాతముచేఁ జెప్పవలయును. అప్రధానక్రియలను శతృ క్తములు మొదలగు వానిచేఁ జెప్పవలయును.

ఆశంక: అన్ని తావులయందును సమాసముఁ జేయుచో సనిష్టము గల్గుననియు నందుచే రచనముఁ జేయునపుడు క్రియాదుల

ప్రధానాప్రధానతలను గుర్తించియే సమాసమునుచేయవలయునుగాని, యెల్లతావులందును కూడదని మీరింతవఱకును విస్తృతముగ నుప పాదనమును చేసినారు. కాని యిందులో నపూర్వత యేమున్నది ?- "విశేషణం విశేష్యేణ బహులమ్" విశేషణము, విశేష్యముతో బహు ళముగ సమసించును. అని సూత్రమును వ్రాయుటచే పాణిన్యాచా ర్యులీ విషయమును సూచించియేయున్నారు. బహుళమను పదమును ప్రయోగించుటవలన నొకచో సమాసవిధి ప్రవర్తించును, ఒకచో ప్రవర్తింపదు, ఒకచో విభాష, మఱియొకచో నన్యవిధముగ నగునను విషయము సూచితమగుచునేయున్నది. దీనిననుసరించి యుక్త-జ్ఞాపక ర్షాలు, వివక్షితములు కానపుడు సమాసమువచ్చును. వివక్షయున్న పుడు సమాసము కూడదు. అని తెలియుచునేయున్నది. ఇంత మీ రీవిషయమునే చెప్పనేల ?

సమాధానము: మీరు చెప్పినది సత్యమే. కాని యిట నొక విశేష మున్నది—సమాసవిధి సామాన్య శాస్త్రము. ప్రధానేతర భావము వివక్షితమైనపుడు సమాసము కూడదనుట- యపవాదము- పై సామాన్యశాస్త్రమునకు బాధకము- (అపవాద శాస్త్రమునకు విషయములైన తావులను విడిచి మిగిలిన తావులందే సామాన్యశా స్త్రము ప్రవర్తించును,) కావున ప్రధానేతర వివక్షామూలకమైన సమాస నిషేధము, సమాసవిధికపవాదమనుటయే మంచిది. సమాస నిషేధమును బహులగ్రహణమునకు విషయమునుగాఁ జేయుట, కూడదు.

ఒకానొక ప్రయోగమును గుఱించి- ఇది సామాన్య శాస్త్రము నకు విషయమనిగాని, అపవాదశాస్త్రమునకు విషయమనిగాని నిర్ణ యింపలేము. అట్లు నిర్ణయింప శక్యముకానిదానిని బహులగ్రహణ మునకు విషయముగాఁ జేయవలయును. అట్లు చెప్పుచో, "విశేషణం

విశేష్యేణబహులమ్” అను సూత్రమునందలి బహుళగ్రహణమునకు సార్థకతయు సిద్ధించును. ఇట్లు వ్యవస్థను చేయుటయే మంచిది. లేనిచో “గోదః” “కంబలదః” అను ప్రయోగముల విషయమున నిబ్బంది కల్గును.- “గాం దదాతి” (గోవునిచ్చును) “కంబలం దదాతి” (కంబలము నిచ్చును) అని విగ్రహవాక్యములుండును- ఇచట గామ్, కంబలమ్ అనునవి కర్మవాచకపదము లుపదములుగ నున్నచో ధాతువునకు అణ్ ప్రత్యయమువచ్చును- అనునర్థముగల “కర్మణ్యణ్ అను సూత్రమననుసరించి, యిచట అణ్ ప్రత్యయము రావలసియుండగా ఉపసర్గ పూర్వమందులేని, ఆకారాన్త ధాతువునకు, కర్మవాచకపదముపపదముగ నున్నపుడు, అణ్ రాదు; క ప్రత్యయము వచ్చునని “ఆతోఽనుపసర్గే కః” అను సూత్రము విధించుచున్నది. ఇచట ‘దదాతి’ అను క్రియకు మూలమైన “దా” అను ధాతు వాకారాన్తమైనది. అందుచే నిచట కప్రత్యయమేవచ్చును,

ఆతోఽనుపసర్గేక : అను సూత్రము, కర్మణ్యణ్ అను సూత్రమున కపవాదము. పైనిఁజెప్పిన విధానము ననుసరింపనిచో, గోదః, కంబలదః అనునప్పటి యుపపత్యయము భావముగూడ, “కృత్యల్యుటో బహులమ్” అను సూత్రమునందలి బహుళగ్రహణమునకు విషయము కావలసివచ్చును. అది ఎవరికి నిష్టము కాదు. అందుచే నిచటఁగూడ, సమాస నిషేధ మపవాదవిషయమనియే యనవలెను. ఇది యపవాద విషయమేయని నిర్ణయించుటలో నిబ్బందిలేదు. అందువలన నిది బహుళమునకు విషయము గాదు.

ఈ విషయము మే మూహించి చెప్పినదిగాదు. పాణిన్యాచార్యులకును నిది యభిమతమైనదియే- వారు “సమర్థః పదవిధిః” అని సూత్రమును చెప్పినారు- అందు సమర్థపదము మేము చెప్పినయర్థము గూడ సూచించును. సామాన్యముగ నా సూత్రముపైన

వ్యాఖ్యానము వ్రాసినవారు, పరస్పరము సాపేక్షతలేని పదములకు సమాసమును వారించుటకయియే సమర్థపద ముపయుక్తమైనదని చెప్పినారు. వారు సూత్రకారుని యభిప్రాయమును పూర్తిగ గ్రహింపలేదనియే మా యభిప్రాయము- ప్రధానేతరభావవివక్షయున్నపుడు గూడ సమాసమునుపయోగింపరాదను విషయమును చెప్పుటకుఁ గూడ "సమర్థః" అనుపద మీసూత్రమున నుపాత్తమైనదని మనము తెలిసికొనవలయును. ఈ విషయమును ప్రకటించుటకే మేమీచర్చను ప్రారంభించితిమి. అపూర్వముగ మేము చెప్పినదేమియు లేదు.

ప్రస్తుతము నిష్కృష్టమైన యర్థమిది:- ఎచట విశేషణము వలన విశేష్యమునకొక యుత్కర్షముకాని, అపకర్షము గాని కలుగునో, ఎచట నుద్దేశ్యభావము స్పష్టముగ భాసింపవలయునో, యచట నెల్ల వాక్యమే యుండవలయును. సమాసముకూడదు. మిగిలిన తావులందు సమాసముఁ జేయవచ్చును.

ఈ విషయమునే శ్లోకమున సంగ్రహించుచున్నాడు.
"విధియోద్దేశభావోయం వక్తుం వృత్త్యా నపార్యతే
యత్తు తేనాభిధానం వా, సమర్థగ్రహణం చవా (23)
కారణ ద్వయమేవేష్టం, బహులగ్రహణంనతు
అశక్యనియమోహ్యర్థో విషయస్తస్య నేతరః (24)
(సంగ్రహశ్లోకములు)

తా. సమాసము, విధేయోద్దేశభావమును చెప్పలేదు- సామర్థ్యమున్నపుడే (సాపేక్షత్వమున్నపుడే) సమాసమును జేయవలయును. అను నీరెండువిషయములే సమాసవిధి ప్రతిషేధములలో హేతువులు.- బహుళ గ్రహణము మాత్రముకాదు. ఎచట విధి యుత్సర్గము (సామాన్యము) ఇది యపవాదము నను నియమమును చేయ శక్యముకాదో యది మాత్రమే బహుళగ్రహణమునకు విషయము—మిగిలినవి కావు. [సశేషము

# శివరాత్రిమాహాత్మ్యము-కావ్యత్వము

(గతసంచిక తరువాయి)

చిలుకూరి పాపయ్యశాస్త్రి.

## మూర్తిసాక్షాత్కృతి

శ్రీనాథుని కవితాశిల్పమునందొక ప్రత్యేకత గలదు. అతఁడేవస్తువును బాఠకుల యెదుటఁ బెట్టఁ దలపెట్టినను, దన్మూర్తిని భావుకులకు భావనచే సాక్షాత్కరించునట్లు చేయును. ఏవస్తువును వర్ణించినను తత్సమగ్రస్వరూపమును వెలయించుటయు నాతని కొకపరిపాటి. ఈ శివరాత్రిమహాత్మ్యమునందు నట్టి మూర్తిసాక్షాత్కృతి సమన్వితమైన తావులు పెక్కులు జతఁగూడినవి. ఇట్టి రచన కావ్యత్వమున కత్యంతోపస్కారకమై వెలయును. కావ్యకర్త తానేదృశ్యమును దన ప్రతిభాసమున్మేషమునఁ బాఠకుల యెదుటఁ బెట్టఁజూచునో, దానికనువైన పదవాక్యవిన్యాసము చేయుటయు నత్యావశ్యకము. ఆ విషయమున నీ కావ్యమునందలి కవితావిన్యాసము కడు విలక్షణమై చూపట్టుచున్నది. అట్టిఘట్టములను గొన్నిటి నాఱఁగించెదను. శ్రీమహావిష్ణువు ప్రళయావసానమున క్రోడావతారమెత్తి భూమి నుద్ధరించిన దృశ్యము పరికింపుఁడు.

సీ॥ కాఁడిపోతేన మేని గరులు బ్రహ్మాండంబు
కణఁపపూబంతి కక్కజము తోఁప
ఖురపుటంబునఁ గీలుకొని మేరుకుధరంబు
మువ్వలోపలి తాలి మురువుపడయ
దీర్ఘకంఠకఠోర ఘుర్ఘుర స్వనమునఁ
బాతాళగోళంబుఁ బాతలింప
నీలాంబుదశ్యామ నిబిడదేహచ్ఛాయఁ
బ్రళయాంతకాలంబు దొలఁకరింప

సప్త పాతాళముల క్రిందఁ జాగిపడిన
యవని నెత్తె శితాగ్రదంష్ట్రాంకురమున
నఖిలవిస్తబ్ధరోమ దివ్యాకృతారుఁ
డంబురుహలోచనుఁడు కల్యాదియందు శివరా. 1-61.

ఈపద్యములోఁ బ్రళయావసానమునఁ గల్యాదియందు జలమగ్నమైన భూమి నుద్ధరించుటకై నూతన వరాహావతారము నెత్తిన కమలామనోహరుని భీమమనోహరమూర్తి సాక్షాత్కరింపఁ జేయబడినది. గగుర్పొడిచిన రోమములు బ్రహ్మాండ మనుపూబంతి దళములవలె వ్యాపించి యాశ్చర్యమును గొల్పినవి. మేరుపర్వతమా వరాహమూర్తి కొక్కెలనమఁ జిక్కుకొని ముల్లోపలి తాయివలె గలగలలాడఁ దొడగినది. ఘోర క్రిందికానించి కావించిన ఘుర్ఘురధ్వనిచేఁ బాతాళగోళము బీటలు వాఱినది. నీలమేఘమును బోలిన చిక్కనిశరీర కాంతిచేఁ బ్రళయ విలయకాలము తోలకరించినది. అట్టిభీకరాకారముతో ప్రళయజలనిధిలో సప్తపాతాళముల క్రింద సాగిలఁబడియున్న భూమిని దసతీక్ష్ణదంష్ట్రాగ్రమున మీఁదికి లేవనెత్తినాఁ డాయాదివరాహమూర్తి. ఈపద్యమునఁ జతఁగూడిన తెలుఁగు నుడికారపుసొగసు కడువిలక్షణమైనది. కాఁడిపోవుట, ముల్లోపలితాళి మురుఁగుపడయుట, పొతలించుట, తొలకరించుట, సాగిపడుట యను సీపదముల సొంపు అక్కజము గొల్పుచున్నది. వీనికూర్పుతోడనే క్రోడావతారము మనకనుల యెదుట సాక్షాత్కరించుచున్నది.

శ్రీమహావిష్ణు విట్టిమహత్తరకృత్యమును నిర్వహించినపుడు దేవతలాతనిపై పుష్పవృష్టి గురిపించినారు. ఉద్ధతక్రోడావతారుఁడైన హరిపైఁ బువ్వులవాన కురిసినదృశ్యము నొకవిచిత్రమైన కల్పనముతో మనోహరముగఁ జూపించినాఁడు. అప్పటి యాక్రోడావతారమూర్తి గుహలలో మిణుఁగురుపురుగులు మిలమిలలాడుచుండఁ జూడ నొప్పె

డికాటుకకొండవలెఁ జూపట్టెనఁట.

> మురలు తనమీఁదఁ బువ్వుంబోన కురియఁ
> జూడ నొప్పారె హారి శక్రగోపమూర్తి
> కెంజరదిబుల ఖద్యోతగణము మెఱయఁ
> శాంబ నొప్పారు నంజనాచలము పోలె. 1-65

ఈదృశ్య సాక్షాత్కారవిషయమునఁ బాటించిన కల్పనాచమత్కారము హృద్యమైనది. ఇట్టులే సుశీల గర్భవతియైనప్పటి దృశ్యచిత్రణము కూడ మధురముగనే సాగినది.

> పలుచఁబాఱెను గండదర్పణయుగంబు
> నలమధూకప్రసూనంబు ననసుధాకర
> మానుగతిఁ జూచుకంబులు నసితమయ్యె
> సవతిపూబోండ్లయాననాబ్జములతోడ. 2-63.

యువతులు గర్భవతులైనపుడు చెక్కిళ్లు దర్పణములవలెఁ దెల్లవాఱుచుఁ బలుచఁబడుట సహజము. ఈసహజదృశ్యమునే మధురము గావించినాఁడు. స్త్రీలు గర్భవతులైనపుడే చూచుకములు కుచాగ్రములు నల్లనగుటయు సహజమే. ఈనలుపెక్కుట నుపమితి నామగ్రీ సమన్వయముచే సుకుమారతరము గావించినాఁడు. క్రొత్తగఁబూచిన యిప్పపూవునందలి మధువుగ్రోలుటకై వ్రాలిన కొంగ్రొత్తపూవులందలి తేనెనానఁజూచు తేఁటిని దలఁపింపఁజేసిన దాకుచాగ్రనీలిమము. సుశీల చూచుకములు నలుపెక్కుటతోపాటు సవతుల ముఖపద్మములుకూడ నల్లవాఱినవనుటలో కల్పన మహోదాత్తమైనది. యజ్ఞదత్తుఁడువిప్రుఁడైనను నాతని పరమాత్మస్థానమునందుఁ బ్రభువునుగాఁ జిత్రించియుండుటచే సవతిపూబోండ్లనుగూడఁ గల్పించి, సుశీలాసౌభాగ్యమునకు వారి నీర్ష్యాళువులను జేసి, వారిముఖపద్మములను నలుపెక్కించుట కూడఁ బొసఁగినదే యన్నరి. కొంచెము దూరముగ భావించినచో

నిచటి యుపమితి సమన్వయమున మధురపయః ప్రదానసమర్థములగు నప్పుడే చూచుకములు నల్లవడు నను విషయము, ఆపయఃపానము మధూకకుసుమరసమువలె మాదక మనువిషయముకూడ స్ఫురింపఁ జేయునదిగా నున్నది.

ఈప్రకరణమున గర్భవతీలక్షణముల నెఱిఁగించు కూర్పులో జతపడిన భావసామగ్రి యలంకార సంయోజనము మధురతరము. మఱియు వివిధావస్థాసాక్షాత్కార సంయోజకము.

మనమున కుత్సవం బొసఁగ మంత్రికిఁ బట్టపుదేవి, గర్భశో
భనమునఁ బల్పునై చెలువుపైకొను ముద్దులనెమ్మొగంబుతో
ఘనసమయాగమంబునఁ బొడకట్టిన చల్లని తూర్పుగాలిచే
వనిలిన కన్నెగేదఁగికి వచ్చిన కూరిమి చుట్టమో యనన్.

యజ్ఞదత్తామాత్యుని దేవి సుశీల గర్భశోభనముచే అందములు విరఁజిమ్ము ముద్దులుగులికెడి నెమ్మొగముతో భర్తమనమున కుత్సవ మొదవించెనఁట. ఈదృశ్యము నుత్ప్రేక్షాసామగ్రిచే సాక్షాత్కరింపఁ జేసి యున్నాఁడు. ఆముఖము వర్షాకాలమునఁ బొడ తేఱిన చల్లని తూర్పు గాలిచే పుష్పించిన లేఁత మొగలికిఁ బ్రియమైన చుట్టమో, యనునట్లు ఉండెనఁట. గర్భవతి యైనప్పుడు యువతినెమ్మొగము తూర్పుగాలి తగిలి పుష్పించిన మొగలిఱేకును బోలియుండుట సహజము. దానిని సరసముగఁ గాన్పింపఁజేసియున్నాఁడు.

ఉపచీయమాన గర్భయైనప్పటి సుశీల తనూవిలాసమును గర్భవతీ సహజమైన మృదాస్వాదనక్రమమును దృశ్యసాక్షాత్కార మేర్పడునట్టులు నడిపించినాఁడు. కనుఁగొండ మాక్రమము.

అట్లు ధవునొద్ద నెంతయుఁ బద్మదళాక్షి
సముదితంబైన గర్భభారమున కతమున
సమ్యగాపీతజలరాశి సామ్యమైన
ప్రావృడారంభనవమేఘపంక్తిఁ బోలె 2.51.

గర్భభారాలసయైన సుశీల జలరాశిపానలంబమానయైన వర్షారంభ నవమేఘపంక్తివలె నున్నదనుటలో గర్భవతీదృశ్యము కన్నులకుఁ గట్టినట్టు లున్నది. ఇటులనే-

అపారంగవిలోలలోచనమా గాఢాలింగన క్రీడల
వ్యాపారాగారము కేళితల్పముపయి న్మన్నించి మంత్రీశుఁ డ
త్యాసంగం బొనరించె ముద్దుగొనె ముత్సాహ్లాదసత్ప్రక్రియా
వ్యాసంగంబునఁ గమ్మనైన యదసీయంబైన బింబోష్ఠమున్. 1.47.

ఇదియొక భావనామధురమైన సహజ దృశ్యము. ప్రణయరీతి రేకసముద్ద్యోతకము. సుకుమారమైన పదసన్నివేశమున సుకుమారమైన భావము నిందా యోజించియున్నాఁడు. ముట్టితినుటచేఁ గమ్మనైన యూమె బింబోష్ఠమును ముద్దుగొనుటను వర్ణించుటలో సౌకుమార్య మతివేలముగఁ దులకించినది.

ఈకావ్యమున సుశీల గర్భవతియైనపుడు యజ్ఞదత్తామాత్యునిచేఁ గావింపఁజేసిన సీమంతపుంసవనమహోత్సవము దశరథుని వాజపేయమునకు ధర్మజుని రాజసూయమునకు సాటిగా మహార్భటితో నిర్వహించియున్నాఁడు. కావుననే యూయుత్సవము నెఱపుటకు వలయు లౌకికవైదిక సామగ్రుల నన్నిటి నేపాటియు లోపము లేకుండ సర్వాంగ పరిపుష్టము సర్వసమృద్ధము గావించినాఁడు. కావుననే మంత్రపూర్వక సమాచరణీయ క్రియాకలాపమునందుఁ గాని, ఉత్సవసంభారసంభరణమునందుఁ గాని పరిక్రమభంగము లేకుండ సాధించియున్నాఁడు. ఇంతకు శ్రీనాథుఁ డేవిషయమును గవితాముఖమున వెలార్పఁ దలఁచినను దానిని సర్వాంగ పరిపుష్టము చేయునేగాని లోప మేపాటియు చేయఁబూనఁడు. సుశీలాదేవి పుత్త్రినిగాంచె ననువార్త వినినంతనే యజ్ఞదత్తామాత్యుఁడా వార్త గొనివచ్చిన యంతఃపుర పరిచారికకు పారితోషిక మొసఁగిన తీరిట్లు చిత్రించియున్నాఁడు.

తాను గట్టినట్టి చీనాంబరంబులుఁ
దాను బెట్టినట్టి మేని తొడవులుఁ
ప్రమద మొప్ప నిచ్చెఁ బారితోషికముగ
మంత్రి యంతిపురము మానవతికి. 2-69.

సుశీలకుఁ బుత్రుఁడు జన్మించె ననువార్త వినినంతనే, యజ్ఞదత్తామాత్యుఁ డమృతరసధారామయంబైన యమ్మాటకు, సద్యఃపరిరూఢరోమాంకురనికరకంటకితగాత్రుండును, దరస్మితవికసితకపోలమండలుండును నై తాను గట్టినవస్త్రంబులును తాను బెట్టుకొనిన యాభరణములును ఆవార్త వినిపించిన యామెకుఁ బారితోషికముగ నిచ్చెను. ఈ పద్యమున మానవమాత్ర సహజమైన సంతోషావిష్కరణపద్ధతి నిరూపితమైనది. యజ్ఞదత్తుఁడు మంత్రిపుంగవుఁడు గావున తన మేన నప్పుడున్న విలువగల వస్తువుల నన్నిటిని బారితోషికముగ నీయఁ గలిగెను. ఇట్టిపుత్రోదయవేళలం దెవ్వరయిన తచ్ఛుభవార్తాహారులకుఁ బారితోషిక మిచ్చుట సహజము. దాని నిచటఁ గవి గూర్చియున్నాఁడు.

ఈ కావ్యమున బాలెంత రాలి సొగసువర్ణించిన తీరు కడువిలక్షణమైనది. ఆతని యితరకృతులన్నిటికంటె నీ కావ్యమున బాలెంత విధన మతిసహజముగఁ జిత్రింపఁబడినది. ఇది శ్రీనాథుని నాఁటి బాలెంతరాండ్ర కొక రేఖామయచిత్రము.

పసుపుఁ బట్టంబు ధరియించి పద్మనయన
సుతుని నుత్సంగమునఁ జాల్చి చూపనొప్పెఁ
దరణిబింబ పారిద్ర వార్ధరముతోడ
లలితరుచి నొప్పు నాకాశలక్ష్మివోలె 2-76.

పద్మనయనయైన సుశీల పసుపుపట్టిన పుట్టము దాల్చి, అచిరప్రసూతుఁడైన కుమారుని నొడిలోఁ బెట్టుకొనియుండ సూర్యబింబము వచ్చుని మేఘము నడుమనుండినపు డాకాశలక్ష్మి యెట్లొప్పునో యట్టి

శోభతోఁ జెలువొందినదఁట. భావనచేసిన సహజమధురమైన దృశ్య మిచట సాక్షాత్కరించును. అది యెంతయు మనోహరమై యవభాసించును. ఉపమానోపమేయ సామగ్రులు రెండింటిని సాక్షాత్కరింపఁ జేసికొనిన వారికిఁ గాని చూపట్టని మధురదృశ్య మిది.

శ్రీనాథుఁడు తెలుఁగు జాతీయతను తెలుఁగు జాతీయములలో వెలార్పఁ గల ప్రతిభావంతుఁడు. ఈ క్రింది పద్యమునఁ దన నాఁటి బాలెంత వేషమును తెలుఁగు నుడికారపుఁ దీరులో నడిపినాఁడు.

పల్లవాధర మఱుఁగైన యొల్లెఁ గట్టి
కొంగు మణిహేమ కాంచి కాకోటఁ జెరివి,
సొబగుఁ గాటుక బొట్టుతోఁ జూడ నొప్పె
వింత చెలువునఁ బచ్చిబాలెంత యపుడు. 2-71

సహజముగ లేక తాంబూల రాగముచే నెఱ్ఱనయిన యధరము గల సుశీల స్వచ్ఛమైన చీరగట్టి, పైఁట చెరఁగు మణిఖచితమై హేమమయమైయున యొడ్డాణమునఁ జెరివి, అందముగ కాటుక దీర్చి బొట్టు వెట్టి పచ్చిబాలెంతరాలయి వింత చెలువునఁ జెలువారెనఁట. పచ్చి బాలెంతలు ప్రాచీనకాలమున పైఁట చెరఁగు నడ్డికట్టు కట్టుట, కాటుక బొట్టు వీడక దాల్చుట పలుమాఱు తాంబూల చర్వణము సేయుట, వీనితో వింత చెలువము గలిగి యొప్పుటయుఁ బరిపాటి. ఆ చెలువము నీ పద్యమున సాక్షాత్కరింపఁ జేసినాఁడు. ఈనాఁడుకూడ నీ బాలెంత చెలువము సహృదయులయిన భావుకులకు వింత గూర్పక మానదు.

ఆనాఁడు సిరిగలిగి యౌవనమదోద్రిక్తులై వీథులవెంటఁ దిరుగాడు యువకుల యాకృతి నీ క్రింది పద్యమున వెలార్చినాఁడు.

పరిగొన్న తెలిపట్టు జన్నిదములతోడ
రత్నాంతరహారము ధరించి
నలిపసిఁడి కావి దోవతిపైఁ బచ్చడమ్ము
కరమైన పసిఁడి మేఖల ఘటించి

గంగమట్టియుమీఁదఁ గస్తూరి రసమునఁ
బుండ్రకంబు లలాటమున నమర్చి
కమలకర్ణిక కుండలముల పార్శ్వములందు
లలితంబులగు నొంటు లలవరించి
యాత్మవంశ పరంపరాయాతమైన
వైదికాచారమార్గంబు తక్కణించి
యారజము రాచరికమును నలవరించి
నగరవీథులఁ జరియింతుఁ బ్రేగడుకుతుకుఁడు. 2-90

యౌవనమదోద్రిక్తులయిన విలాసవంతులగు విప్రులౌనాఁడు, ఎగుడుదిగుడు లేని పట్టుజందెములు వైచుకొని, వానితోపాటు, రత్నసమ్మిళితముక్తాహారములు దాల్చుట, సన్నని నీర్కావిరంగుగల దోవతి గట్టి దానిమీఁద బంగారు గోవ్రతాడు మొల నూలుగాఁ బెట్టుట, నుదుట గంగమట్టిపూసి మీఁద కస్తూరినామము పెట్టుకొనుట, చెవులను దుద్దులు పెట్టుకొని వాని ప్రక్కన అందమైన రెయింట్లు దాల్చుట, యను వీనిని వేషభూషాదికముగాఁ దాల్చుచుండెడివారు. మఱియు వారు వంశక్రమాయాతమైన ఆచారము వదలి పొగరుఁబోతుతనము పెరిగి రాచఠీవితో వీథులలో యువతుల వలపించుటకై తిరుగాడుచుండెడి వారనియు, దీనివలన విదితమగుచున్నది. యౌవనమదోద్రిక్తుఁడయిన సుకుమారుని మూర్తి యీ పద్యమునఁ జూపట్టును.

సుకుమారుఁడు ధూర్తవిటుఁడై పారదార్యమునకుఁ బాల్పడి నప్పుడు, తల్లి యాతనిదుర్వృత్తికి దురపిల్లినతీరు చిత్రించుటలో కరుణరస ప్లావితమూర్తి సాక్షాత్కృతిమాపట్టును.

కవలయుంగరముల రత్నాంకురములొత్త
గేల్దమ్మిఁ జెక్కులఁగీలుకొలిపి
మొకరితు మ్రోడ మాలిమిట్టు నోడెడి కేఁడి
నిశ్వాసపవనంబు నిక్కటిలఁగ

శోభతోఁ జెలువొందినదఁట. భావనచేసిన సహజ మధురమైన దృశ్య మిచట సాక్షాత్కరించును. అది యెంతయు మనోహరమై యవ భాసించును. ఉపమానోపమేయ సామగ్రులు రెండింటిని సాక్షాత్క రింపఁ జేసికొనిన వారికిఁ గాని చూపట్టని మధురదృశ్య మిది.

శ్రీనాథుఁడు తెలుఁగు జాతీయతను తెలుఁగు జాతీయములలో వెలార్పఁ గల ప్రతిభావంతుఁడు. ఈ క్రింది పద్యమునఁ దన నాఁటి బాలెంత వేషమును తెలుఁగు నుడికారపుఁ దీరులో నడిపినాఁడు.

పల్లవాధర మణుఁగైన యొల్లెఁ గట్టి
కొంగు మణిహేమ కాంచి కాకోటఁ జెరివి,
సొబగుఁ గాటుక బొట్టుతోఁ జూడ నొప్పె
వింత చెలువునఁ బచ్చిబాలెంత యపుడు. 2-71

సహజముగ లేక తాంబూల రాగముచే నెఱ్ఱనయిన యధరము గల సుశీల స్వచ్ఛమైన చీరగట్టి, పైఁట చెరఁగు మణిఖచితమై హేమ మయమైయున యొడ్డాణమునఁ జెరివి, అందముగ కాటుకదీర్చి బొట్టు పెట్టి పచ్చిబాలెంతరాలయి వింతచెలువునఁ జెలువారెనఁట. పచ్చి బాలెంతలు ప్రాచీనకాలమున పైఁటచెరఁగు నడ్డికట్టు కట్టుట, కాటుక బొట్టు వీడక దాల్చుట పలుమారు తాంబూలచర్వణము సేయుట, వీనితో వింతచెలువము గలిగి యొప్పుటయుఁ బరిపాటి. ఆ చెలువము నీ పద్యమున సాక్షాత్కరింపఁ జేసినాఁడు. ఈనాఁడుకూడ నీ బాలెంత చెలువము సహృదయులయిన భావుకులకు వింత గూర్పక మానదు.

ఆనాఁడు సిరిగలిగి యౌవనమదోద్రిక్తలై వీథులవెంటఁ దిరు గాడు యువతుల యాకృతి నీ క్రింది పద్యమున వెలార్చినాఁడు.

సరిగొన్న తెలిపట్టు జన్నిదంబులతోడ
రత్నాలతారహారము ధరించి
కలిపసిరాకువి దోకలిపైఁ బదార్వన్నె
కరమైన పసిఁడిమేఖల ఘటించి

గంగమట్టియుమీఁదఁ గస్తూరి రసమునఁ
బుండ్రకంబు లలాటమున నమర్చి
కమలకర్ణిక కుండలములు పార్శ్వములందు
లలితంబులగు నొంటు లలంకరించి
యాత్మవంశ పరంపరాయాతమైన
వైదికాచారమార్గంబు తక్కణించి
యౌవనము రాచరికమును నలవరించి
నగరవీథులఁ జరియించుఁ బ్రేగడసుతుఁడు. 2-90

యౌవనమదోద్రిక్తులయిన విలాసవంతులగు విప్రులానాఁడు, ఎగుడుదిగుడు లేని పట్టుజందెములు వైచుకొని, వానితోపాటు, రత్న సమ్మిళితముక్తాహారములు దాల్చుట, సన్నని నీర్కావిరంగుగల దోవతి గట్టి దానిమీఁద బంగారు గోవ్రతాడు మొల నూలుగాఁ బెట్టుట, నుదుట గంగమట్టిపూసి మీఁద కస్తూరినామము పెట్టుకొనుట, చెవులను దుద్దులు పెట్టుకొని వాని ప్రక్కన అందమైన యొంట్లు దాల్చుట, యను వీనిని వేషభూషాదికముగాఁ దాల్చుచుండెడివారు. మఱియు వారు వంశక్రమాయాతమైన ఆచారము వదలి పోగరుఁబోతుతనము పెరిగి రాచఠీవితో వీథులలో యువతుల వలపించుటకై తిరుగాడు చుండెడి వారనియు, దీనివలన విదితమగుచున్నది. యౌవనమదోద్రిక్తుఁడయిన సుకుమారుని మూర్తి యీ పద్యమునఁ జూపట్టును.

సుకుమారుఁడు ధూర్తవిటుఁడై పారదార్యమునకుఁ బాల్పడి నప్పుడు, తల్లి యాతనిదుర్వృత్తికి దురపిల్లినతీరు చిత్రించుటలో కరుణారసప్లావితమూర్తి సాక్షాత్కృతిఁజూపట్టును.

రవలయుంగరముల రత్నాంకురములొత్తి
గేల్దమ్మిఁ జెక్కులఁగీలుకొలిపి
మెలకలు పెన్నెద మాలిముట్టి నొడెక్కి కేఁడి
నిశ్వాసపవనంబు నిక్కటిలఁగ

నా కర్ణదీర్ఘంబు లగుశ్రాలఁగన్నులఁ
బరిపాటలచ్ఛాయ పల్లవింపఁ
గంఠగోళంబు గద్గదికానుబద్ధమై
బాష్పధారాంబునిర్ఝరము గాఁగ
పక్ష్మముల జాతి గండదర్పణము దొరసి
వ్రాలి పాలిండ్లపై నశ్రువాఃకణములు
హారలతలకు నాతిథ్య మాచరింప
గుబ్బతిల నేడ్చె నత్తలఁ గువలయాక్షి.

రవ్వలు దాపిన యుంగరములందలి రత్నాంకురములు చెక్కిళ్ళ నొత్తునట్లు హస్తపద్మమునఁ జెక్కిళ్ళు నిలిపి, గండుతుమ్మెద మూతితో ముట్టుటకు జంకునట్లు వేఁడి నిట్టూర్పులు విడుచుచు, ఆకర్ణ విశ్రాంతము లైన కన్ను లంతట నెఱ్ఱవాఱ, కంఠము గద్గదికతోఁ గూడునట్టులు భాష్పధారలు పొడమ, కన్నీటి బిందువులు ఱెప్పలనుండి జాఱి, చెక్కిళ్ళ నొరసి, కుచములపై వ్రాలి, అఱుతఁదాల్చిన హారముల కాతిథ్య మొసఁగుచుండ నాకువలయాక్షి దుఃఖముప్పొంగ విలపించినదఁట. కరుణరసభావసంచారమున వివిధక్రమములు సుకుమారముగ నాయోజించుచు కరుణరసమయమూర్తి నిందు సాక్షాత్కరింపఁజేసినాఁడు.

తలము దప్ప మద్యము త్రావినవాని మూర్తి యీ క్రింది పద్యమునఁ జూపట్టును.

త్రిసరకాస్వాదభవ మదోద్రేకలహరి
ధరణిదేవుఁ డారోజ మత్తావహించి
యారణాలు పఠింపంగ నాలకించి
శంబరారాతి రచిచేయుచఱచి నవ్వు. 3-14.

భూసురుఁడైన సుకుమారుఁడు మూఁడుపాయల కల్లు త్రావి, తత్పానమునఁ గలిగిన మత్తుచే నొడలు తెలియని స్థితిలో పూర్వము వేదము చదివినవాఁడు గాన, అరణ్యకము చదువ మొదలుపెట్టెను.

అది చూచి మన్మథుఁడు రతిదేవిచేతఁ జప్పటులు చఱుచుచు నవ్వి నాఁడఁట. సురాపానమదోద్రిక్తులు, తత్పానమునకుఁ బూర్వమునందు బుద్ధిలోఁ బాదుకొనియున్న సంస్కారవశమునఁ బ్రేలుచుందురు. సుకుమారుఁడు విప్రుఁడుగావున పూర్వవాసనావశమున నారణాలు పఠింపఁ దొరకొనినాఁడు. ఈ విషయమునే తరువాతిపద్యమున మఱికొంత వివరించియున్నాఁడు.

ఉత్సవమొ వైభవమొ లేమియో కలిమియొ
పగలొ రాత్రియొ యెఱుఁగఁ డా బ్రాహ్మణుండు
నవమధూకప్రసవాసవభవము మధువు
దళము దప్పంగఁ ద్రావి మత్తాతిహించి. 3-15.

హద్దుమీఱఁ బుష్పాసవము సేవించి మత్తెక్కిన వ్యక్తికి దేశకాలాది విభాగవివేకము శూన్యమైపోవు ననుట యిటఁ దెల్లము చేసినాఁడు.

చండాలకన్య సరోవరమున ఋతుస్నానము నెఱపి, తీరమునకు వెడలి వచ్చినప్పటి యామె సౌందర్యమును వర్ణించు ప్రకరణమున నామె శిరోజముల నెంతయుఁ బ్రేక్షణీయముగఁ జిత్రించియున్నాఁడు.

అకలంకరీతి నొయ్యఁ దడియార్చునెడన్ జఘనాంతికంబులై
కేకికలాపలీల నళికించి, మధువ్రతపాలి కాకృతిం
గైకొని, యింద్రనీలమణి ఖండవిలాస మలిమ్లుచంబులై
చీఁకటి గొల్పె బ్రాహ్మణుని చిత్తము వెన్నెలసోగ వెండ్రుకల్. 3.44.

ఆమె స్నానముచేసి, పెద్దవి అందమైనవి సోగవైనవి యగు శిరోజములను తడియాఱఁ జేయునపుడు, వివిధభంగిమలలో నెమలి పింఛమును,తుమ్మెద బారును, మిఱిసినవియై ఇంద్రనీలమాణిక్యశకల విలాసమును ముచ్చిలునవియై కానవచ్చి బ్రాహ్మణునిచిత్తమునకుఁ జీఁకటి గొల్పిన వఁట. స్త్రీలక్షణములలో కచకుచములు ప్రధాన

ములు. వాని భావాభావములే స్త్రీ సౌందర్య భావాభావములకు నిదర్శనములు. చండాలిని విలక్షణసౌందర్యవతినిగను సుకుమారుని కామాంధునిగను జేయఁ దలపెట్టినాఁడు గావున శ్రీనాథుఁ డామెశిరోజముల నింత విలక్షణముగఁ జిత్రించి పెట్టినాఁడు. అదియును గాక సౌందర్యనిరూపణాభినివిష్టమతియై శ్రీనాథుఁడేవిషయమును జేఁబట్టినను తత్సమగ్రత సంపాదించును గాని, సంకోచము నేపాటియుఁ జాటింపఁడు. ఇంతటి కేశసౌందర్యము నాఁతడు పరికించియే దీని నిట్టులు రూపొందించియుండును. ఈ దృశ్యభావనకు తత్సమాన దృశ్య దర్శన మావశ్యకము. లేకున్న నిది యతిశయోక్తిగ భాసించును.

చలిని వర్ణించు ప్రకరణమున సామాన్యముగ సాక్షాత్కరించు మూర్తి నొక్కటి సాక్షాత్కరింపఁ జేసినాఁడు.

ఇనుఁడు కోదండ రాశిమీఁ దెక్కినపుడు
ఇక్షుకోదండ వల్లి నెక్కిడు మరుఁడు
సమదవేదండసమ మహాసత్త్వుఁ డయ్యు
జనుఁడు కోదండమును బోలెఁ దనువు వంచు.

సూర్యుఁడు మార్గశిరపుష్యమాసములకు మధ్యవేళ ధనూరాశిలోఁ బ్రవేశించును. ఆసమయమున చలి మితిమీఱి యుండును. చెఱుకు తోఁటలు కూడ ముదురఁబాఱును. ఆసమయమున మన్మథుఁడు ఇక్షు ధనువు నెక్కువెట్టి యుండును. ఆతరుణమున మదపుటేనుఁగుతో సమానమయిన బలముగల జనుఁడయినను తన శరీరమును వింటిబద్ద వలె వంచును. ఎంతటి బలవంతుఁడయినను ధనుర్మాసమునందలి చలికిఁ దట్టుకొనలేక శరీరమును వింటి బద్దను వలె వంచవలసినదియే. ఇది సర్వజనానుభవ గోచరమైన దృశ్యము.

## అష్టాదశ వర్ణనములు

శ్రీనాథుని యీ శివరాత్రిమాహాత్మ్య మను ప్రబంధము గద్య పద్యాత్మక రూపమునఁ జిన్నదియైనను, ప్రబంధమునకు వలయు

లక్షణముల నన్నిటిని సమకూర్చినక్రమమును బట్టి చూచినను, కావ్యసామగ్రీసమన్వితిని బట్టి చూచినను నిదియొక యుత్తమ ప్రబంధ మనఁదగియున్నది. శ్రీనాథుని రచనలన్నియు స్వేచ్ఛానువాదములే గాని, యథాతథానువాదము లేవియుఁ గానేకావు. ఈ కావ్యమునకు మూల మీశానసంహితలోని యితివృత్తమైనను నిదియొక స్వతంత్ర కావ్యమనియే యనఁదగియున్నది. ఈ కావ్యమునకు మూలమునందలి యితివృత్తాపేక్ష చాలతక్కువ. శ్రీనాథుని భావనామయమైన కావ్య సామగ్రీసృష్టి దీనిలో చాల హెచ్చు. ఈ కావ్యమున సూచనా మాత్రసారముగ సంక్రాంతమైన విషయమే తరువాతి ప్రబంధయుగ కావ్యనిర్మితి పద్ధతికి మార్గదర్శక మయ్యెనా? యని యనిపించు తీరులో నడచినది. ఈ ప్రబంధమునం దష్టాదశవర్ణనములు ప్రకరణ వశమున నన్నియు జతగూడినను, అతిమాత్ర మనిపించునట్లు లెక్కడను గానరాదు. ఔచిత్యమునకు భంగపాటును జూపట్టదు. అష్టాదశ వర్ణనా సమన్వితంబు గావింతుననుప్రతిజ్ఞా నిర్వహణ మెట్లు సాగెనో యాతీరును కొలదిపాటి వివరణముతోఁ దెలిపెదను.

సముద్రవర్ణనము — అటఁ గాంచెం బద్మగర్భుం డహిమకరధునీ ...

... జగద్వ్యాప్తి లబ్ధిన్ సుధాబ్ధిన్. 1-72

శైలనగర వర్ణనములు — కాంచనాచలముతో గర్వించియే కొండ. ...

రత్నపుర మనఁ గల దొక రాజధాని

ఆశ్వా. 2-8వ పద్యము మొదలు 11-వ పద్యము వఱకు.

ఋతువర్ణనము — ఈ కావ్యమున హేమంత శిశిర వసంత ఋతువులు వర్ణనోపాత్తములయినవి. ప్రాచీనకవులు ఋతువర్ణనప్రసక్తు లయినచోఁ దన్మాత్రలముగఁ బ్రకృతి చిత్రణమును గావించుచు వచ్చిరి. నాఁటి వారి కవితాప్రవృత్తి కాదర్శమన్నిటను సంస్కృతకవులు తద్విరచిత కావ్యములు గావున వారి యడుగు జాడలలో మెలఁగుచు

వచ్చిరి. కావుననే కల్పనాపాటవము అలంకారపరిపుష్టితోపాటు కవులయూహ కందిన ప్రకృతిదృశ్యములు ప్రబంధముఖమునసాక్షాత్క-రించుచు వచ్చినవి. శ్రీనాథుని రచనలో మాత్రము కవితాస్రవంతి సంస్కృతచ్ఛాయలో జాలు వాఱినను, తెలుఁగుఁదనము తరిగిపోక, స్వాభావికత సడలిపోక, తెలుఁగు నేలఁ గాన వచ్చెడి వివిధ దృశ్యములు ఋతువర్ణనల మూలమున వెలువడుచు వచ్చినవి. ఇతర కావ్యములం దేకవియు నంతగఁ జేపట్టని హేమంత శిశిరములఁ గైకొని వింతహొయలతోఁ జిత్రించి పెట్టినాఁడు.

## హే మం త శి శి ర ము లు

వీని వర్ణనోపక్రమమే విలక్షణము.

క. హేమంతము శరదాగమ
సామంతము తుహినకర విసంజ్ఞితశర్బరీ
సీమంతము మదనేబల
శ్రీమంతము దాఁపె భువన సీమాంతంబై.

చక్కని పలుకుబడిలో హేమంత సమయమును శరత్సమయమున కను సామంతమును మదనబలశ్రీమంతమును జేసి లోకము నందంతట నవతరింపఁ జేసియున్నాఁడు. ఇఁక నిప్పటి ప్రకృతి వైభవ చిత్రణ మత్యంత విలక్షణము,సహజదృశ్య సమన్వితమునై యొసలారినది. అది యెట్లు కొనసాగెనో కనుఁగొందము.

బలుసు ల్పండెను దొండమక్కుపడియెం బ్రాఁగుచే లొప్పె కెం
దలి పూఁబాళల తావిఁ గ్రోలి పొదలెం గా బేరడిగ్వాయువుల్
ఫలినీవల్లిమతల్లికల్లరులపైఁ బైపై నలిప్రాతముల్
పాలసె న్మంచులు రాలె రాత్రికరిణీపూత్కారవార్బిందువుల్. 4-19.

బలుసుతుప్పలు పండియుండుట యొక ప్రేక్షణీయమైన దృశ్యము. అవి పండుట హేమంతసమయమునందే జరుగును. ఆ పండ్లు పండినపుడు చెట్టునందొక్క యాకేని యుండక రాలిపోవును.

తుప్పలన్నియుఁ బచ్చని పండ్లతో నిండి చూడ ముచ్చటగొల్పుచుండును. ఆసమయమునందే పెద్దవరి చేలు పండఁబాఱి వెఱ్ఱని కోవలతోఁ గూడిన గింజలతో నిండియుండును. కన్నారినంతమేర పండఁబాఱిన వరిచేల సొబగు కూడఁ గడుఁ బ్రేక్షణీయముగనే యుండును. ఇఁక నాసమయమునం దుత్తరదిశనుండి కొండగాలులు వీచును. శ్రీనాథుఁడు సామాన్యముగ నెట్టి వాయువునకైన గంధవహ నామము సార్థకముసేయుటకై వానినిపోక చెట్ల పూలగుత్తులలోని పరిమళమును గ్రోలునట్టులుసేయును. పోక పూవులలో సౌరభభరము మిక్కుటము. మఱియు ప్రేంకణపుఁ దీవల పూలగుత్తులపైఁ దుమ్మెదలు మూగినవి. మధుసౌరభభరితమైన పూవులమీఁదికి తుమ్మెద బారులు చేరుటయు సహజమే. ఇఁక రాత్రివేళ మీఁదినుండి క్రిందికి రాలెడి మంచుబిందువులు, రాత్రియనెడి యాడేనుఁగు ఫూత్కారము సేయఁగా రాలిపడెడి నీటిబిందువుల ట్లుండెనఁట. ఇందు సహజ విషయములో పాటు ఉత్ప్రేక్షాసమన్వయమును గూడినది. శ్రీనాథునకు వరియన్నమన్నను, వరిచేలనినను ప్రీతి మెండు. పలుతావులందు పలుమాఱులు తత్ప్రస్తావము దెచ్చుచునేయుండును. ఇప్పుడు పండిన వరిచేలసొరు నొకవింత యొయ్యారముతోఁ దీర్చి దిద్దినాఁడు. వరిచేలు పండి వెన్నులన్నిట నూగు రేగినది. చెఱువుల క్రింద కాలువ నీటి ప్రవాహము పాఱుదలచే పండిన వరిచేలున్న చోటు లన్నిటను, భూమి చలి మిక్కుటమగుటచే గగుర్పాటునంది రోమాంచిత దేహమైనట్టులుండెననినాఁడు. ఇట్టి రూపకల్పనము నీక్రింది పద్యమునం దాయోజించినాఁడు.

కలమపశాలి కాకశికకంటక కోటులచేతఁ జాడ్యకిం
పలశతీచెవ్వర్రతి తుహినాగమవేళఁ దటాకసారణీ
సలిలము వాఱి పండిన యజాంగణసీమము లెన్ని యన్నిటన్
దలముగ నీరుపేర్మిఁ గరుదాల్చిన భావము ప్రస్ఫుటంబుగన్

ఈనాటి చలి నుద్దేశించియే రెండు పద్యములలో ద్వివిధమైన కల్పనము కావింపఁబడినది. కల్పనాచమత్కారము కావ్యాంగములలో నొక్కటి.

క. కలవింక కలకలాకుల
వలభీగర్భములు సౌధవాటములు పురం
బులయందుఁ దుహినకేళిఁ
జలి గులగులఁ గూయునట్టి చందంబొందెన్.

పట్టణములలోని మేడల మీఁది భాగములు ఇండ్లకప్పులు, పిచ్చుకల కలకలారావములలో నిండియుండుటచే చలిచేఁ గులకుల కూయుచున్నట్లు లుండెను. ఇటులనే మొక్క ప్రేంకణపు చెట్టుల మీఁది పూగుత్తులకు మూఁగు తుమ్మెద గుంపులు ధ్వనిచేయుట, వనదేవత మిక్కుటమైన చలిచే వణఁకుచు దంతవీణ వాయించెనో యనునట్లుండె ననినాఁడు. చలి మిక్కుటమైనపుడు తట్టుకొనలేని యదనునఁ బ్రాణులు వణకుచు పండ్లు చప్పుడు సేయుదురు. దానిని దంతవీణ వాయించుటగాఁ జిత్రించినాఁడు. ఇట్టి చలివేళయందుధన్యాత్ములు కొందఱే రాత్రివేళ నిద్రింపఁగలిగెద రనినాఁడు. ఇదియు నొక మధురోదాత్తమైన కల్పనయే.

శా. బింబోష్ఠీకుచకుంభ భారము లురః పీఠంబున న్హత్తి మో
దం బారన్ మృదుకేళి శయ్యల శుభాంతర్గర్భ గేహంబులం
దాంబూలీదళ పూగపూరితముఖుల్ ధన్యాత్మకుల్ శీతకా
లం బెంతేనియు నిద్రవోదురు నిశల్ సంభోగ లీలావిదుల్. 4-23

శీతకాలములో ధన్యాత్ములు కొందఱు దొండపండువంటి మోవిగల యువతుల కుంభములవంటి కుచలములబరువును తమ వక్షః పీఠముల మోచునట్లు చేసికొని, సంతోషములో మెత్తని సెజ్జలపై, అందమైన యిండ్ల లోపలిగదులలో, తములపాకులు పోకలు గూర్చి నమలుచు సంభోగ లీల నెఱిఁగినవారై యెంతేని నిద్రపోదు

ఁటట! శీతకాలమున మిక్కుటమగు చలిచే నిద్రపట్టనినాఁడు, నిద్రా సాధనముల నిట్లు రమ్యముగ రూపొందించినాఁడు.

ఈ హేమంత సమయమున కొండగాలి అలకాపురము మొదలు పెట్టి రాధాపురము వఱకు నడుమనుండెడి ప్రదేశములందు వింతలు గాన్పింపఁజేయుచు, అడవులమీఁదుగా కళింగాంధ్ర దేశముల సరణిఁ బట్టుచు సపాదలక్ష శైలములను బలుకరించుచు వచ్చుటను చిత్రముగఁ జిత్రించియున్నాఁడు.

సీ. ధనదశుద్ధాంత కాంతాపయోధర భార
సంవ్యానపల్లవ ప్రసంపనములు
కైలాసగిరి కూటకల్పద్రుమవాట వీ
కుసుమగుచ్ఛరజోవగుంఠనములు
చంద్రభాగాసరిత్సలిలవీచీఘటా
ప్రేంఖోలికాకేళీరింఖణములు
రాధాపురీహర్మ్య రత్నహేమ గవాక్ష
సంవేశవక్రియా సౌష్ఠవములు
కలనుగాఁ జంపకారణ్యవాటిఁ దరిసి
కాశి దొరసి కళింగాంధ్రదేశసరణి
దక్షిణము సాగను సపాదలక్షశైల
కటకబంధుఁ డుదగ్దిశాగంధవహుఁడు.

ఈ వాయుప్రసారమునందుఁ గొన్ని వింత విటచేష్టితములను గాన్పింపఁజేసినాఁడు. అది వాచ్యముగాక వ్యంగ్యభంగిలో నడిచినది ఉత్తరదిక్కు నుండి దక్షిణముగాఁ బ్రసరించు గాలిని తెలుఁగు నాఁట 'కొండగాలి' యనియందురు. ఆమాట సార్థకమగుటకు సపాదలక్ష శైలముల ప్రదేశములతో బంధుత్వము నెఱపింపఁజేసినాఁ డాగంధవహామునకు. మఱియు నీవాయువునకు గంధవహనామమును సార్థకము చేయుటకు చిగురుటాకులతో కుసుమరజముతో జలతరంగక్రీడలతో అంతఃపురాంతఃప్రవేశముతో సంపెంగవనములతో సంబంధమును

గల్పించి, స్త్రీలింగశబ్ద సంయోజనమున వింతవిటచేష్టితముల సంతర్హితము చేసియున్నాఁడు.

ఇది హేమంతఋతువర్ణన ప్రస్తావము గావున, దీనిలో చలికి ప్రవేశ నిర్గమములను రెండింటిని తెలుఁగు పరిపాటిని దెలిపియున్నాఁడు.

గీ. చలి ప్రవేశించు నాగులచవితినాఁడు
వెలయు వేసవి రథసప్తమీ దినమున
నచ్చుసీతు ప్రవేశించుఁ బెచ్చుపెరిగి
మార్గశిర పౌషమాసాల మధ్యవేళ.

నాగులచవితినాఁటికి చలి ప్రవేశించును. రథసప్తమికి చలి తగ్గి వేసవి యనిపించును. కార్తికశుద్ధచవితి సంస్కృత పరిపాటిని నాగచతుర్థి. తెలుఁగువారి కది నాగులచవితి. ఈనాగులచవితి తెలుఁగు నాఁటివారి కందఱకు నాగులకు పూజచేయు పండుగ. ఆనాఁడు చాల మంది వనిత లుపవసించుట పాముపుట్ట లున్నచోట పాలుపోయుట, తమ సంతానమున కభయము నర్థించుట నెఱపుదురు. మాఘశుద్ధ సప్తమి రథసప్తమి. ఇది కూడ నాంధ్రుల కొక పర్వదివసము. ఈనాఁటికి సూర్యరథము ఉత్తరమునకుఁ బయనించును. కావునఁ దెలుగువారు పాలు పొంగించి సూర్యభగవానునకు నివేదింతురు. 'రథసప్తమికి రథములు మరలును' అనుసామెత. శరదృతువులో జైత్రయాత్రకుఁ దరలిన రథములు మరలు నని జనశ్రుతి. ఈనాఁటి కుత్తరాయణ ప్రవేశమయి చలి తరిగి వేసవి చూపట్టును. ఈతీరయిన తెలుఁగు పరిపాటుల నిందు సూచించుచు, మార్గశిర పౌషమాసముల నడిమివేళ అచ్చుసీతు పెచ్చు పెరిగి యుండు ననినాఁడు. ఈపద్యమునందలి విషయ మంతయు సార్వకాలికము.

మకరసంక్రాంతి తెలుఁగువారి కొక పెద్ద పండుగ. అప్పటికి సూర్యుఁడు కోదండరాశి నుండి మకరరాశిలోఁ బ్రవేశించును. ఆసమ

య మాబాలవృద్ధము చలిచే బాధపడుచునే వినోదించువేళ. ఆవినో దము నీ క్రింది పద్యమునఁ జిత్రించినాఁడు.

ఇండ్లమొదలను నీరెండ నీడికలను
వనుఁగుఁ దమ్ముఁడు వన్నెయు నాటలాడు
నత్తయును గోడలును గుమ్ములాడుఁ గుమ్ము
గాచుచోటికి మకరసంక్రాంతివేళ.

ఇండ్లముగింట నీ రెండలు పాలునపుడు చిన్నపిల్ల లన్నదమ్ము లీడికలాడు కొందురు. చలిగాచుకొనుటకై కుమ్ములున్నచోటికి అత్త కోడండ్రు చేరి కుమ్ములాడుకొందురఁట. ఈ రెండును సహజములే. హేమంతానంతరకాల భావియైన శిశిరమునకుఁ బ్రస్తావము గావించుచు, మకరసంక్రాంతి పుణ్యకాల ప్రసంగము గొనితెచ్చి, మాఘు వేళను బ్రవేశపెట్టినాఁడు. మాఘకృష్ణచతుర్దశి మహాశివరాత్రి పర్వ సమన్వితముగావున నేతదృతువై భవమును పుణ్యక్రియారంభముతోఁ బవిత్రతరము గావింపఁ దలపెట్టియున్నాఁడు.

సీ. కాశిలోఁ జక్రపుష్కరిణి దుష్కరశుష్క
గహనావళీ దావదహన జిహ్వ
సుకృతేశ్వరవరకుండి పీఠపురి శం
కాతమఃకాండ చండాంశుదీప్తి
దక్షవాటంబున సప్తగోదావరి
కలిదోష పాషాణకులిశధార
గౌతమీతటిని మార్కండేయపురి పాప
దురితాహి సంఘాత గరుడమూర్తి
విన్నటను దీర్ఘమాడంగ వేఁగుచెంతు
రథిలమునులఁ బ్రభాతసంధ్యాగమముల
గ్రహగణేశుండు కోదండరాశిఁ బాసి
మకరమున కేఁగుదేరంగ మాఘువేళ.

సూర్యుఁడు ధనూరాశిని వదలి మకరరాశికి వచ్చునప్పటికి మాఘుమాసము ప్రవేశించును. ఆపుణ్యసమయమున సకలమునులు

ప్రాతః కాలసంధ్యాసమయములందు సకల కలుషములు తొలఁగు టకై, కాశిలో చక్రపుష్కరిణియందు, పీఠికాపురమున కుక్కుటేశ్వరకుండమునందు (పాదగయాతీర్థమునందు) దక్షారామమునందలి సప్తగోదావరమున, రాజమహేంద్రవరమున మార్కండేయ శంకరు నెదుట గౌతమీనదియందును, తీర్థమాడుటకై యేతెంతురఁట. కాశీక్షేత్రతీర్థముదక్క మిగిలినతీర్థములన్నియు నాంధ్రదేశమునందలివియే యగుట శ్రీనాథుని యాంధ్రతీర్థక్షేత్రాభిమానమును వ్యక్తముసేయుచున్నది. మఱియు శ్రీనాథుఁడు మాఘవేళఁ బలుమాఱు లీతీర్థములందు గ్రుంకులు వెట్టియుండుననుటగూడ వ్యక్తమగుచున్నది. ఆతనినాఁటి సుకృతార్థుల ప్రవృత్తికూడ నిచట సూచితమగుచున్నది. ఇఁకనప్పటి ప్రకృతివికాస విభవము నిట్లు చిత్రించి పెట్టినాఁడు.

పఱివోయెన్ దుహినంబు పండె వరి యిప్పల్ పూసె శైలంబులన్
గఱిగట్టెన్ మరురాజు తేఁటిఱెక్కలం గాండప్రకాండంబులం
జఱపించెన్ గ్రహరాజు మారకునిం జక్రాద్రికూటంబులం
దఱిఁ గౌబేరదిగంతరిక్షపథయాత్రాచైత్రి తుత్తింభమున్.

సూర్యుఁ డుత్తరాయణమునఁ బ్రవేశించి ఉత్తరదిగ్యాత్రాభేరిని తనయనుచరుఁడైన మారకునిచే చక్రవాళ పర్వతశిఖరములయందు మ్రోగింపఁజేయునప్పటికి మంచు కొల్లఁబోయినది. వరి పండినది. కొండలపై ఇప్పచెట్లు పూసినవి. మన్మథుఁడు తనపుష్పబాణములందు తుమ్మెద ఱెక్కలచే గఱి గట్టించినాఁడు. మధుమదారంభమున కనువైన సమయ మది. కావున వలరాజుచేఁగూడ సమరసన్నాహము చేయించినాఁడు.

ఇఁక నప్పటి మనోహరదృశ్యములను భోగానుభూతుల నీక్రింది విధముగ రూపొందించియున్నాఁడు.

"ఎండియుఁ జకోరలోచనల కుచమండలంబులకు కర్పూరక్షోదంబుల మేదించిన చందనానులేపనమై పథ్యం బపథ్యంబయ్యె. (చలి తగ్గుటచే శీతలానులేప

వనములు హితవయినవట) పర్యాప్తపక్వక్రముకంబులను జక్రమిథునంబుల నెట్టిలోని
బిట్టింపఁ జేసి విడిచి నిల్చి మనోభవుండు విసుడించిన నిట్టూర్పులంబోలె నిశాసమయం
బుల నిండువెన్నెలలోనం జన్నచిన్న నడికేఁడి పొడచూపె. (నిశితముగఁ బరికించినఁ
గాని పట్టువడునదిగాదు.) కేదారక్షేత్రంబులం గలమగోపిక లొడికంబుగా దంచిన
నిర్దంపుదుద్దుగడు పాలిసంగఁబాసిలు సద్యోమార్జశాకలంబున నవలిన్నిగ్ధవర్ణంబులై
కర్ణాటదేశకాటంకినీ దశనవజ్రాంకురంబుల కాంతిసంపద దలంచె. నీహారవ్యాపా
యంబున నిర్మలంబులై బహుళపక్షప్రదోషంబులయందుం దారకంబులు వికచకు
ముదకోరకంబులు కొలంకులలోనం బ్రతిఫలించిన నక్షత్రమాల, కలహంసలు ఖండిం
పఁగాఁ దేలుచున్న తామరతూండ్లవలె నుండె నవటలో కల్పనాసమన్వితభావన
సుకుమారతరమై రూపలారినది. (ఈ దృశ్యము కన్నులారఁ గాంచినఁగాని పొడకట్టు
నది గాదు) పలపలని మంచుఁదుప్పర ముసురుజడిం దడిసి, జవసావడి కేఁకలగుపోఁక
పూఁబాళల పరిమళంబులఁ బుక్కిలించి, యాపనుపసువిషమ కుసుమఫలశ్రీదామతల్లి
కల మల్లెపెనంగి దప్పివఖిల్లపల్లవాధర గల్లఫలకంబులఁ గొత్తయగుచుండు చెమట
చిక్కడి యుండెను. ఇంత దనుకఁ బ్రకృతి వికాసమున సంభూతమైన దృశ్యముల
ను శ్వేషింపఁజేసి యికమీఁద భక్తిభావ సంసేవ్యమైన శివరాత్రిపుణ్యకాల మాహా
త్మ్యమును జిత్రింపఁదలపెట్టినాఁడు. కాశీ శ్రీశైల కుంభఘోణ కాంచీ కాంచన
సభా కాళహస్తి కురుక్షేత్రాది పుణ్యస్థానంబులం గూప వాపీ తటాక కుండికా
ప్రస్రవణ స్రోతస్వినులం బ్రత్యూషకాలంబులం బరమర్షి పార్థివ తీర్థంబులాడె.
ఇవ్విధంబున మాఘమాస వాసరంబులు వసంత సమకాపాపంతిబులు జరుగుచుండ
నాచండాలాది మనుష్యులకు భుక్తిముక్తులు ప్రసాదింపంజాలి, మాహేశ్వరులకు మహో
త్సవంబు, వేదాంతులకు సంతోషంబు, శంభునకు విస్రంభస్థానంబు, శాంభవికి హృద్య
రోమాంచకరము, హేరంబునకుఁ బ్రియంబు, దురితతమస్ఖండనంబునకు గండ్రగొ
డ్డలి సంతాపశాంతికి భాగీరథీ ప్రవాహంబు శివరాత్రి పుణ్యకాలం బేతెంచె."

ఈ విధముగ శిశిరర్తువిభవము నంతయు శివరాత్రి పుణ్యకాల మహాత్మ్య ప్రతిపాదకముగ నిర్వహించి శ్రీనాథుఁడు తనకుఁ గల యీశ్వరార్చన కళాశీలత్వమును బ్రతిపాదించియున్నాఁడు. ఈ ఋతుద్వయ విభవము నింత యుదాత్తముగను సుకుమారముగను జిత్రించిన తా వాతనికృతులలోఁ గాని తదితరకవుల కృతులలోఁ గాని యింతగఁ గానరాదని మన మూహింపవచ్చును. సృష్టి సౌందర్యావిష్కరణ విషయమున శ్రీనాథునిదృష్టి యెంత నిశితముగఁ బ్రసరించునో, యనుట కేతదృతువర్ణనము కూడ నొక తార్కాణము.

## వసంతవర్ణనము

సీ. కామినీగండూష కాదంబినీధారఁ
బులకించె నారామభూమిఁ బొగడ
చివురాకుఁ జవిచూచి చవిచూచి రొదలించెఁ
బంచమస్వరమునఁ బరభృతంబు
సంఫుల్ల కోరక స్తబకాంచితంబైన
గోరంటపై భ్రమియించెఁ గొదమతేఁటి
పరిపక్వసహకారఫలరసాస్వాదన
ముదమునం గీరంబు చదువఁ దొడఁగె
విట విటీసముదాయములు వివిధ విధుల
నుపవనక్రీడ సల్పిరి యుబ్బు మిగిలి
యఖిలజనులకు సంతోష మావహించె
వాసరములైన మధుమాస వాసరముల.

శ్రీనాథుని నాఁడు గూడ వృక్షములను బుష్పింపఁ జేయుటకై దోహదక్రియలు నెఱపుచుండెడివారో, లేక సంస్కృతకావ్య పరిపాటిని నడిపించినాఁడో కాని, ఆరామభూమిలో కామినీ గండూష మద్యముచే వకుళవృక్షమును వికసింపఁ జేసినాఁడు. వసంతోదయ మైనంతనే శ్రీనాథుని కవితలో పరభృత పంచమస్వరము వినిపింపక మానదు. కాని యిచటఁ గోయిల చిగురుటాకు చవిచూచి చవిచూచి రొదలించుటలో పంచమ మతిమధురముగ వినిపించుచున్నది. గండుతుమ్మెదలను వికసించిన మొగ్గలచే బరువెక్కిన గోరంటలపై పరిభ్రమింపఁ జేసినాఁడు. గోరంట పూల పరిమళ మతివిస్తృతము. పండిన మామిడిపండ్ల రసమును మెసవినంతనే చిలుకలు చదువ మొదలుపెట్టెనఁట. మధుర చూతఫల రసాస్వాదముచేసిన చిలుకలచేఁ జదివించుట యనునది యొక సుకుమారతరమైన ప్రయోగము. వసంతోదయమున నుబ్బుమిగిలి విటవిటీజన సముదాయము పెక్కుతెఱఁగుల నుద్యానవనములలో విహారము లాచరించుట యనునది మధుమాసవాసర సహజలక్షణము. మధుమాస వాసరములలో సకలజనులకు సంతోష మావహించె ననునది సార్వకాలికమైన సత్యము.

ఈ విధమయిన వసంత వర్ణనమును సుకుమారుని ప్రవృత్తిని పాపభూయిష్ఠము గావించుటకు సాధనము చేసినాఁడు.

"సకలజనమనోహారంబులగు మధుమాసవాసరంబుల, వష్పాపిష్ఠుం డు చండాలకన్యకం దగిలి, రెయింబెలుంగక, అజ్జ యొజ్జగించి, మానం బూనంబుచేసి, కులంబు వడటం గలిపి, శీలంబు పరిత్యజించి, దిట్ట కూళయై, కన్నుగానక, కాలరంబెత్తి, తిరుగుచుండ ... వతని దుర్వర్తనంబులు ప్రసంగించి ప్రకాశంబుగా వాడుచుండిరి.

మధుమాసవాసరములకు సుకుమారుని దుర్వర్తనమునకుఁ గార్య కారణభావమును గల్పించి నిర్వహించుటలోఁ గూడ నొకమధురభావ పరిష్కారము పొడగట్టును. ఈ ఋతువర్ణనములందచట నచట శృంగారభావాను ప్రవేశము గాన వచ్చినను నౌచిత్యమునకు భంగకర ముగఁ గాని, చదువరులకు విసువు జనించునట్లుగాని కవితావిన్యాస మెచ్చటను గానరాదు. సమయోచితముగ లలిత మధుర సుకుమార భావ సంయోజనమే యెల్లెడల జాలువాఱినది.

సూర్యచంద్ర వర్ణనము— సూర్యోదయ సూర్యాస్తమయముల లందును చంద్రోదయ చంద్రాస్తమయములందును ప్రకృతిలో వింత వికాసములు గానవచ్చును. సౌందర్య నిరూపణ తత్పరుఁడైన కవికా పన్నివేశములు భావనామయసృష్టి కనుకూలములు. కావుననే మహా కావ్య కర్తలు తద్వర్ణనమును కావ్యాంగములలో నొక్కటి గావించి యున్నారు. ఈ కావ్యమున సూర్యాస్తమయ చంద్రోదయ ప్రసా రము లెట్లు సాగెనో కనుఁగొందము. సుకుమారుఁడు చండాల కులాం గనను వలచి వలపించి, యామెతో సురత సౌఖ్య మనుభవించునంతలో సూర్యాస్తమయమగుట ప్రారంభమైనది.

సూర్యాస్తమయము

ఉ. కాయజవిక్రియం బడయఁ గాని కులంబున సంగమించి య
న్యాయము సేయునే యిటు దురాత్ముఁడు వీఁడు త్రపావిహీనమల్
మాయఁగఁ దట్టియుంచు నలిమాత్రము లజ్జితుఁడైన క్రైవడిం
దోయజషండబాంధవుఁ డధో ముఖుఁడయ్యె నభోంగణమ్మునన్.

దుర్బుద్ధియైన యీ విప్రుఁడు మన్మథ వికారముచేఁ బొంద రాని కులమునఁ బొందును ఘటించుకొని, సిగ్గుబిడియములు వదలి యింతటి యన్యాయము సేయునే? యని, పద్మబంధువు తాను సిగ్గుపడినట్టు లాకాశమున తలవాంచుకొనెను. ఆకాశమున సూర్యుఁ డధోముఖుఁ డగుటను, కర్మసాక్షి గావున విప్రుఁడన్యాయము సేయుట చూచి సిగ్గుచేఁ దలవాంచికొనినట్టు లుత్ప్రేక్షించియున్నాఁడు. ఈ యుత్ప్రేక్ష యిచట నౌచిత్యభరితమై సూర్యాస్తమయమును జిత్రముగ నుత్ప్రేక్షింపఁ జేసినది. ఈకల్పనము మను చరిత్రకారునకు మార్గదర్శకమైనది. కాని యిచటఁ బెద్దన్నగారు చేసిన కల్పనము మాత్రము నౌచిత్య విషయమునఁ గొంచెము విచికిత్సనొదవింపఁ జేయుచున్నది. అచట సూర్యాస్తమయ వర్ణన క్రమమిట్లు నడచినది.

తరుణీనవవ్యకాంత నతి దారుణపుష్ప శిలీముఖవ్యథా
భరవివశాంగి నంగభవు శారికి నగ్గము చేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించె నోయన నభోమణి దాల్చెఁ గషాయ దీధితుల్.

రెండిటను భూసురుఁడే యపరాధి. రెండిట నుత్ప్రేక్షాలంకారమునకే విషయ వివరణ మాదృతమైనది. శ్రీనాథుఁడు భూసురుఁడు చేసిన యన్యాయమునకు సూర్యుని దలవంచుకొనఁ జేసినాఁడు. పెద్దన్నగారు ప్రవరుఁడు వరూథినిని వ్యథల పాలుచేసి వెడలి పోయెనని కినుక వహించి యెండ లెఱ్ఱఁ జేసికొనె ననినాఁడు. శ్రీనాథుని రచనలో నసంగవాసుల సంగమమున సుకుమారుఁడు దురాత్ముఁడు. తరుణికి వ్యథ గలిగించిన ప్రవరుఁడు మహీసురాధముఁడు. ప్రవరున కీవిశేషణము నూన్చుట యేతత్ప్రకరణోచితమైనట్టులు గానరాదు. నిత్యము కర్మసాక్షి కెరఁగు ప్రవరుని, స్వధర్మలోపభీరువును, సత్కర్మ నిరతుని దేవవేశ్యా ప్రణయతిరస్కారమునకు కర్మసాక్షియైన సూర్యుఁడు మెచ్చుకొనవలెను గాని, యాతని నధమునిగా భావించి కినుక వహించుట సమంజమైనట్టులు గానరాదు.

మఱియు నీ పద్యమునం దన్వయము సరిపడుట విషయమునఁ గూడఁ గొంత విచికిత్స పొడముచున్నది. 'అనన్యకాంతన్' అను పదమునకు సంస్కృతవ్యాకరణ పరిపాటినిబట్టి నవిద్యతే అన్యః, కాంతః=కాముకః తా యస్యాః స్సా అనువ్యుత్పత్తిచే, మఱియొకఁడు ప్రేమించువాఁడు లేని, యని యర్థము చెప్పవలెను. అంతకుమున్నె యామెను గంధర్వుఁడు ప్రేమించి, యామెచేఁ దిరస్కృతుఁ డయ్యెనని తరువాతి కథాభాగమే తెలుపుచున్నది. అప్పు డీమె అనన్యకాంత కానేరదు. ఇంతియ గాక అంగభవువారికి నగ్గము చేసిన వాఁడు ప్రవరుఁడు గాఁడు. వరూథిని ప్రణయమే. వరూథినీ ప్రణయమును వలదనుటలో ఏకపత్నీవ్రతుఁడైన ప్రవరునిదోష మేమియులేదు. సత్కర్మాచరణ తృప్తుఁడైన అగ్నిహోత్రుని యనుగ్రహమునకుఁ బాత్రుఁడైన ప్రవరుఁడు కర్మసాక్షియైన భువనచక్షువు నాగ్రహమునకు గుఱికాఁజాలఁడు. అదివ్యతేజములు రెండు నభిన్నములే. కావున మనుచరిత్రమునందలి కల్పన యంతగ సరిపడునట్టులు చూపట్టదు.

ఇటులనే స్వభావోక్తిని నడిపించిన పద్యములలోఁ గూడ వీరిరువురి రచనలకు సామ్యము చూపట్టుచున్నది.

క. క్రుంకె విభాకరబింబము
పంకజషండములు మొగిడెఁ బ్రత్యగ్దిశన్
గంకేళీతరుపల్లవ
సంకాశచ్ఛాయఁ గొమరుసంజ జనించెన్. శివరా 3-94.

శా. శ్రేణుల్గట్టి నభోంతరాళమునఁ బాఱెం బక్షులుష్ణాంశుపా
షాణవ్రాతము శీతమయ్యె మృగతృష్ణావార్ధి యింకెం గడున్
శోణం బయ్యెఁ బతంగబింబము దిశాస్తోమంబు శోభాదరి
ద్రాణం బయ్యె సరోజషండములు నిద్రాణంబు లయ్యెం గడున్.

హిమము ఘనీభూతమైన హిమవత్పర్వత ప్రదేశమున నుష్ణాంశుపాషాణవ్రాతమున శత్యోష్ణత కలుగుట తగ్గుట యెట్లు సరిపడునో? మృగతృష్ణాసముద్రము ఎడారి ప్రదేశములలోఁ బొడముట సహజముగ నుండును. హిమవత్పర్వత ప్రదేశమున నవి పొడముట యింకుటయు నెట్టులో తెలియఁగరాకున్నది. పెద్దన్నగారి రచనమాత్రము సహజమధురముగ నడచినది. (సశేషము.)

# కథానిక

బొడ్డపాటి కుటుంబరాయశర్మ

పాశ్చాత్య భాషా సంపర్కమున నాధునికాంధ్ర గద్య వాఙ్మయములో వెలసిన విభిన్న రూపావళి యందు నవల వలెనే కథానికయు నొకటి. భాష యెంత పురాతనమో కథయు నంత పురాతనము. అందును మన పురా భారత దేశము కథల కాటపట్టు అగుచో నేటి మన కథానికను విదేశీయ ప్రభావ జనిత మననేల? భారతీయ ప్రాచీన సాహిత్యములోని బృహత్కథయు, కథాసరిత్సాగరమును, పంచతంత్ర హితోపదేశాదులును, జెప్పు కథలొకమాదిరివి. మపాసా, మామ్, ఓహెన్రీ, చెఖోవ్, డి. హెచ్. లారెన్స్, ప్రభృతులు చెప్పు కథలు వేఱొకమాదిరివి. ఇది ప్రాక్పశ్చిమములను గూర్చి చేయు బహు స్థూల విభజనము. కాఁగా, పశ్చిమ దేశీయులు శిల్ప నైపుణ్యముతోఁ జెప్పు కథానికల వంటివి మునుపు మనలో గొన్నియేని లేవా? లేకేమి? ఉన్నవి. సాంస్కృతికముగా వారిదొక పద్ధతి; మనదొక పద్ధతియు. ఇదే భేదము నేటి మన కథానిక మాత్రము పాశ్చాత్య వాఙ్మయ సంస్కారానుసారియే యనక తీరదు. కాని యిప్పుడిప్పుడే క్రమశః సమగ్రమైన పరిణతి నొంది యాంధ్ర భాషలోని కథానికయుఁ దన భారతీయ విశిష్టతను నెలకొల్పుకొనుచున్నది.

నేఁడు కథానికల వ్యాప్తికిఁ బెక్కు కారణములు గలవు. ముందు ముద్రణాశాలలను నెలకొల్పి, యచ్చు యంత్రములను దిగుమతి చేసికొంటిమి. దానితో పత్త్రికల కనుదినము రచన లావశ్యకము లైనవి. కథానికల వ్యాప్తి కిది మొదటి హేతువు. రెండవది నిర్విరామమై బహువిధ సుఖ, దుఃఖ సంసృష్టమైన మన జీవిత విధానము. జీవితమునకు వ్యక్తిత్వమునకును సంబంధించిన యెట్టి యంశములను గాని సమస్యలను గాని వ్యక్తీకరించుటకు కథానిక చక్కని

సాధనము కాఁగల్గుట మూఁడవ కారణము. ఇట్టి యనేక హేతువు లచే కథానిక నేఁడు ప్రజానురంజక మైనది.

స్వరూప శిల్ప స్వభావాదుల రీత్యా తెలుఁగున కథానిక యొక ప్రత్యేకత నొందినది. దానికొక యెత్తుగడ, యొక నడక, యొక ముగింపు, నొక విశిష్ట వస్తువు, సన్నివేశ రచనా విధానము, తక్కువ పాత్రలు, తత్పాత్ర పోషణము మున్నగు లక్షణము లేర్పడు చున్న దినములివి. సంగ్రహత, యేకాంశ ప్రవణత, నిర్భరత మొద లైన కొన్ని గుణముల చేత వస్త్వైక్యమును సాధించుట వలన మన కథానిక తదితర వచన సాహిత్య రూపముల కంటె భిన్నమై స్వయం సంపూర్ణమై నిల్వఁగల్గుచున్నది.

ఇఁక మన భాషలోని కథానికా పరిణామమును గూర్చి యుటంకింతును. కీ॥ శే॥ గురుజాడ అప్పారావుగారే ఆధునికాంధ్ర కథానికకు శ్రీకారము చుట్టిరన వలయును. వీరి ఆణి ముత్యాలు' అను కథానికల సంపుటి యిటీవలనే ప్రకటితము క్రీ॥ శ॥ 1910 నాఁటికే కీ॥ శే॥ గురుజాడ వారాంగ్లములో నొక కథానికను వ్రాసిరి. పిమ్మ టివి "మీాపేరేమిటి"? "దిద్దుబాటు", అనునవి మనకు ప్రస్తుతము లైన కథానికలు. ఇవి రెండును 'ఆణిముత్యాల'లో ప్రకటింపఁబడి నవి. కీ॥ శే॥ పంతులుగారు సాంఘికముగ సంస్కార ప్రియులు; భాషా పరముగ వ్యావహారిక వాదులు. ఈ రెండంశములను బొంది పొసఁగి యుండుటచే వీరు కథానికలకు చక్కని యొరవడిఁ బెట్టఁగల్గిరి. అది మొదలుకొని పండితులు, పామరులు, కవులు, గేయకారులు, శతావ ధానులు, ఆశుకవులు, లాక్షణికులు, చిత్రకారులు, రాజకీయ వాదులు న్యాయ వాదులు, విద్యుచ్ఛాఖోద్యోగులు, భోజనశాలోద్యోగులు, ఆకాశవాణీ నిర్వహణశాఖవారు, వైద్యులు, విజ్ఞాన శాస్త్రవిదులు, నుపాధ్యాయులు, పత్రికాలయోద్యోగులు, నటీనటులు, వారు వీరని-

యేమి ? తమ తమ సందేశములను కథానికల మూలమున లోకమున కెల్లరు వినిపించుచునే యున్నారు.

వీరిలో దీని పరిణామమునకుఁ దోడ్పడిన రచయితల ప్రతినిధు లను కొందఱనే పేర్కొనఁగలను. శతావధానులు శ్రీ వేలూరి శివ రామశాస్త్రి గారు ప్రాత క్రొత్తల సమన్వయించుచు, వస్తు వైవి ధ్యముఁ జూపుచు సంస్కర్తృ హృదయముతో రచియింపఁ గల రచ యితలు. 'కథాషట్కము' మొదలైనవి. వీరి ప్రచురణలు. వీరి 'యానందభవనము' నిజముగా నానందభవనమే. ఒక ధర్మమునో, యొక యాదేశమునో నిరూపించు వీరి కథలు చక్కని సంస్కారము గల వారికి బాగుగ రుచింపఁగలవు.

కథానికకు రూపు రేఖలు దిద్ది పిన్నలకు, పెద్దలకు సమాన ముగ సంతోషముఁ గొల్పునట్లు రకరకములైన రచనలు సాగింపఁగల "కథక చక్రవర్తి", శ్రీ చింతా దీక్షితులు గారు. వీరొక విధముగ సంప్రదాయ పాక్షికులు. నవనాగరకతను మృదురీతిగ నవహేళన చేయు కోప వీరిది. కథానికా రచనలో వీరు నూతన పథముల నిర్మించిరి. శ్రీ 'చలం' వంటి వారికి కొన్ని యెడల గురుస్థానీయులు గూడ.

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారొక రీతిగ ప్రథమశ్రేణి కథానికులు. ఆంధ్ర కథానిక యొక్క అచ్చమైన తత్త్వము వీరి రచనలలో ప్రతిబింబించును. పాశ్చాత్యభాషా సంపర్క రూషితము గానిది వీరి భావన; శ్రోత్రియ కుటుంబములోనిది వాతావరణము; సహజ సుందరములైనవి సంభాషణలు; వాస్తవికములైనవి సన్నివేశ చిత్రణలు. అమృత బిందువులు వీరి యీకథలు, చారిత్రక ప్రాధా న్యము గల వీరి 'గులాబీ అత్తరు' సాంఘిక ప్రాధాన్యము గల వీరి 'కచ్చితమైన జవాబు' మున్నగునవి బహు ప్రసిద్ధములు. 'కేవలము'

సంభాషణలతో కథనడుపు నేర్పు వీరికి వెన్నతోఁ బెట్టిన విద్య. 'మార్క్సిస్టు' సాహితీ పరిచితితో పక్కాఅలేకయే కొన్ని కథలలో జీవిత సత్యమును ద్రాఘీయః ప్రతిభతో నిరూపించిన లబ్ధప్రతిష్ఠులు వీరు.

వస్తువులోను, విధానములోను, భావములోను, భాషలోను గూడ నొక నవ్యతఁ గొని తెచ్చిన వారు శ్రీ చలంగారు. కథానికా చరిత్రలో విపథమునఁ బోయిన ప్రథమ విప్లవకారులని విపశ్చుల చేతను, విపశ్చితుల చేతను విదలింపులు, విప్రకారములుఁ దిని కూడ, విప్రతిపత్తి వలన విరవిర పోవని వారు వీరు. ఒప్పినవారు వీరిని ఉప దేష్ట యనిరి; ఒప్పని వారు ఉప్పెన,ఉపద్రవము ననిరి.ఎవరేమనినను, వీరిని ఉపజ్ఞాశాలి యనక తీరదు. ఆధునికాంధ్ర కథానిక కొక విధ ముగ జవము జీవమును గల్పించిన మహనీయ కీర్తి వీరిది. వీరి 'హంపీ కన్యలు' 'సినిమా జ్వరం' మున్నగునవి ప్రసిద్ధములు. వీరికి అనుయా యులు పెక్కుమంది.

కీ॥ శే॥ అడవి బాపిరాజు గారు మూర్తుల కవి, గేయ కారులు చిత్రకరులు నవలారచయితలు, కథానికా కర్తలును. ఒక్క మాటలో, వారు సమస్త కళలకు సువర్ణ సమన్వయము. ఆయన వాక్కున కల్పితమైన రూపమును చిత్రమునందును, చిత్రమున కల్పిత మైన భావమును వాక్కునందును విన్యసింపఁగల సహజ శిల్పి కావుననే వారికి కథానికా శిల్పములో నుత్కృష్ట స్థానమందినది. భావాంబర వీథులలో విహరించుచు మధుర గీతములలో తేలియాడుచు, వారు కథానికలు నిర్మించిరి. శబ్దార్థముల హరిదాంపత్యముచే నొడుగులు పోవువారి భావభంగిమలు శివపార్వతుల నాట్యవిలాస రేఖలు. వారి 'తిరుపతి కొండమెట్టు' 'భోగీరబోయ'; 'శైలబాల'; 'హంపీ శిథిలాలు' మున్నగునవి శిల్ప సౌందర్యమునకు పరాకాష్ఠలు. వీరికి కొద్ది యను

చరవర్గమున్నది. అనుకరణ సాధ్యముగానిది వీరి మార్గము అగుటచే పెక్కుమంది వంధిమాగధులు లేరు వీరికి.

శ్రీ విశ్వనాథ వారు కథానికా రచనమునఁ గూడ పరిణత ప్రజ్ఞులు. సంగ్రహత, నిర్భరతాది లక్షణములచే వస్త్వైక్యమును సాధించు నిశిత శిల్ప ధ్యాయిత వీరికి శ్రీరామరక్ష. 'చిన్న కథలు' అను సంపుటి యిటీవలనే వీరు ప్రకటించిరి. 'ఏమి సంబంధము' 'పరిపూర్తి', 'తిరోధానము', 'మాక్లీదుర్గంలో కుక్క', 'చామర గ్రాహిణి' 'జమీందారుని కొడుకు', 'రిసెర్చిస్కాలర్లు' భారతి మున్నగునవి వీరివి మిక్కిలి యాకర్షణీయమైన కథలు.

శ్రీ తల్లావజ్ఝల శివ శంకరశాస్త్రిగారి 'నీలకంఠం కథలు' రసవంతములై బహుళ ప్రచారముఁ గన్నవి. వీరు చక్కని కథానికా విమర్శకులుఁ గూడ.

శ్రీ ముని మాణిక్యము వారి 'కాంతం' తెలుఁగు నాటి కోడ ళ్ళకు ప్రతినిధి. శ్రమాలసమైన నిత్య జీవితములో మాధుర్య మొలి కించు హాస్య రచనము మునిమాణిక్యము వారిది. నవలా నాయకు లలో బారిష్టరు పార్వతీశమే పార్వతీశము, కథానాయికలలో కాం తమే కాంతము. కాంతం కథలలో ప్రాయికముగా వాతావరణము గార్హస్థ్య జీవితము. 'నలసారము సంసార మఖిల దుఃఖావహము, భయ నికేతన' మనిన దానిని ససారమని 'ససారసారనయన' "కాంతం" ఋజువు చేసినది. కథలకు తెలుఁగు నాట సర్వవ్యాపకత్వము కల్గినది. "కాంతం" వలననే కథన సాహిత్య మున్నంత కాలము, కోమల హాస్యమునకు రసస్థితి యున్నంత కాలమును, కాంతమును మఱువలేము.

ఎంత కథకులో అంత విమర్శకులు గూడ శ్రీ కొడవటి గంటి కుటుంబరావుగారు. వీరి దభ్యుదయ దర్శన పథము; వాస్తవిక చిత్ర

ణము; కథావస్తువు మధ్యతరగతి ప్రజల జీవితము కథల సముదాయమునకు, వైవిధ్యమునకు వీరు పెట్టినది పేరు. కథానికల శకమిది. దీనికి వీరు ప్రతినిధి పాత్రల స్వరూప స్వభావములకు సంబంధము సాధించిన కథలు వీరివి పెక్కు కాని అందలిది నగ్నవాస్త వికత. ఇది చదువరులపై క్షణిక ప్రభావమునే గాని శాశ్వత ప్రభావమును ముద్రింపలేదు. కాంతా సమ్మితముగా నుపదేశించుట (delightful instruction) కు అనువు పడదు. 'గల్పిక' యను తెలుఁగు కథానికా భేదమునకు తొలుదొల్త రూప కల్పనముఁ జేసిన పితృపాదులు వీరు.

శ్రీ పాలగుమ్మి పద్మరాజుగారి 'గాలివాన' ప్రపంచ స్పర్ధనమున ద్వితీయ బహుమతి నొంది తెలుఁగు కథానికకు ఖండ ఖండాంతరాలలో నఖండ యశః ప్రతిష్ఠల స్థాపించినది. పల్లీ పట్టణ వాసులలోని సంస్కార రాహిత్యము, వీరి కలమను చికిలిదంతపుటులి సోకిన లింగరూపమునఁ బ్రత్యక్షమగును. ఎదురు చూస్తున్న ముహూర్తము, 'వాసన లేని పూలు, పడవ ప్రయాణము; మొదలైన వీరి ప్రసిద్ధ కథలు పరిమితము లయ్యును అపరిమిత కీర్తి నొందుటకు వీరు ప్రదర్శించు ననల్ప శిల్ప చాతుర్యమే హేతువు. వీరి కథా సంపుటి పేరు కూలి జనము' ఆకర్షణీయమైన కథావస్తువు, సహజ సుందర సన్నివేశ రచనము, ప్రకృతి మధుర సంభాషణములు మొదలగునవి వీరి శిల్పసామగ్రి వీరు కథానికా విమర్శకులు గూడ.

చక్కని పండితులయ్యుఁ గథానికారచనకు కథల గుండెతో గలిసి వచ్చిన వారిలో శ్రీ హనుమ చ్ఛాస్త్రి ఇంద్రకంటి వారొకరు. అచ్చపు కవులుగా విమర్శకులుగా కథానికా కర్తలుగా ప్రఖ్యాతి గన్నవారు వీరు. వీరివి కొన్ని 'స్కెచ్ లనియు, నూహా చిత్రములనియుఁ జెప్ప వచ్చును. కీ॥ శే॥ అడవి బాపిరాజు గారి నప్పుడప్పుడు వీరి శిల్పములో

తొంగి చూడ గల్గుట మనకు గర్వకారణము. కథానికలలో ప్రాత కాలము వారిది నిర్దాంభిక వర్గ మని యొకటి. దానికి వీరి సత్యత్వు లను కొనుడు. 'హనుమచ్ఛాస్త్రి కథలు' అని యొక సంపుటి వీరిది ప్రకటితము.

శ్రీ కరుణ కుమార కథలు గూడ సంపుటములుగా వెలువడి నవి. వీరు సార్థక నాములు. పల్లెజనుల పీడిత జీవనములోని కరుణ రసమున ముంచి, కలమును కుంచెగా కథాపటముపై కదలించు చిత్ర కారులు. తాము వెలిగించిన చిత్ర దీపమునకు చిదిమి చమురు పోయఁగలది వీరి జానపద మనః ప్రవృత్తి నిదానము.

శ్రీరంగం శ్రీనివాసరావు గారాధుని కాంధ్ర సాహిత్య శాఖలన్నిటిలోను నొక మహాప్రళయము వంటివారు. ప్రాచ్య పాశ్చాత్య సంస్కృతుల విచిత్ర సమ్మేళనము వీరిది. ఆ సమ్మేళన వలని నవ్య సృష్టికైన వేదనయే వీరి కథలలోని స్పందన శక్తి. సాంఘిక పునరుద్ధరణచే జాతిని పునరుజ్జీవింపఁ జేసి, విశ్వ సంక్షోభమును జల్లార్చ నెంచు నవ్యప్రభ "శ్రీ శ్రీ" గారు. వీరి "చరమరాత్రి" సుప్రసిద్ధము.

శ్రీ గోపీచందు గారుద్దండ కథానికులు. ఒక్కొక్కప్పుడు ప్రబలమైన సంక్షోభమునే నిమ్నగకు నీరెత్తి నట్లు పాయలుగా ప్రవహింపఁ జేయఁ గలరు. శ్రీ॥ శే॥ అడవి బాపిరాజు గారి యుత్తమ కథలు స్థూలముగా హృదయ సంబంధులగుచో, వీరివి మేధా సంబంధులు. అనఁగా వారు మేధకు, వీరు హృదయమునకు సంబంధించినవి వ్రాయలేరని కాదు మొత్తము మీఁద వారు హృదయము నెంత కదలింపఁగలరో, వీరు బుద్ధి నంత ప్రకాశింపఁ జేయఁ గలరనుట. ఆయన మన జాతికి రమ్యముగ జీవించుట నేర్పినారు; ఈయన నిశిత

ముగ నాలోచించుట నేర్పినారు. వైదేశికమైన భావనా విధానమందు వీరికి శ్రీ బుచ్చిబాబుగారితో పోలిక, ఆలోచనలలో మన జాతిని క్రొత్త పుంతc ద్రొక్కించిరి. చరిత్ర గుణపాఠములను సంఘగతులను, వ్యక్తుల మనోరీతులను వాని వానికి హేతు భూతములైన భిన్నభిన్న వాతావరణములను నవగతము చేసికొని రచనలు సాగించు కథానికా కర్తలు. వీరు ప్రసిద్ధ నవలాకారులు విమర్శకులు, చలన చిత్రనిర్మాతలును. సాంఘిక రాజకీయములలో మూసకట్టినది వీరి మనస్సు. అందుచే వీరి భావములను నాదర్శములను తత్సంబంధ ముగలవి యనవచ్చును. పథ్య వాక్కు, హితోపదేశమును, వీరి రచనలకు జీవంతములు. 'ధర్మవడ్డీ', "భార్యల్లోనే ఉంది", 'తండ్రులూ-కొడుకులు' మున్నగునవి పెక్కు వీరి ప్రసిద్ధ కథలు. ఇవి రెండు సంపుటములుగా వెలువడినవి. సర్వసాధారణమైనది వీరి కథ 'ఒడుదుడుకులు దీనిలో కూడ పతితల హృదయములపై హత్తుకొని పోవు స్వీయతా ముద్ర వేయcగలది వీరి శిల్పము.

అధునాతన కథకులలో విశిష్టత సంపాదించుకొన్న సమర్థులు శ్రీ బుచ్చిబాబుగారు. శ్రీ గోపీచందుగారికి వలెనే వీరికిని నాంగ్లభాషా సంస్కారము చాల బాసటయై నిల్చును. వారు పాశ్చాత్యుల రీతులను జీర్ణించుకొనిరి; వీరిలోనవి జితించినవి. వీరు కథలో నుపయోగించు నుపమానములు వ్యుత్పత్తిని సూచించినచో, చేయు వ్యాఖ్యానములు ప్రతిభను చాటును. శ్రీ॥ శే॥ బాపిరాజుగారివలె వీరు హృదయమును స్పందింపc జేయనుcగలరు; శ్రీ గోపీచందుగారివలె బుద్ధికి ప్రకాస్తిc గల్గింపనుcగలరు. 'నన్నుcగురించి కథ వ్రాయవూ' ?; 'అడవిగాచిన వెన్నెల'; 'మేడమెట్లు';'నిరంతర త్రయం'; 'కుముదం'; మణిదీపాలు; మొదలైనవి వీరివి ప్రతిభా సముద్గారులై చదువరులను త్తేజపఱచి చైతన్య ధామములుగc జేయcగలవు. శిల్పముపై సం

పూర్ణాధికారము సంపాదించుటవలన కథలలో వైవిధ్యమును ప్రసాదింపఁగల మేధావులు వీరు. ఏకాంకిక నవలాది రచనలలోఁగూడ వీరు సంకుతేఱిన చేయి.

నేఁటి యువకులలో మఱియు యువకులైనను, చేయితిరిగిన శిల్పు లున్నారు కొందఱు. వీరిలో శ్రీ శండిల[వరపు, బుద్ధవరపు, వేంకట రత్నము] గారు చక్కని విమర్శకులు, కథానికులును. సన్నివేశ శిల్పచ్ఛాయలలో భావసంఘర్షణ చిత్రణములలో వీరు సిద్ధహస్తులు. మెలపుఁగొన్న తలఁపులు పలుకులై ప్రవహింపఁగా వీరి కృషిలో చవిటి నేలగూడ శిల్పసస్యశోభితమగును. వీరి తరువాత శ్రీ మధురాంతకంరాజారాంగారు ప్రసిద్ధులు. వీరి 'వక్రగతులు', 'కుంపటిలో కుసుమం' మొదలగునవి ప్రశస్తములు. శ్రీ కుటుంబరావుగారు, శ్రీ పూ. భా. గారునువలె వీరు 'గల్పిక' లలోను నిపుణులు. శ్రీ బలివాడ కాంతారావుగారు కథానికాకర్తలుగా గూడ బహులబ్ధప్రతిష్ఠులు. శ్రీ ముళ్ళపూడి వేంకట రమణగారి హాస్యరసముచే పకపక నవ్వి యారోగ్యవంతులు గాని వారుండరు. వీరు చాలముందుకు రావలసిన వారు.

శతాధికులగు కథానికా రచయితలలో కొందఱి ప్రతినిధులను మాత్రమే పేర్కొనఁగల్గుదునని ముందే మనవిచేసితిని. వారి వారి యనుయాయివర్గమును చెప్పగిప్పరాదు. చెప్పుచో శ్రీయుతులు భరద్వాజ, ధనికొండ పినిసెట్టి మొదలగు ప్రసిద్ధులు సమర్థులు నగు వారికి శ్రీ చలంగారు గురుపీఠ మనవలెను.

శ్రీ వేలూరి, శ్రీ చలం, కీ. శే. బాపిరాజు, శ్రీ విశ్వనాథ, శ్రీ ఇంద్రగంటి, శ్రీయుతులు పాలగుమ్మి, గోపీచందు, బుచ్చిబాబు మున్నగువారి రచనలు వేర్వేరాశయములు గలిగి, వేనికవియే ప్రత్యేకములైనను, నవి యొక విధమగు సమానధర్మము గూడఁగలవి. కేవల ము బుసుపోకకై చదువునట్టి సాధారణుల కొఱకుగా. వివి. ఇంచుక కళాత్మకమైన హృదయమున్న వారి కివి యమృతపు గుళికలు; లేనివారి

కడవి మల్లెలు. ఇదియే వీరినందఱ నొకసూత్రమున బంధించు సమాన ధర్మము.

చాల విశిష్టులు నుత్తమ రచయితలు గదా యని వ్యక్తిగతముగ కొందఱఁ బేర్కొనుచు నైన పోవలయునన్నచో నది యొక దండక మగును. అయినను వారి సాహిత్యోపాసన వలని సత్ఫల మందుచున్న మనజాతికి కృతఘ్నతాదోష మంటరాదు. సాముదాయికముగఁ జెప్పవలసి చెప్పుచున్నాను గాని వీరిలో నొక్కొక్కరొక్కొక్క మెఱుపునకు నొక్కొక్క ఒదుగునకును పట్టభద్రులు.

సర్వశ్రీ బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, మల్లాది, జలరుక్, అమరేంద్ర, హితశ్రీ, శ్రీ వాత్సవ, మురయూ, పోతుకూచి, చాగంటి, భాస్కరభట్ల, పొట్లపల్లి, ఇసుకపల్లి సోదరులు, వట్టికోట ప్రభృతులు, కథానికా క్షేత్రమునఁ బసిడిపంటలు పండింపఁ గృషిఁజేయఁగల వారు, పెక్కుమంది.

ఇఁక కథానికారచనలో శ్రీమతుల సంఖ్యయును, గుణనీయము; గుణము గణనీయము. శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారి "బలీయసీ కేవల మీశ్వరాజ్ఞ" చదివి యంతర్ముఖులు గాని వారుండరు. ఇఁక శ్రీమతి మాలతీచందూరుగారు మాలతీచందూరు గారే! 'మేటనీ షో' ప్రతిష్ఠగల శ్రీ నాగేశ్వరరావుగారిని క్రిందుబరచిన పడతి. చి॥ వసుంధరకును "అచల"కును గల పరస్పర సంబంధ మెట్లుమఱువ గలము? శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారిగారు పేరు మాత్రమునకే కుమారి; శిల్పములో శ్రీమతియే. శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి గారి యిటీవలి మారిపోయిన మనిషినిఁ జూచిన నబ్బురము కాదా? శ్రీమతి అద్దేపల్లి వివేకానందాదేవిగారి 'వెలుగు నీడల'లో నుండి చూడఁగా 'అగ్నిగుండాలు' అగపడుచున్నవి; సాగిన ప్రస్తారములో 'భిన్నస్వరాలు'ను వినఁబడు చున్నవి. శ్రీమతులు నందగిరి ఇందిరా దేవి, నేమాని భారతీ రత్నాకరాంబ; శ్రీదేవి; జానకీరాణి; వీరందఱును కథానికా లక్ష్మికి పెళ్లిపందిళ్లలో మంగళములు పలికి విందు చేయఁగల శయ్యా పాకములలో పారంగతలు. [సశేషము]

# ఆ ముఖము

సంస్కృతవ్యాకరణమువలె సమగ్రము నిర్దుష్టము సులభము నగు వ్యాకరణము వేఱొకభాషకు లేదు. దానిలోని సంగ్రహవైశద్యములు అనితరసాధారణములు. అట్టి మహోత్కృష్టమయిన వ్యాకరణమునకు బీజావాపమును జేసిన మహాముని పాణిని. పాణిని తన కాలమునకున్న వైదికలౌకికభాషలలోని పదముల ననుశాసించుచు, సంగ్రహముగ సూత్రప్రాయమయిన వ్యాకరణమును రచించెను. ఆ సూత్రములు ఎనిమిది అధ్యాయములుగ నుండుటచే దానిని "అష్టాధ్యాయి" అని వ్యవహరించుచున్నారు. అందు మొదట పరమేశ్వరు నుండి లభించినవిగా నిబంధించిన 14 సూత్రములలో నిబద్ధమైనది అక్షరసమామ్నాయము. దానిచే సాధించిన ప్రత్యాహారముల సంగ్రహాశక్తిని గాంచినవారు ముగ్ధులై యాతనియలౌకికశక్తికి జోహారులర్పించుచుందురు. మన యాంధ్రభాషకు "అచ్చు""హల్లు" అనుపదము లా మహామహిముని ప్రత్యాహారనిర్మాణదక్షతచే సిద్ధించిన ప్రసాదములే. ఇట్లు 'సూత్రములు'గ పాణిని వ్యాకరణమును నిర్మించిన తరువాత కొంతకాలమునకు "కాత్యాయనుఁడు" అను మఱియొక యాచార్యుఁడు పాణిని సూత్రములపై 'వార్తికములు' రచించెను.

మఱికొంతకాలమయినపిదప 'పతంజలి' యను శేషాంశసంభూతుఁడగు నాచార్యుఁడు పాణిని విరచితమగు 'అషాధ్యాయి'కి వివరణమును 'మహాభాష్య'మను పేర రచించెను. ఈ మువ్వురు ఆచార్యులు 'మునిత్రయము' అను పేర వ్యవహరింపఁబడుదురు. వీరు సంస్కృత వ్యాకరణ ప్రపంచమున త్రిమూర్తులు.

పాతంజలమగు మహాభాష్యమున ముందు ఉపోద్ఘాతమున, వ్యాకరణ మన నేమి? దాని ప్రయోజన మేమి? దాని నెట్లు రచింపవలెను? మొదలగు ప్రశ్నములకు సమాధానములను వివరించెను. దానిని 'పస్పశాహ్నికము' అందురు. దానినాంధ్రమున వ్రాయుట

కుపక్రమించుట సాహసమే యని తెలిసియు సాధారణముగా నన్ని వ్యాకరణములకు నుపయోగించు విషయము గావున, అనూదితమైన నందఱకును సేవచేసిన ట్లగునని తెనిఁగించితిని. అనువాదముచేసి పరిభాషోద్యోతములలోని విషయములను నా తోఁచినంతవఱకు వివరణమున నొసంగితిని. నాయీ సాహసమును మన్నించి పండితులు దోషములను సరిచేసికొని యానందింతురుగాక యని యభ్యర్థించుచున్నాను.

ఇట్లు,

అనువాదకుఁడు.

# పాతఞ్జలమహాభాష్యము—పస్పశాహ్నికము

అనువాదకర్త:శ్రీభాష్యం అప్పలాచార్య.

## అనుశాసనీయ శబ్దనిర్ణయము

మూలము. అథ శబ్దానుశాసనమ్.

"అథ" అనుశబ్దము ఆరంభము అనునర్థము గలది. ఇటనుండి శబ్దానుశాసన మనుశాస్త్రము ఆరంభ మగునని తెలియఁదగును.

వివరణము-అనుశిష్యంతే అసాధుశబ్దేభ్యః వివిచ్య జ్ఞాప్యంతే అనేన ఇతి అనుశాసనమ్. శబ్దానాం అనుశాసనం. శబ్దానుశాసనం. శబ్దములను వివేచించి తెలియఁబఱచునది శబ్దానుశాసనము. [సాధు శబ్దములను అసాధు శబ్దములనుండి వేఱుచేసి చూపునది]

మూ. కేషాం శబ్దానామ్ ?

శబ్దములను అనుశాసించును అని సామాన్యముగా చెప్పిరిగదా ! ఆయనుశాసనము ఏ శబ్దములకు ?

వి. లోకవ్యవహారములో నుండు శబ్దములకా ? వేదములలోని శబ్దములకా ? శబ్ద మనుమాటచే సాధారణమగు ధ్వని, అపశబ్దములు కూడ వ్యవహరింపఁబడుచుండుటచే నీ వ్యాకరణము వేని నను శాసించునో, తెలియుట కీప్రశ్నము.

మూ. లౌకికానాం వైదికానాంచ । తత్ర లౌకికా స్తావత్ ।

గౌ రశ్వః పురుషో హస్తీ శకుని ర్మృగో బ్రాహ్మణ ఇతి.

వైదికాః ఖల్వపి । శంనో దేవీరభిష్టయే । ఇషేత్వో

ర్జేత్వా।అగ్నిమీళే పురోహితమ్।అగ్న ఆయాహివీతయే ఇతి

లౌకికములు వైదికములు నగు శబ్దముల కనుశాసనము. లౌకిక శబ్దములు:—గోవు, పురుషుఁడు, హస్తి, మృగము, బ్రాహ్మణుఁడు మొదలగునవి. వైదికశబ్దములు:—'శంనో దేవీ రభిష్టయే' 'ఇషేత్వోర్జేత్వా' 'అగ్నిమీళే పురోహితం' 'అగ్న ఆయాహి వీతయే' మొదలగునవి.

మూ. అథగౌ రిత్యత్ర కః శబ్దః ?

'గోవు' అనునపుడు శబ్ద మననేది ?

వి. ఎదుటుగా నున్న ఒకగోవును జూచి దాని నేమని వ్యవహరింతురో తెలియఁగోరి "అయం కః" ? ఇదియేమి ? అని ప్రశ్నించిన "అయంగౌః" ఇదిగోవు అని సమాధానము నిత్తురు. ఇచట అడిగిన వాని అభిప్రాయము, ఆవ్యక్తిని తెలియఁజేయు శబ్ద మేది? యని కాని సమాధానములో 'ఇదిగోవు' అని శబ్దమును అర్థమును అభిన్నముగా చెప్పిరి. 'ఇది' అనఁగా ఎదురుగా నున్న గోవ్యక్తి. "గోవు" అనఁగా ఆవ్యక్తిని తెలియఁజేయు శబ్దము. ఈ రెంటికిని అభేదము ఎట్లు పొసఁగును. శబ్దార్థముల నభిన్నముగా వాడుట కొన్ని తావులందు లోకమందు ప్రసిద్ధముగా నున్నది. కావున నందులో శబ్ద మననేది ! అంతియే కాదు. 'గోవు' అను శబ్దమును వినినంతనే అక్షరసమూహరూపమగు శబ్దమును, 'గోవు' అను ఒకవ్యక్తియు, అట్టి గోవులన్నింటియం దుండుజాతియు (గోత్వము) మనకు భాసించును. వానిలో "శబ్దము" అని వ్యవహరింపఁబడున దేది ?

మూ. కిం యత్తత్సాస్నాలాంగూలకకుదఖురవిషాణ్యర్థరూపం స శబ్దః ?

గంగడోలు, తోఁక, మూపురము (రెంటము) డెక్కలు కొమ్ములు మున్నగు నవయవములతోఁ గూడిన పదార్థమా శబ్దము ?

మూ. నేత్యాహ. ద్రవ్యం నామ తత్.

కాదు అది ద్రవ్యము.

వి. శబ్దము శ్రోత్రేంద్రియముచే గ్రహింపఁబడు ననునది ప్రసిద్ధము. వెనుకఁజెప్పిన పదార్థము చక్షురింద్రియముచే గ్రహింపఁబడుచున్నది. కావున నది శబ్దము కాదు.

మూ. యత్తర్హి తదింగితం చేష్టితం నిమిషిత మితి స శబ్దః ?

లయైన గోవు తనయభిప్రాయమును సూచించుటకుఁ జేయు తలయూఁపుట(ఇంగితము)తోఁక ఆడించుట (చేష్టితము) తెప్పలార్చుట మొదలగు వ్యాపారమా శబ్దము?

వి. ద్రవ్యము, ఎట్లు శ్రోత్రేంద్రియగ్రాహ్యము కాదో అటులనే పై క్రియలును శ్రోత్రేంద్రియగ్రాహ్యములు కావు. కనుక నివియును శబ్దములు కావని తెలియుచున్నను వివరించి చెప్పుట భాష్యకృత్తి యగుటచే ఆశంకించి నివారించుచున్నాఁడు.

మూ. నేత్యాహ । క్రియానామ సా.

కాదు. అది క్రియ యనఁబడును.

మూ. యత్తర్హి తచ్ఛుక్లో నీలః కపిలః కపోత ఇతి సశబ్దః ?

తెలుపు, నలుపు, దోర, పుల్ల మొదలగునవియా శబ్దము ?

మూ. నేత్యాహ । గుణో నామ సః.

కాదు. అది గుణము.

మూ. యత్తర్హి తద్భిన్నే ష్వభిన్నం ఛిన్నే ష్వచ్ఛిన్నం సామాన్యభూతం స శబ్దః ?

తానాశ్రయించియున్న వస్తువులు వేఱువేఱుగా నున్నను తాను వేఱుగాక ఏకముగా నుండునదియు, తానుండు వస్తువులు నశించినను తాను నశింపనిదియు నగు సామాన్యమా (జాతి) శబ్దము ?

మూ. నేత్యాహ । ఆకృతి ర్నామ సా.

కాదు అది ఆకృతి (జాతి) యనఁబడును.

వి. ఆకృతి యనఁగా ఒక తెగకు చెందిన వస్తువులన్నింటియందు నుండు సమానధర్మము. గోవులన్నింటియందు నుండు సమానధర్మము గోవులన్నింటియందు నుండు జాతి గోత్వము. అట్టి సమానధర్మమొకటి కలదని మనకు స్ఫురింపఁజేయు ఆకారవిశేషము (తోఁక లుకొమ్ములు మొ. వానితోఁగూడిన సంస్థానము) కూడ ఆకృతి యనఁబడును.

ఆక్రియతే వ్యవచ్ఛిద్యతే స్వాశ్రయః అనయా ఇతి ఆకృతిః।. ఒక వస్తువును తదితరముల నుండి వేఱు చేసి చూపునది ఆకృతి. ఇట్లు వేఱు చేయునది జాతియుఁ గావచ్చును. వస్తువు యొక్క ఆకారమును (సంస్థానము) గావచ్చును. కావున ఈ రెండును శబ్దములు కావని భాష్యకారుఁడు "ఆకృతి-శబ్దము కాదని" తేల్చెను.

మూ. కస్తర్హి శబ్దః ?

అటులైన శబ్దమననేమి ?

మూ. యేనోచ్చారితేన సాస్నా లాంగూల కకుద ఖుర విషాణినాం సంప్రత్యయో భవతి సశబ్దః.

దేని నుచ్చరింపఁగనే గంగడోలు, తోఁక మూపు డెక్కలు కొమ్ములు గల గోవులు మన బుద్ధికి గోచరించునో అది శబ్దము.

వి. వైయాకరణులు వర్ణములకుఁ గాని వర్ణసముదాయము నకుఁ గాని వాచకత్వము (అర్థబోధకత్వము) నంగీకరింపరు.

వర్ణములకంటె భిన్నమగు పదము గాని వాక్యము గాని వాచకము (అర్థమును తెలియఁజేయునది) అని యంగీకరింతురు.

వర్ణములకంటె వేఱుగ పదము, లేదా వాక్యము కలదని యంగీకరింపక వర్ణములే అర్థము నీయఁజాలునవనియు, వర్ణముల సముదాయమే పదము వాక్యము అని పిలువఁబడుచున్నది యనియు కొందఱి యభిప్రాయము.

కాని ఈ పద్ధతి అంతగా సరిపడదు. "వర్ణము అర్థబోధకము" అనిననాఁడు "గోవు" అను చోట విడి విడిగా రెండక్షరములును అర్థబోధకము లా? లేక రెండును కలిసి అర్థమును తెలియఁజేయునా ? విడి విడిగా వర్ణము అర్థమును తెలియఁజేయును, అన్నచో "గో" అను నక్షరమే అర్థమును తెలియఁజేయును గావున "వు" అను రెండవ

అక్షరము నుచ్చరించుటయనావశ్యకమగును. "రెండును కలిసిన సముదాయము అర్థమును ఎఱింగించును" అనిననాఁడుకూడ మొదటి వర్ణము నుచ్చరించి రెండవయక్షరము నుచ్చరించువేళకు మొదటి యక్షరము నశించును, కావున సముదాయ ముండనేయుండదుకదా! ఇఁక నది యెట్లు అర్థమును బోధించును? లేదా మొదటి అక్షర ముచ్చరింపఁగనే మన మనమున ఒకఅక్షరము అభివ్యక్తమగును అనఁగా స్ఫురించును. అట్లు అభివ్యక్తములైన అక్షరముల సముదాయము అర్థమును బోధించును అని యనవచ్చును. కాని అచటఁ గూడ మొదట స్ఫురించిన వర్ణము రెండవవర్ణము స్ఫురించుసరికి నాశము నొందును. కావున నచటను సముదాయ ముండదు. 'గోవు' అనుమాట లోని రెండక్షరములను నుచ్చరించినపిదప ఆయనుభవమువలన కలిగిన సంస్కారముచే స్మృతికిఁ దెచ్చుకొనఁగా నాస్మృతిలో గోచరించిన వర్ణసముదాయము అర్థమును తెలియఁజేయును, అనిననాఁడు గూడ ఆస్మృతిలో వర్ణము లాయుచ్చరించిన వరుసలోనేయుండు ననునియమము లేకపోవుటచే "సరః" 'రసః' అనుపదముల యర్థములు తారుమాఱుగుటకుఁగూడ నవకాశము కలదు.

అందుచే వర్ణములు లేదా వర్ణముల సముదాయము అర్థబోధకము అనువాదము సరికాదు. వర్ణవ్యతిరిక్తమగు పదము లేదా వాక్యమే వాచక మని యంగీకరింపవలెను. అంతేకాదు. మఱియొక సంగతినిగూడ గుర్తింపవలెను. మనము ఉచ్చరించిన వర్ణసముదాయము మనకు అర్థజ్ఞానమును గలిగింపదు. ఆయుచ్చరించినవర్ణములచే 'స్ఫోట' మనఁబడు ఒక బుద్ధిగోచరమగు శబ్దము అభివ్యక్తమగును. అది మనమనస్సుచే గ్రహింపఁబడును. కాని వ్యావహారికశబ్దమువలె శ్రోత్రేంద్రియముచే గ్రహింపఁబడదు. అట్టిశబ్దమును అభివ్యక్తము చేయునది నాదము. నాదముచే అభివ్యక్తముచేయఁబడి మనస్సుచే

గ్రహింపఁబడు పదరూపము లేదా వాక్యరూపము నగుశబ్దమే స్ఫోట మనఁబడును. అదియే నిత్యము సత్యమునగు శబ్దము. మన ముచ్చరించుచున్న వినుచున్నశబ్దములు దానిని వ్యక్తముచేయునవియే కాని సత్యములుకావు. స్ఫోటమనఁగా అర్థమును స్ఫుటముచేయునది. ఈ 'స్ఫోట' శబ్దము వాక్యరూపముననే యుండు ననునది పరమసిద్ధాంతము కాని పదరూపమున వర్ణరూపమునఁగూడ నుండవచ్చునని కొందఱి మతము. ఇది సిద్ధాంతమైనను అట్లు సత్యమగు శబ్దమును మనముఉచ్చరించుటయు వినుటయు పొసఁగవు. కనుక దానికి అనుశాసన మెట్లు చేయ వీలగును. కావున సత్యమగుశబ్దము స్ఫోటమేయైనను ఆస్ఫోటమును వ్యక్తముచేయునదియు మనచే నుచ్చరింపఁబడి వినఁబడుచుండునదియు నగుశబ్దమునే ఇచట, అనఁగా నీలోకవ్యవహారమునను, శాస్త్రమునను గ్రహింపవలెను. అందులకే భాష్యకారుఁడింతవఱకు సిద్ధాంతమును జెప్పి లోకమునను, శాస్త్రమునను దేనిని శబ్దముగా గ్రహింపవలెనో యిఁకవివరింపఁ జెప్పుచున్నాఁడు.

మూ. అథవా-ప్రతీతపదార్థకో లోకే ధ్వనిః శబ్ద
ఇత్యుచ్యతే । తద్యథా । శబ్దం కురు, మా శబ్దం
కార్షీః, శబ్దకార్యయం మాణవకః, ఇతి ధ్వనిం
కుర్వన్నేవ ముచ్యతే । తస్మాద్ ధ్వనిః శబ్దః.

లోకమున నర్థప్రతీతిని గలిగించుధ్వని శబ్దముగా వ్యవహరింపఁబడుచున్నది. లోకములో మాటలాడుచు ధ్వనిచేయుచున్నపుడు- "శబ్దము చేయుము, "శబ్దము చేయకుము" ఈ మాణవకుఁడు శబ్దముఁజేయువాఁడు" అను వ్యవహారము కలదు. "ధ్వని" అనునర్థమున 'శబ్దము' అనుమాటను వాడుచున్నాము. కావున శబ్దము అనఁగా ధ్వని యని తెలియఁగవలెను.

వి. ధ్వని: శ్రోత్రేంద్రియముచే గ్రహింపఁబడుచున్న అర్థజ్ఞానమును కలిగించుటకై యుచ్చరింపఁబడిన గోవు మొదలగువర్ణరూపములగు శబ్దములను ధ్వని యందురు. స్ఫోటము: మనము వినుచున్న శబ్దము అర్థజ్ఞానమును గల్గింపదు ఈశబ్దముచే అభివ్యక్తమై బుద్ధిలో భాసించు వేఱొకశబ్దమే అర్థజ్ఞానమునిచ్చును. అట్లు బుద్ధిలో భాసించు శబ్దమును "స్ఫోటము" అందురు "శబ్దము" అనుమాట మనకు వినఁబడుచున్న ధ్వనిరూపమగు పదవాక్యములకును, బుద్ధిలో భాసించు నిత్యములగు 'స్ఫోట' మనఁబడు శబ్దములకును వాడుట కలదు. 'గోవు' అనునపుడు మనచెవులకు వినఁబడు ధ్వనిని శబ్దమనుకొనవలెనా? దానిచే మనసులో స్ఫురించు శబ్దమును "శబ్దము" అనుకొనవలెనా? అనుసందేహమును భాష్యకారుఁడు తొలగించుచుసత్యముగా 'స్ఫోట'మే యైనను వ్యవహారానుగుణముగ ఈశబ్దానుశాసనమున "ధ్వని"నిగూడ శబ్దముగా గ్రహింపవలెనని నిరూపించెను.

శబ్దానుశాసన ప్రయోజనాధికరణము.

మూ. కాని పునః శబ్దానుశాసనస్య ప్రయోజనాని?
శబ్దానుశాసనమునకు ప్రయోజనము లెవ్వి?

వి. వ్యాకరణాధ్యయనము సంధ్యావందనాదులవలె ప్రత్యవాయమును దొలఁగించుటకా? లేక వేఱొకప్రయోజన మేదయినను గలదా? వ్యాకరణాధ్యయనము నిత్యమా? కామ్యమా? అని సందేహము.

మూ. రక్షోహాగమలఘ్వసందేహాః ప్రయోజనమ్।
రక్ష, ఊహ, ఆగమము, లాఘవము, అసందేహము అనునివి వ్యాకరణాధ్యయనమునకు ప్రయోజనములు.

మూ. రక్షార్థం వేదానా మధ్యేయం వ్యాకరణమ్. లోపాగమ
వర్ణవికారజ్ఞో హి సమ్యగ్వేదా న్పరిపాలయిష్యతీతి.
వేదముల స్వరూపము చెడకుండ రక్షించుటకు వ్యాకరణమును నేర్వ

వలెను. వర్ణలోప,వర్ణాగమ, వర్ణవికారముల నెఱింగినవాఁడే వేద మును గాపాడఁగలఁడు.

వి. లోకములో మనము వ్యవహరించుశబ్దములకంటె వైదికశబ్ద ములు భిన్నములుగానుండును. అట్లుండుటకు కారణము తెలియని వారు పొరబడి వానిని తప్పులుగా తలంచి మార్పవచ్చును. లోకము లోని 'అదుహత' అనురూపమునకు బదులు వేదములో 'అదుహ్ర' అనురూప ముండును. అదుహత అనుదానిలోని తకారము లోపించి, శేషము చేరినది. అట్లే లోకములోని 'ఉద్గ్రాభం-నిగ్రాభం' అను రూపములు వేదమున 'ఉద్గ్రాభం-నిగ్రాభం' అని యుండును. ఇచట హకారము భకారముగా మాఱినది. దీని నెఱుఁగనివారు ఇది పొర పాటని భ్రమించి వేదస్వరూపమునే మార్తురు. కావున వ్యాకరణము నెఱిఁగియుండవలెను.

మూ. ఊహః ఖల్వపి:-న సర్వై ర్లింగై ర్నచ సర్వాభి ర్విభ క్తిభి ర్వేదే మన్త్రా నిగదితాః। తే చావశ్యం యజ్ఞగతేన పురుషేణ యథాయథం విపరిణమయితవ్యాః। తా న్నావైయాకరణః శక్నోతి యథాయథం విపరిణమయితుమ్।తస్మా దధ్యేయం వ్యాకరణమ్.

ఊహచేయుటకు వ్యాకరణము నెఱిఁగియుండవలెను. వేదములో మం త్రములు క్రియలలో నుపయోగించుట కర్హములుగ అన్నిలింగముల లోను అన్నివిభక్తులతోను చెప్పఁబడియుండవు. యాజ్ఞికుఁడు యజ్ఞ గతములగు క్రియల ననుసరించి యామంత్రములను ఆయాలింగముల తోను ఆయావిభక్తులతోను ఉచ్చరింపవలెను. అట్లు విభక్తులను లిం గములను మార్చుట వ్యాకరణము నేర్వనివాఁడు చేయలేఁడు. కావున అట్టియూహ శక్తి కలుగుటకు వ్యాకరణమును నేర్వవలెను.

వి. వేదములోఁ జెప్పినయాగములలో కొన్ని ప్రకృతియాగ ములనియు, కొన్ని వికృతియాగములనియు వ్యవహరింపఁబడును-

ప్రకృతియాగవిధానమునే వికృతియాగమునందు ననుసరింపవలెనని మీమాంసకులు చెప్పుదురు. ప్రకృతియాగములో చెప్పినమంత్రము లనే వికృతియాగమునందును ఉపయోగింపవలసి వచ్చుచుండును. అట్టిచో కొన్నిమంత్రముల లింగములను విభక్తులను మార్చుచుండ వలెను. ఉదా : అగ్ని నుద్దేశించి చరుహోమము చేయునపుడు "అగ్నయే త్వా జుష్టం నిర్వపామి" అని చరువవలెను. అని చెప్పి బ్రహ్మవర్చసకాముఁడు సూర్య దేవతోద్దేశ్యకముగ చరుహోమము చేయవలెనని చెప్పెను. ఏమంత్రముచే హోమము చేయవలెనో వేఱుగా చెప్పలేదు. అందుచే యాజ్ఞికుఁడు"అగ్నయేత్వాజుష్టం నిర్వపామి" అనుదానిని చూచి "సూర్యాయ త్వా జుష్టం నిర్వపామి" అనుమంత్రము నూహించి చరుహోమమును చేయవలెను. ఇట్లూహించుటకు వ్యాకరణము తెలిసియుండవలెను.

ఇట్లు శబ్దములను మార్చుటయేగాక కొన్ని మంత్రములందు లింగమును, విభక్తినిగూడ మార్చవలసియుండును. నీటిని అభిమంత్రించునపుడు "దేవీ రాపః శుద్ధాస్థ" అనుమంత్రము నుపయోగింతురు. ఘృతము నభిమంత్రించునపుడుకూడ ఆమంత్రమునే మార్చి యుపయోగింపవలెను. "దేవ ఆజ్య శుద్ధోఽసి" స్త్రీలింగశబ్దములను పుంలింగములుగ మార్చి, ఏకవచనమున నుంచి, క్రియలోని బహు వచనమున కేకవచనమును ప్రయోగింపవలెను. ఇట్లూహించి లింగ వచన విపరిణామము చేయుటకు వ్యాకరణము నధ్యయనముచేయ వలెను.

మూ. ఆగమః ఖల్వపి:-"బ్రాహ్మణేన నిష్కారణో
ధర్మః షడంగో వేదోఽధ్యేయో జ్ఞేయశ్చ" ఇతి।
ప్రధానంచ షట్స్వంగేషు వ్యాకరణమ్।ప్రధానేచ
కృతో యత్నః ఫలవాన్ భవతి.

ఆగమ ప్రామాణ్యాము ననుసరించియు వ్యాకరణము తప్పక అధ్యయనము చేయవలెను. "బ్రాహ్మణుడు దృష్టప్రయోజనము నపేక్షింపకయే తనధర్మముగా షడంగసహితమగు వేదమును నేర్వవలెను" అని ఆగమము (శాస్త్రము) చెప్పుచున్నది. వేదాంగము లాఱిటిలో ప్రధానమైనది వ్యాకరణము. ప్రధానమైన అంగమును అభ్యసించిన మిగిలిన అంగములనెల్ల సాధించినట్లే. కనుక ముఖ్యముగా వ్యాకరణమును జదువవలెను.

వి. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము అనునవి వేదార్థజ్ఞానమున సహకరించునవి. కనుక వేదమునకు అంగములు. వేదార్థజ్ఞానమున మిగిలినవానికంటె వ్యాకరణము ఎక్కువగా సాహాయ్యము చేయును. కావున నిది ప్రధానము- ముఖ్యస్థానీయము.

మూ. లఘ్వర్థం చాధ్యేయం వ్యాకరణమ్-"బ్రాహ్మణే నావశ్యం శబ్దా జ్ఞేయాః" ఇతి। నచాన్తరేణ వ్యాకరణం లఘునోపాయేన శబ్దాః శక్యా జ్ఞాతుమ్।

సులువుగా శబ్దముల నెఱుంగుటకు వ్యాకరణాధ్యయన మావశ్యకము. బ్రాహ్మణుడు శబ్దములను తప్పక యెఱింగియుండవలెను. తక్కువ ప్రయత్నముతో శబ్దజ్ఞానమును సాధించుటకు వ్యాకరణముకంటె సులభమైన యుపాయము వేఱొకటి లేదు.

వి. అధ్యాపనము బ్రాహ్మణుని వృత్తి. ఆవృత్తిని చక్కగా సాగించుకొనుటకు శబ్దజ్ఞానము ఆవశ్యకము. "ఈపదము సాధువు. ఈ పదము సాధువు" అని ప్రతిపదము నేర్చుకొనుటకంటె ప్రకృతిప్రత్యయముల నెఱింగించు వ్యాకరణముచే "శబ్దము లివి" యని తెలిసికొనుట సులభము.

మూ. అసందేహార్థం చాధ్యేయం వ్యాకరణమ్। యాజ్ఞికాః
పఠంతి, స్థూలపృషతీ మాగ్నివారుణీ మనడ్వాహీమాలభేత ఇతి
తస్యాం సందేహః-స్థూలా చాసౌ పృషతీచ స్థూలపృషతీ,
స్థూలాని పృషంతి యస్యాః సేయం స్థూలపృష తీతి। తాం
నావైయాకరణః స్వరతోఽధ్యవస్యతి
యది పూర్వపద ప్రకృతి స్వరత్వం తతో బహువ్రీహిః
అథ సమాసాంతోదాత్తత్వం తత స్తత్పురుష ఇతి।

సందేహము కలుగకుండుటకు వ్యాకరణమును చదువవలెను. "స్థూలపృషతీ మాగ్నివారుణీ మనడ్వాహీ మాలభేత" అగ్ని వరుణ దేవతోద్దేశ్యకముగ స్థూలపృషతియగు గోవును విశసనముచేయ వలెను" అనుచోట "స్థూలపృషతీం" అను సమాసమునకు "స్థూలా చాసౌ పృషతీచ" అనియా? లేక "స్థూలాని పృషంతి యస్యాస్సా" అనియా విగ్రహవాక్యము? అని సంశయము కల్గు నవకాశమున్నది. వైయాకరణుఁడు కానివాఁడు స్వరముచే నది యేసమాసమో? నిశ్చయించుకొనలేఁడు. ఆద్యుదాత్తమైన బహువ్రీహిసమాసము. అంతోదాత్తమైన తత్పురుషము అని వైయాకరణుఁడు తెలిసికొనఁ గలఁడు.

వి. స్థూలపృషతి యగు గోవు నుపయోగింపవలె ననుచోట రెండువిధములుగా అర్థము రావచ్చును. పెద్దమచ్చలు గలగోవు (స్థూలాని పృషంతి యస్యాః సా) మచ్చలు గలపెద్దగోవు (స్థూలా చాసౌ పృషతీచ) అను రెండర్థములును వచ్చును. మొదటిది బహువ్రీహి సమాసము రెండవది కర్మధారయ సమాసము. మంత్రద్రష్ట యభీష్టము నెఱింగి ఎట్లు అతఁ డుద్దేశించెనో అట్టిగోవు నుపయోగించిన నాఁడే సరియగుఫలము లభించును. సంప్రదాయసిద్ధముగ వేదము సస్వరముగ పలుకఁబడును. కావున వైయాకరణుఁడు స్వరమునుబట్టి అర్థనిర్ణయమును చేసికొనఁగలఁడు. స్థూలపృషతియను పదమున

మొదటి యచ్చు నుదాత్తముగాఁ బల్కిన బహువ్రీహి యనియు, చివరియచ్చు నుదాత్తముగాఁ బల్కిన కర్మధారయ మనియు నతఁడు నిర్ణయించును. యాజ్ఞికునకు అట్టిశక్తి యావశ్యకము. అందుచే సందేహము కల్గకుండుటకు వ్యాకరణ మావశ్యకము.

మూ. ఇమాని చ భూయః శబ్దానుశాసనస్య ప్రయోజనాని
తేఽసురాః।దుష్టః శబ్దః।య దధీతమ్। యస్తు ప్రయుఙ్క్తే। అవిద్వాంసః। విభక్తిం కుర్వంతి। యో వా ఇమామ్।చత్వారి। ఉతత్వః।సక్తుమివ।సారస్వతీమ్। దశమ్యాం పుత్రస్య।సు దేవో అసి వరుణ। ఇతి.

శబ్దానుశాసనమునకు క్రింద చెప్పఁబోవు మఱికొన్ని ప్రయోజనములు కూడఁ గలవు. తేసురాః మొదలగు వానిచే వివరింపఁబడు నాప్రయోజనములు పదుమూఁడు.

మూ. తేఽసురాః— తేఽసురా హేలయో హేలయ ఇతి
కుర్వన్తః పరాబభూవుః। తస్మా ద్బ్రాహ్మణేన న మ్లేచ్ఛితవై
నాపభాషితవై. మ్లేచ్ఛో హ వా ఏష యదపశబ్దః।
మ్లేచ్ఛా మాభూమే త్యధ్యేయం వ్యాకరణమ్.

పూర్వము అసురులు "హేఅరయః" అనుటకుమాఱుగా హేలయః హేలయః" అని ప్రయోగించుటచే పరాభూతులైరి. అపశబ్దము పరాభవహేతువై నింద్యమగును. కావున నింద్యులమై పరాభూతులము కాకుండుటకు వ్యాకరణమును నేర్వవలెను.

వి. హే అరయః-అనుచోట 'హే' అనుదానిని ప్లుతముగా నుచ్చరింపవలెను సంధి చేయక వేఱుగా నుచ్చరింపవలెను. రేఫకు లకారమును వాడరాదు. 'అరయః' అనుపదమునే రెండుసార్లు ఉచ్చరింపవలెను. కాని వాక్యమునంతను రెండుసార్లుచ్చరింపరాదు. ఈ నియమములను పాటింపక "హేలయః హేలయః అని సంధిచేసి, ప్లుతము చేయక, వాక్యమునంతను రెండుసార్లుచ్చరించి రేఫకు

లకారమును చేయుటచే నివి యపశబ్దములు. అట్టివానిని యాజ్ఞికప్రక్రియయం దుపయోగించుటచే అసురులు పరాభూతులైరి.

మూ. దుష్టః శబ్దః-

దుష్టః శబ్దః స్వరతో వర్ణతో వా
మిథ్యాప్రయుక్తో నత మర్థమాహ
సవాగ్వజ్రో యజమానం హినస్తి
యథేంద్రశత్రుః స్వరతోపరాధాత్ ఇతి.

దుష్టాన్‌శబ్దాన్ మాప్రయుక్ష్మహీత్యధ్యేయం వ్యాకరణమ్.

వర్ణములచేగాని స్వరముచేగాని దుష్టమైన శబ్దమును వాడినచో నాశబ్దము సరియైన అర్థమునీయక ప్రయోగించినవానికి జెడిసికొట్టును. ఇంద్రశత్రుపదము నుచ్చరించునపుడు స్వరములో పొరబడినందున వృత్రాసురుఁడు నాశమాయెను. కావున దుష్టశబ్దములను ప్రయోగింపకుండుటకై వ్యాకరణము నెఱుంగవలెను.

వి. ఇంద్రుని చంపవలెనని వృత్రాసురుఁడు అభిచారహోమము చేయుచు "ఇంద్రశత్రుర్వర్థస్వ" అనుమంత్రముచే హోమము చేసెను. (ఇంద్రస్య శత్రుః=శాతయితా ఇంద్రశత్రుః) "ఇంద్రుని నాశనముచేయువాఁడవగుము" అను నర్థమునిచ్చు షష్ఠీతత్పురుష సమాసముగానుండవలెనని వృత్రుని యాశయము. అట్లు తత్పురుషమైనచో 'ఇంద్రశత్రు' శబ్దమున చివరియచ్చును ఉదాత్తముగా పలుకవలెను. అది తెలియక వృత్రుఁడు మొదటియచ్చు నుదాత్తముగాఁ బలుకుచు హోమముచేసెను. అంతట దానియర్థము మారెను. అది బహువ్రీహి సమాసమగును. (ఇంద్రః శత్రుః=శాతయితా యస్యసః) "ఇంద్రుఁడు నాశకుఁడుగా కలఁవాడవగుము" అనునర్థమునిచ్చెను. ఆ యభిచారహోమముచే వృత్రునిశక్తి వృద్ధినొందుటకుమాఱు ఇంద్రుని

శక్తి వృద్ధినొందెను. ఇందు్రిడు వృత్రాసురునిజంపెను. స్వరమునందలి దోషముచే వృత్రుఁడు నాశనమైనట్లు నాశము కాకుండుటకు వ్యాకరణ మును జదువవలెను.

మూ. యదధీతమ్ :-యదధీతమవిజ్ఞాతం నిగదేనైవ శబ్ద్యతే
అనగ్నా వివశుష్కైధో నతజ్జ్వలతి కర్హిచిత్ ॥

తస్మాదనర్థకం మాధిగీష్మహీత్యధ్యేయంవ్యాకరణమ్.

అర్థజ్ఞానములేక కేవలము పారాయణముమాత్రముగా చేసిన అధ్య యనము నిప్పులేనిచోటనుంచిన ఎండుకట్టెలవలెనే ప్రజ్వలన సమర్థము కాక నిష్ఫలమగును. ఫలవంతము కాని అధ్యయనము చేయకుండుటకు వ్యాకరణజ్ఞాన మావశ్యకము.

మూ. యస్తుప్రయుక్తే—
యస్తుప్రయుక్తే కుశలో విశేషే
శబ్దాన్ యథావద్ వ్యవహారకాలే।
సోఽనంత మాప్నోతి జయం పరత్ర
వాగ్యోగవిద్ దుష్యతి చాపశబ్దైః॥

పదస్వరూప, తదర్థవిశేష జ్ఞానముకలిగి శబ్దములను ప్రయోగింప వలసినతీరున నెవఁడు వ్యవహారమున ప్రయోగించునో అట్టి వాగ్యోగ విదుఁడు పరలోకమున అనంతమగు జయము నందును. అపశబ్దములచే దూషితుఁడును అగును.

మూ. కః?

ఎవఁడు దూషితుఁడగును?

మూ. వాగ్యోగవిదేవ

పదస్వరూప తదర్థవిశేషజ్ఞానముగల వాగ్యోగవిదుఁడే దూషితుఁ డగును. [సశేషము]

# గ్రంథ స్వీకారము సమీక్ష

(1) శబల :- ఖండకావ్యము క్రౌన్ పుటలు 80 వెల రు 1-4-0

కృతికర్త :- అభినవ తిక్కన తెలుగు లెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు, కృతిపతి శ్రీ జాస్తి వేంకట నరసయ్యగారు.

పూర్వాంధ్ర కవులలో మేనమామ మేనల్లుఁడు జంటకవులుగా వరాహపురాణ, ప్రబోధ చంద్రోదయ కృతులు రచించిన నంది మల్లయ, ఘంట సింగయలు కలరు. కాని పూర్వులలోఁ గాని యాధునికులలోఁ గాని కృతికర్త కృతిపతులుగా నున్న మాతుల భాగినేయులు కనరారు. "శబల"యను కృతిలో నేఁడట్టిసన్నివేశము ఘటిల్లినది. సీతారామమూర్తి, వేంకట నరసయ్య ఉభయులుకూడ జాతీయకవులుగాఁ బేరెన్నికగన్నవారు. అన్యోన్యము భక్తి వాత్సల్యములచే బద్ధులయినవారు. నరసయ్యగారికృతులఁ గొన్నిటినిబూర్వ పంచికలలో సమీక్షించి యున్నాము. "మామయ్యా! జంకుచునే యడుగుచున్నాఁడను. నీకృతి నొకదానిం జేపట్టుభాగ్యము నాకుఁ గల్గునా?" అని నరసయ్యగారు మేనమామను బ్రార్థించుటయు "ఏదినే నెన్నఁడుం గోరని మేనల్లుని కోర్కెని మన్నించుటెట్లాయని మానసించి చిల్లరకొట్టుం దెఱచి చూడఁగాఁ బ్రచురణార్హమగు రచనలుకొన్ని నాకంటఁబడినవి. వాని యభిలాషముదీర్ప వీనినే యేల ప్రకటింపరాదు? ఇది ఖండకావ్య యుగమేకదా!" అని తలంచి సీతారామమూర్తి గారు మేనల్లుని కోర్కెని మన్నించుటయు నీకృతిరూపముగఁ బరిణమించుట ముదావహము. విషయవైవిధ్యమునుబట్టి దీనికి శబలయను పేరుంచితినని కృతికర్త పేర్కొన్నారు. కృతిపతి నరసయ్యగారు జవ్వనముననే గాంధి సత్యాగ్రహోద్యమమునఁ బాల్గొని ప్రభుత్వము వారి కారాగృహాతిథ్యములనంది యనంతర మిప్పటికిఁగూడ నైష్ఠిక బ్రహ్మచర్యముతో ఆంధ్రోపాధ్యాయ వృత్తియందు జీవితము గడ

పుచున్న యుత్తమశీలురు. సీతారామమూర్తిగారుకూడ ఆంధ్రోపాధ్యాయులుగానే జీవితముగడపి గాంధి భక్తులయి "బాపూజీఆత్మకథ" మున్నగు మహోన్నత పద్యకృతులెన్నియో తెనుగు నుడికారంపు సొంపులు మెఱయ రచించిన జాతీయకవితా ధురంధరులు.

"నామేనల్లున కిల్లువాకిలియుఁ గాంతావిత్తముల్ కామ్యముల్
గామిఁ బెద్దకలంగి డీల్పడుదు రక్తస్పర్శ మూలమ్మునన్
సీమల్ దాఁటిన తద్విరాగము కృతిస్వీకార భోగాహిత
ప్రేమంబై వడి తగ్గినామదికిఁ దృప్తింజూపె నీనాఁటికిన్."

అని యానందించి, తమధీచాతురి కాదితీర్థము గురుస్థానమునగు బావమఱఁది సుబ్బయ్యగారిపుత్త్రుఁడు నరసయ్య "పుత్త్రరూప గురుఁడేకద వీఁడు శ్రుతిక్రమమ్మునన్" అని నిశ్చయించి "అటుగురుని ఋణము దీర్చుట! కిటు సోదరిబిడ్డవలపు నీడేర్చుట కొక్కటిచాలుంబనియని వేంకట నరసయకితనికి డెదఁగవితన్ శబలన్" అని యీకృతి నొసంగినారు. ఈవిషయమై గ్రంథారంభమున "ఈవి" యను శీర్షికతో వీరు రచించిన పద్యములెల్ల చక్కనిసుద్దులయి ముద్దులుగులుకుచున్నవి. సంక్రాంతితలఁపులు, వీరపూజ, కర్ణుఁడు, నాకథ.సీత (అశువు)అతఁడు (వినోబాభావే) మున్నగు శీర్షికలుగల యిరువది యెనిమిది కృతులిందుగలవు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 12 పుటల పీఠిక కృతికి ముఖాలంకరణముగ నున్నది. సీతారామమూర్తిగారు తొలుదొలుత బాల్యయౌవనములలో స్వగ్రామమునఁ బల్లెటూరిలో సుఖతరమగు కృషీవలజీవనమును నెఱపి యానందారోగ్యముల ననుభవించినవారు. అప్పుడు పంటకాలములో సంక్రాంతి దినములలోఁ దమకుఁగలిగిన యనుభవములను సుఖానందములను దలఁపునకుఁ దెచ్చుకొని తరువాతఁ బ్రభుత్వపుఁ గొలువులో, ఉపాధ్యాయవృత్తిలోఁ దామనుభవించు శారీరకమానసిక కష్టములను, అనారోగ్యమును,

అశాంతి జీవనమును నిరూపించునది యిందలి మొదటి ఖండకృతి, "సంక్రాంతి తలఁపులు." ఇది పరమోత్తమమైన కవితాఖండమని, దీనిముందునిలిచెడి కవితాఖండము మఱొకటి గ్రంథమునలేదని, అది కవి స్వానుభవముల కాదర్శకమని, నేఁటి యాంధ్రభాషాకవిత్వములో శిరోభూషణమని శ్రీ విశ్వనాథవారి ప్రశంస. అది యట్టిదేయనిమా యభిప్రాయముగూడ. తదితర ఖండములుగూడ వేనికవి యథోచితముగ సన్నుతిపాత్రములుగనే యున్నవి. మచ్చునకుఁ గొన్నిపద్యములు (సంక్రాంతి తలఁపులనుండి)

వెచ్చని గడ్డిపై పడుగువేయుచు మంచుమొయిళ్ల బంటుగా
వచ్చిన సీతురక్కసికి వంగక గిత్తలబండి దోలుచున్
బుచ్చిన కొయ్యలోఁ జివురుపుట్టునటుల్ పలిపాట పాడుచున్
రెచ్చినజవ్వనంబును స్మరించెద నీమకరోత్సవమ్ములన్.
ఈదార్బల్యమకాల వార్ధకము నాయీకొన్న పీరమ్ముతోఁ
బాధిదుర్వ్యాతములయ్యె నొజ్జనమెదో భాగ్యంబుగా నెంచి నా
పాదెల్లన్ గదలించికొంటిని రుజా భారమ్మునార్జించితిన్
జేఁదున్ మెక్కితిఁ బంచదారయని నీసీధర్మమున్ దక్కితిన్.
వలచి ఫలించువారు పదివందలు వచ్చిన ముద్దుముద్దుగాఁ
దెలిసినవట్టు నేర్చిపరి తృప్తి వహింతు నహింతుఁగాని; కా
కులువరకుల్కపుం జదువుగోరెడి బొట్టెలుచట్టులైనచోఁ
గలఁగినలంగి నెవ్వగలఁ గందకకుందక యుంటశక్యమా !
కోటికొకఁడేని వానికి దీటువచ్చు పురుషుఁడుండిన మహికిరాచఱికమేల శాసనములేల యస్త్రశస్త్రమ్ములేల ధర్మదేవత నాల్గుపాదముల నడువ. (అతఁడు వినోబాభావే నుండీ).

(2) అంజలి :- పాకెట్ సైజు పుటలు 50 వెల 0-8-0
కర్త కవిశేఖర శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రీగారు.

(3) ఉమాసహస్రము :- ద్వితీయభాగము డెమ్మీ పుటలు 200 వెల రు 3—0—0.

(4) ఉమాసహస్రము :- తృతీయ భాగము డెమ్మీ—పుటలు 304 వెల రు 5—0—0.

శ్రీ వాసిష్ఠ గణపతి మునిప్రణీతము. ఆంధ్రీకృతికర్త, సాహిత్య విద్యాప్రవీణ, ఉభయ వేదాంత విమర్శన విశారద భాషాప్రవీణ, కవిశేఖర, శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారు, అధ్యాపకులు మహారాజ సంస్కృతకళాశాల, ప్రత్తిపాటివారి వీథి, విజయనగరము, విశాఖపట్టణము జిల్లా. ప్రతులు గ్రంథకర్తయొద్దనే లభింపఁగలవు.

**అంజలి** :—ఇదియొక స్తోత్రకదంబము. అంజలికి (దోసిలి) పది యంగుళులుండుఁగావున ఒక్కొక్క స్తోత్రమునకు పదిపద్యములుగాని, శ్లోకములుగాని రచించి కవి దానికి సాభిప్రాయముగ అంజలినామ కరణ మొనర్చినారు. నిజగురుండగు శ్రీ రమణమహర్షి పరముగ ఆత్మాభీష్టనివేదనరూపకముగ సంస్కృతాంధ్రముల వేర్వేఱుగఁ గూర్చిన శ్రీరమణాంజలి ద్వయము, శ్రీ దేవీవరివస్యాంజలి, శ్రీ లక్ష్మీనారాయణ సందర్శనాంజలి, ఈశ్వర ప్రార్థనాంజలి, శ్రీ బ్రాహ్మీవరివస్యాంజలి, శ్రీ క్షీరారామ రామలింగేశ్వర, సోమేశ్వర ప్రణామాంజలి, శ్రీవరాహ నరసింహ కల్యాణాంజలి, శ్రీ శివతత్త్వాంజలి, శ్రీ శంకర భగవత్పాదాంజలి, అనెడి యంజలి దశకముతో నిది శోభిల్లుచున్నది. ఇవిగాక కృత్యారంభమున శ్రీ సూక్తిగీతాంజలి యను పేరితో భగవద్గీతాచార్యుఁడు శ్రీకృష్ణుని గూర్చిన గేయము కూడ నిందున్నది. శ్లోకములేమి, పద్యములేమి యన్నియు భక్తి జ్ఞాన విలసితములు, అద్వైతామృతోల్లసితములు నయి రాణించుచున్నవి. భక్తలోకము పారాయణముగఁ బఠింపఁదగిన స్తోత్రకృతి యిది. వీనిలోఁ గొన్ని యింతకు మున్ను "ఆరాధన" పత్రికాముఖమునఁ బ్రకటితములయినవి. మచ్చునకీ క్రింది పద్య శ్లోకములఁ జూచునది.

(1) మానవ జన్మమెత్తి పశుమార్గమునన్ జరియింపనొల్ల, వి
జ్ఞానధనంబుఁ గోరక- అసహ్యము, తుచ్ఛము, నింద్యమౌ, ధన
శ్రేణిని గోరఁ జెల్లునె విశీర్ణ శరీర విభూతి-సుస్థిరమ్మానె?
తలంప దీన సుఖమా? శుభమా? యశమా? గుణమౌత్తమా

(2) అద్వైతాత్మ వివేక సంవిదమలానంద ప్రపూర్ణాకృతే
ప్రత్యగ్ బ్రహ్మపదార్థయోగమననధ్యాన ప్రయోగోన్నతే
భేదారణ్య విభేదక శ్రుతికథా యుక్తి ప్రచారాదృతే
శ్రీమచ్ఛంకర దేశికేంద్ర భగవన్ విద్యానిధే! పాహిమామ్.

ఉమాసహస్రము :- ద్వితీయ, తృతీయ భాగములు.

కీర్తిశేషులు కావ్యకంఠ గణపతిశాస్త్రి కవివతంసులు శ్రీ రమణ మహర్షి యాశ్రమమున నధివసించి తత్కారుణ్యమునకుఁ బాత్రమయిన కాలమున పరాశక్తి మహిమవర్ణనాత్మకముగ వివిధ వృత్తములలో బహు విషయ బోధకముగ ఇరువదియైదు శ్లోకములొక స్తబకముగ నేర్పఱచి ఉమాసహస్ర మనుపేరితో 1000 శ్లోకముల యుద్గ్రంథమును రచించియున్నారు. వానికి శ్రీ అరవిందయోగి యాశ్రమమందుండిన శ్రీ టి. వి. కపాలిశాస్త్రిగారు, గణపతిశాస్త్రి వర్యుల శిష్యులు, ప్రభానామక వ్యాఖ్యానమునుగీర్వాణ భాషయందు రచించియున్నారు. ఇందలి ప్రథమశతకమును శ్రీ పంతుల లక్ష్మీ నారాయణశాస్త్రి సుధీవతంసులు శ్రీ కపాలి శాస్త్రిగారి వ్యాఖ్యానమున కాంధ్ర వివరణముతోను, స్వవిరచిత ఆంధ్ర పద్యానువాదముతోడను ఇంతకమున్నె ప్రకటించియున్నారు. దాని పైని సమీక్ష ఈ పత్రిక సం. 42. సంచిక 4లో (విజయ,ఆశ్వయుజ కార్తికములలో గావించియున్నాము. తరువాతి శతకములలో ద్వితీయ, తృతీయ, చతుర్థ శతకములు, ద్వితీయభాగముగను, తక్కిన యాఱుశతకములు

తృతీయ భాగముగను నిప్పుడు శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారు ప్రకటించి విద్వల్లోకమునకు మహోపకార మొనర్చినారు. ఈ భాగములలో మూలశ్లోకములు, వాని క్రింద శ్రీ కపాలి శాస్త్రిగారి వ్యాఖ్యానమునకు విశేషాంశములతోఁ దాము వచనమునఁ గూర్చిన యాంధ్రానువాదమును శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారు ముద్రించియున్నారు. మొదటి భాగమునందు వలె నీ ద్వితీయ తృతీయ భాగములలోని శ్లోకములకు ఆంధ్రపద్యానువాదములను శాస్త్రిగారు రచింపలేదు. ప్రథమభాగము పయి నీ పత్రికలో మున్ను గావించిన సమీక్షను శాస్త్రిగారు తృతీయ భాగావతారికలో నుల్లేఖించి యున్నారు. అందు గణపతి కవీంద్రులయగణితవైదిక విజ్ఞానమునకు, సర్వదర్శన కళానైపుణ్యమునకు నీ యుమాసహస్ర స్తోత్రకృతి యాదర్శకముగ నున్న విషయమును, ఆంధ్రీకర్తలగు శ్రీ లక్ష్మీనారాయణ శాస్త్రిగారి శక్తిసామర్థ్య విశేషములను బ్రశంసించియున్నాము. ఈ కృతియందలి ఉమ పరమేశ్వరుని మానసశక్తి రూపకమయిన కేవల పరాశక్తియే గాని కావ్యములందు పురాణములందు వర్ణితమయిన పరిమిత వ్యక్తి కాదని, హైమవతి, పార్వతి శబ్దములకు సువర్ణద్యుతి, వైద్యుతద్యుతి యని గణపతి కవీంద్రుల నిర్వచనములని అట్లే దక్ష, దాక్షాయణి, సతి, అదితి, మున్నగు శబ్దములకుఁ గూడ పౌరాణికకథలకు విలక్షణములగు నర్థములు, శ్రుతి వ్యాఖ్యానములతో నిరూపింపఁబడినవని నివేదించియుంటిమి. ఇప్పుడు ప్రకటితములయిన ద్వితీయ, తృతీయ భాగములందలి శ్లోకములు గూడ నట్టి పరతత్త్వ ద్యోతకములుగనే భాసిల్లుచున్నవి. పరాశక్తిస్వరూపిణి యగు ఉమాదేవి వర్ణనములో శ్రీ గణపతి కవీంద్రులు తాండవింపని విధానము లేదు. జగజ్జనని యగు ఉమా నామక పరాశక్తి పరమానుగ్రహమునకుఁ బాత్రమయి భక్తలోక మెల్ల భక్తిపూర్వకముగ నీ మహో

తత్కృప్త స్తోత్రి కృతిని సాకల్యముగఁ జఠించి తరించుఁ గాక! (ప్రథా వ్యాఖ్యాతలు శ్రీ కపాలి శాస్త్రిగారు శ్లోకాత్మికముగ రచించిన స్తబక వృత్త విషయసూచిక తృతీయభాగాంతమున ముద్రిత మయినది. గ్రంథ స్వరూపమును దిఙ్మాత్రముగఁ దిలకింపఁ గోరు వారుకివి యెంతయు నుపకరించును. మచ్చునకుఁ గొన్ని శ్లోకములు, తద్వివరణములు శ్లో. దేవీవ్యాపక తేజశ్శక్తిస్తత్త్వ విచారే। అత్యన్తం సుకుమారీ నారీమూర్తి విచారే" (ద్వితీయ భాగము 2 స్తబకము శ్లోకము 9) పరమార్థమును విచారించునప్పుడుమా దేవి వ్యాపక తేజశ్శక్తి యగుచున్నది. ఆయమ్మ విచారించునపుడు అత్యంత కోమలగాత్రియగు పార్వతి యగుచున్నది.

ప్రిభ: వ్యాపక తేజశ్శక్తియన "సర్వవ్యాపియగు జ్యోతిస్వగు సర్వేశ్వరుని శక్తి అని గాని "వ్యాపక తేజోరూపిణియగు శక్తి" అని గాని యర్థము చెప్పవచ్చును. వ్యాపక తేజోరూపిణి యగు శక్తి యని చెప్పునపుడు శాక ప్రియః పార్థివః శాక పార్థివః అని చెప్పు పట్లు తేజోరూపిణీ శక్తిః తేజశ్శక్తిః అని సమాసమును జెప్పవలయును.

తత్త్వమును విచారించు నెడల దేవీస్వరూపము సర్వవ్యాపి తేజశ్శక్తియని, విగ్రహవత్త నపేక్షించు నెడల, సుకుమారియగు నారి యగుననియు భావము.

శ్లో॥ఆపీనం భవతిసహస్ర పత్రకంజం వత్సోఽస్యాః పటుతర మూలకుండ వహ్నిః। దోగ్ధాత్మా దహర సరోమహోప విష్టో పానం స్యాత్ సురసురభే స్తనూషుదోహః(శివభాగము 2 స్తబకము శ్లో 16)

సహస్రారకమలమే పాలపొదుగు, కుండలిని యగు కామ ధేనువునకు మూలాధారమేయగు కులకుండమునందలి నిపుణతరమగు వహ్నియే దూడ. హృదయకమలాసీనుఁడగు ఆత్మయే దోగ్ధ. (పాలు పిదుకువాడు) సర్వవిషయములను నిరసించునవియు శాంతితో నింపి యుండు నదియునగు మానమే పొదుగునుండి పాలు తీయుట.

ప్రిభ :- కుండలి నుండి జనించిన మూలాగ్నియే వత్సము (దూడ)

బండారు తమ్మయ్య.

ఆంధ్రధ్వన్యాలోకము :-మూలకారికాది సమన్వితము. ద్వితీయోద్యోతము. శ్రీబాల సరస్వతీ ప్రచురణము-5. ప్రథమభాగము. శ్రీబాల సరస్వతీ ప్రచురణము-9 ద్వితీయభాగము. సలోచన ప్రభావతీ సమున్మీలితము. ప్రథమభాగము. పుటలు మొత్తము 320. గ్లేజు ముద్రణము రు. 5-00 లు. న్యూసు ముద్రణము రు 4-00. ద్వితీయ భాగము పుటలు మొత్తము 230. గ్లేజు ముద్రణము రు 5-00 లు. న్యూసు ముద్రణము రు 4-00 లు.

ఈధ్వన్యాలోకమును లోచన వ్యాఖ్యానముతో సహితము నాంధ్రీకరించి లోకమున కందిచ్చుచున్న శ్రీ కవిశేఖర వేదాంత విమర్శనవిశారద శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రిగారి వాఙ్మయ తపస్సు ఆంధ్రులందఱకు మిక్కిలి ప్రశంసనీయము. ధ్వని మార్గమును పరిష్కరించుటలో నానందవర్ధనాచార్యు డవలంబించిన పద్ధతి, అభినవగుప్తాచార్యు డాబాటను తీర్చిదిద్దిన విధము ఉద్దండ పండితులకు సైతము దురవగాహము. అట్టి దానిని క్షుణ్ణముగా నవగతము చేసికొని, శాస్త్రీయ సిద్ధాంతములకు విరోధము లేకుండ ననువదించుట యనునది కేవలము తపస్సాధ్యమే కాని బుద్ధిసాధ్యమైన విషయము గాదు. శ్రీలక్ష్మీనారాయణశాస్త్రిగారు శ్రీ తాతా సుబ్బరాయ శాస్త్రిలవారినుండి లోచనసహితమైన ధ్వన్యాలోక విషయమును సంప్రదాయానుసారముగ గ్రహించుటయే గాక, దానిని మూలమున కన్యూనానతిరిక్తముగను, శక్యమైనంతలో సుబోధకముగను నాంధ్రభాషలోని కనువదించుట మిక్కిలి హర్షింపఁ దగిన విషయము.

అభినవగుప్తుని లోచన వ్యాఖ్యానము నవగతము చేసికొనుటకు సామాన్యలోచనములు సరిపడవనియు, జ్ఞానలోచనములు గావలెననియు నభిజ్ఞులు వాకొందురు. శ్రీ శాస్త్రిగా రట్టిలోచనములను వేదాంత విద్యాభ్యాసాదికముచే నార్జించి లోచనోన్మీలిత విషయమును

తమశక్తి కొలఁది ప్రభావతీటీకలో వివరించియున్నారు. శాస్త్రీయ విషయపరిజ్ఞానము గలవారికిఁ గాని యీవిషయములు మనసునకు వచ్చునవి గావు. అట్టి దుర్బోధ విషయములను శ్రీ లక్ష్మీనారాయణ శాస్త్రిగారు, ఆంధ్రభాషలోఁ గొంత విశేష పరిచయముగలవారికి అవధానముతోఁ జూచిన సుబోధమగునట్లు రచియించియున్నారు. వీరి యనువాదమును శ్రద్ధతోఁ జదివిన వారికి ధ్వన్యాలోక లోచనము లందలి విషయములన్నిటియందును మంచి పరిజ్ఞానము గలుగుట నిశ్చయము.

మూలమునందలి కారికలను శ్రీ శాస్త్రిగారు తమ తెనుఁగు పద్యములలోని కనువాదము చేసియున్నారు. ధ్వన్యాలోక విషయ మునకు లోచనవ్యాఖ్యానమునకు యథామూలముగ ననువాదము సాగించుచు, దుర్బోధములైన విషయములకుఁ బెక్కు తావులందు వివరణము చేసి, తత్తద్విషయపరిజ్ఞానము పాఠకులకుఁ గలుగునట్లు చేయుటకై గావించిన కృషి ప్రశంసార్హము. శాస్త్రిగారి ఆంధ్ర ధ్వన్యాలోక భాగములను జదివిన వారికి ధ్వని మార్గము, ఆనందవర్ధ నాభినవగుప్తుల సిద్ధాంతములు సుస్పష్టములగు ననుట నిర్వివాదమైన విషయము. శాస్త్రీయ విషయముల చర్చ గావున రచన చాల వఱకు శాస్త్ర పరిభాషా క్రమమునన సాగక తప్పినది గాదు. ద్వితీయోద్యో తము చివర ప్రథమానుబంధముగ 'రసాలోకము' అను పేర రచించిన విషయము గమనింపఁదగినది. శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిగారి యను వాద సరణి దెలియుటకై అచటి లోచనానువాదమును ప్రభావతి వివరణమును కొంచె ముదాహరించెను.

'రసప్రతీతి శబ్ద వ్యాపార జన్యము కాదు' అను మీమాంసకుని యాశంక.

లోచనము- "అయ్యా! (ధూమశబ్దము వలన దాని యర్థ మగు,) పొగ తెలియఁబడిన పిమ్మట అగ్ని యొక్క స్మరణము

కలుగునట్లు, విభావాదులు తెలియఁబడిన పిమ్మట రత్యాది చిత్త వృత్తులు తెలియఁబడును. కనుక రసప్రతీతివిషయమున శబ్దవ్యాపారము లేనేలేదు.'' (అని మీమాంసకుఁ డనవచ్చును.)

ప్రభా :—'విభావాదులు తెలియఁబడిన పిమ్మట కలుగునది యగు రత్యాదిప్రతీతి ధూమాదిప్రతీతిచే జనించునదియగు అగ్న్యాది స్మృతివంటిదే యగును. కనుక అగ్న్యాదుల స్మృతివలె, ఈ రసాది ప్రతీతి కూడ ఏశబ్దవ్యాపారమునను జనించునది కానిదై యుండఁగా అది వ్యంజనావ్యాపారజన్య మెట్లగును? అనఁగా రసాది ప్రతీతి యందు లక్షణకువలె వ్యంజనకుఁ గూడ ప్రసక్తియుండదు'' అనునది మీమాంసకుని యాశంక''. రాజాలంబనము లేక శాస్త్ర విద్యాభ్యాసమునకు క్రమముగ లోపము వాటిల్లుచున్న యీ కాలమున శాస్త్ర గ్రంథముల కిట్టి యాంధ్రీకరణములు వెలువడుట శాస్త్రసంప్రదాయ రక్షకు దోహదకారులు కాఁగలవనుట నిశ్చయము.

చి. పాపయ్యశాస్త్రి.

**ద్రావిడభాషా సామ్యములు** :- కళాప్రపూర్ణ శ్రీ వఝ్ఝల చిన సీతారామస్వామిశాస్త్రి గారిచే రచియింపఁబడినది. విద్వాన్ వై. వెంకట రాజులు రెడ్డిగా రీగ్రంథమునకుఁ గృతిభర్తలు. డెమీ్మసైజు 182 పుటల గ్రంథము. వెల రు 2-8-0 లు. ప్రకాశకులు కాకరపర్తి వేంకట సీతమ్మగారు. విజయనగరము.

గ్రంథకర్తల విజ్ఞప్తి వాక్యములను బట్టియే యీగ్రంథరచనకుఁ గల ప్రయోజనము పాఠకలోకమునకు విదితమగును. శ్రీ శాస్త్రిగారి రచనలు ఆంధ్రలోకమునకు సుపరిచితములు. వారికిఁ గల సంస్కృతాంధ్ర భాషా విమర్శనపాటవము, శ్రీ శాస్త్రిగారు రచింపఁగా ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు ప్రకటించిన ఆంధ్ర వ్యాకరణ సంహితాసార సర్వస్వమును బట్టియు, ద్రావిడభాషా పరిశీలనమును

బట్టియు నాంధ్రలోకమునకు సువిదితము. ఆ రెండింటికి సంగ్రహ రూపముగ వెలువడిన రెండు గ్రంథములలో 'ద్రావిడ భాషా పరిశీల నము' అనునది యొకటి. దీనిని గూర్చి శ్రీ శాస్త్రిగారి వాక్యములివి.

"నారచించిన ద్రావిడ భాషా పరిశీలనము డా. కాల్డు వెల్లు గారి ద్రావిడ వ్యాకరణమును విమర్శించుట ప్రధానవిషయముగఁ గల దగుటచేతను, సతివిస్తృతమైన దగుటచేతను నాంధ్ర విద్యార్థులు సులభముగా వలసిన ద్రావిడవిషయములను సంగ్రహించుకొనఁ జాలరు. నారచించిన బాలవ్యాకరణోద్యోత మాంధ్ర భాషా విషయ సారమును సులభముగఁ దెలుపునట్లు యిది ద్రావిడ భాషల లక్షణ ములను సులభముగాఁ దెల్పును. ఈ రెండుగ్రంథములు సకలాంధ్ర విద్యార్థి జనోపయోగమునకై సారభూతములుగ నాచే రచింపఁబడినవి" ఈ వాక్యములచే ఈ గ్రంథమున ఆంధ్ర విద్యార్థులకు ద్రావిడభాషా లక్షణములు సులభముగ నవగతములగుట శాస్త్రిగారి రచనకుఁ బ్రధానలక్ష్య మని విదితమగుచున్నది. శ్రీ శాస్త్రిగారేవిషయమును జేతఁబట్టినను దానికి వలయు సామగ్రినంతను గూలంకషముగ సంక లితముఁ జేసియే రచన సాగింతురు. విశ్వవిద్యాలయము వారీ కృషిని బరికించి యీ గ్రంథము నున్నతకక్ష్యలలోని విద్యార్థులకుఁ బాఠ్య ముగా నిర్ణయించిన శ్రీ శాస్త్రిగారి పరిశ్రమ సఫలము కాఁగలదని యాశించుచున్నాను.

చి. సా. శాస్త్రి.

నీలకంఠవిజయము ఆంధ్రీకృత చంపూప్రబంధము-రచయిత శ్రీదువ్వూరి సూర్యనారాయణశాస్త్రి. ప్రచురణ కర్తలు-శ్రీ మల్లాడి. సత్యలింగంనాయకరు ఛారిటీస్ వారు, కాకినాడ. వెల రు 2-0-0 పుటలు 150.

ఆంధ్రమున నీలకంఠవిజయమునకు మొదటగా ననువాద మును వెల యించిన ఖ్యాతి శ్రీసూర్యనారాయణశాస్త్రి గారికి లభించి నది. సంస్కృతమున నీలకంఠ విజయ చంపువును అప్పయ్య దీక్షితుల మునిమనుమఁడగు నీలకంఠదీక్షితులు రచించెను. సంస్కృతమున

చంపూప్రబంధములలో నీలకంఠవిజయము వక్రోక్తి భరితమై నారికేళపాకమున సాగినది. వ్యాఖ్యాన సహాయములేనిదే మూలము నర్థము చేసికొనుట పండితులకుఁ గూడఁ బలుతావులఁ గష్టముగా నుండును. అట్టి చంపువును శ్రీ శాస్త్రిగారు చాల వఱకుఁ దెనుఁగునఁ దెచ్చుటకుఁ బ్రయత్నించిరి. వా రుపోద్ఘాతములో వివరించినట్టులు కొన్ని పట్టులు వదలియుఁ గొన్ని పట్టులఁ బద్యములను గూడ గద్యములుగనే యనువదించియు, అనువాదము మూలసహాయ మక్కఱ లేకయే యర్థమగునటులు శ్రమించిరి. సంస్కృత శబ్దములపై నతఁడు సాగించిన వక్రోక్తిచమత్కారములను జాలవఱకుఁ దెనుఁగునఁ గూడఁ దెచ్చుటకు యత్నించిరి. ఉదాహరణమునకు మంగళాచరణ పద్యమునే పరికింతము.

గీ॥ వాంఛితార్థ సిద్ధికి నమోవాక మిడుదు
నెవరికో! యన, వారినే నెంచి యనను
మతి ననేకత పొసఁగు దంపతుల కనిన
దంపతి కటన్న దుష్టశబ్దత ఘటిల్లు

అభీష్టసిద్ధికి నమస్కరించుచు, దంపతుల కనవలెనా? దంపతి కనవలెనా? అని సందేహించి దంపతుల కనినచో అద్వైతమునకు భంగము వచ్చును. దంపతి కనిన వ్యాకరణదుష్టమగును. అందుచే నే నెవరికి నమస్కరించుచున్నానో చెప్పను అని చమత్కారముగ అద్వయమగు పరబ్రహ్మ స్వరూపమునకు నమస్కరించును. దీనిని పై పద్యమున భావపుష్టి చమత్కారము తఱుగకుండునట్లు శాస్త్రి గా రనువదించిరి. వీరి రచన యంతయు నీ విధముగనే మూలావిరుద్ధముగ జాతీయముగ రసోచితముగ సాగినది. ఇట్టి మహోత్కృష్టమయిన చంపూప్రబంధము నాంధ్ర సారస్వతమున కందిచ్చిన శ్రీ శాస్త్రిగారు ఎంతయుఁ బ్రశంసనీయులు. ఇట్టి గ్రంథమును ముద్రింపించి తమకుఁ గల సంస్కృతాంధ్ర భాషాసమాదరమును వెల్లడించిన శ్రీ సత్యలింగనాయకరు ఛారిటీసు వారెంతయు ప్రశంసార్హులు.

శ్రీభాష్యం అప్పలాచార్యులు.

వ. అనిన విని శంభుండు శాంభవి కిట్లనియె.

క. మసలను బిలువక దక్షుఁడు
ఘనకల్మషచిత్తుఁ డగుచు గణఁగిన మేమై
చని చూత మనియెదవు పిలు
వని పేరంటమ్ము నరుగువారుం గలరే!

ఆ. అత్తవారియింటి కల్లున కెప్పుడు
తగదు శుభమువేళఁ దాన యరుగ
నాడుబిడ్డ కొప్పుఁ బలరఁ బిల్వకయున్న
నమరుఁ బుట్టినిండ్ల కవసరముల.

వ. అట్లు గావున నేను రాను; నీకుఁ జనవచ్చు; నెగ్గుగాదు; పొమ్మనుచుం బల్కిన నెట్టకేల కొడంబఱచి, యంతశ్చరచరులఁ గొందఱఁ బిలిచి, శాంభవి తనపుట్టినింటి కరిగెడు రత్నవిమానంబు మొదలుగాఁ గల ప్రియాణోపకరణంబులు సమకొల్పుకొని తోడన కొల్చియ మగుడుం డని పనిచినం బ్రసాదంబని వారునుం గృతకరణులగుచున్న యనంతరసమయంబున దాక్షాయణి మహేశ్వరుని పాదపంకజంబులకుఁ బ్రణామంబుచేసి, తదీయభావంబు హృదయపీఠంబున నునిచి, ప్రదక్షిణంబుగా వీడుకొని, కోరికం బరిచారికలు ముక్తాతపత్త్రహేమచామరాదులుఁ, గేలిశుకశారికాదులు మఱియు వలయునవియుఁ గొనుచు, నాల్గుదిక్కులు ముంచుకొంచు నడువ, దేవదుందుభిరవంబులు రోదసీకుహరంబు చెవుడుపఱుప వచ్చి, యద్దివ్యవిమానం బధిరోహించిన.

క. దినరాజమండలముక్రియ
ఘనతేజము దొంగలింప నాగగనపథం
బున నరిగి దక్షువాటము
గను తెప్పిడినంత నదియుఁ గదిసెం దిరమై.



ఆ. అచట నున్నవార లందఱు నానన
విసరముల భయంబు విస్మయంబు
లజ్జయును జనింపఁ దజ్జగన్మాతభా
సురవిమాన మర్థిఁ జూచి రపుడు.

సీ. కంచుకి ప్రముఖులు కనకవేత్రములతో
బదమని సందడిపాయ జడియ
దివ్యదుందుభులు ప్రదీప్తనాదములతో
బోరన దిక్కులం బొదల మొరయ
సురవృక్షకుసుమము ల్జృంభివాసనలతో
జోరున జడిపట్టి సొరిది మెఱయ
వరుస తేజస్స్ఫూర్తి వటులు సంభ్రమముల
జయ యని భృత్యులు సరవి నుడువ
నరిగె నాథవాని యయ్యానమునుండి
యిలకు నవతరించి లలితభంగి
నంబుజాక్షుపూర్వ లంజలిసేయంగ
దక్షయజ్ఞవాటతలమునకును.

వ. ఇట్లువచ్చిన యాత్మజాతం ద్రిలోకమాతం గనియును, శివ సహితంబుగా మున్ను తన్నవమానించిన దని తలంచి, రోషాంధుం డగుచు దక్షుండు కానని యట్లు నిరాకరించి యుండుసమయంబున, నతనిచేత నర్చనలు వడసియున్న తనచెలియండ్రను మఱందులం జూచి యేచిన యలుకం గటకటంబడి శాంకరి యిట్లనియె.

క. నను నీదు పెద్దకూఁతుం
జనునె పరీభూతఁజేయ జనకత్వమునే
జన విసమిసుమంతయు నీ
మనమున లేకునికి యపుడ మాకుం దెలిసెన్.

గీ. పిన్నకూఁతుల నల్లురఁ బిలిచినాఁడ
వకట మము నేల పిలువ నీయాత్మ చొరదు
సకలయజ్ఞకర్మ ప్రదాయకుఁడు శివుఁడు
దగఁడె నీజన్మమునకు రా దక్ష చెపుమ.

ఉ. ఈకమలాక్ష వాక్పతుల కెవ్వఁడు నిక్కము పూర్వకర్త యీ
లోకములెల్ల నెవ్వఁ డనులోమగతి న్రచియించినట్టివాఁ
డీకమనీయసంపదల నిండఱ కిచ్చినవాఁడ యెవ్వఁ డీ
వాకరుణాకరుం హరుని నర్చనసేయవు బుద్ధిహాలి తే.

వ. అనిన విని మిక్కిలి మండిపడి దక్షుం డరుణాయమానకటా
క్షుండగుచు నావిశ్వనాయికం గనుంగొని.

క. తనమామ యనుచుఁ దగుమ
న్ననఁ జూడక తోడివారి నన్నను సరిగాఁ
గనుఁగొనియెఁ గాన శంకరుఁ
డనుమానములేదు శత్రుఁ డబలా! నాకున్.

ఉ. కోరిక నాజతాత్మకునిగూడిన నీ వదియేల నీకు నో
వారిరుహాక్షి నెమ్మి బలవంతపులాగున సంఘటించునీ
నేరుపు మామఘంబునకు నీహృదయేశ్వరుఁ డేల? శాత్రవున్
వారక పిల్తురే? ఛనము వచ్చినతోవయె పట్టి నయ్యెదన్.

వ. అనిన విని సర్వమంగళ సభవారిం జూచి, వింటిరే!ముక్కంటి
వాదికర్త, నీకలుమవర్తనుండు వలపని విరోధంబున నిందసేయుచు
న్నాఁడు. మీ రెఱుఁగని వేదశాస్త్రపురాణములు లేవు. శివనిందా
కరంబులగు వచనంబులు వింటిరే యని యంతటంబోక, తండ్రి నవ
లోకించి యిట్లనియె.

సీ. ఓరితుచ్ఛవిచార యోరినిష్కరుణాత్మ
యోరి యధర్మజ్ఞ యోఁధూర్త

ఓరి హీనవివేక యోరిశోభనదూర
 యోరినాశవిలోల యోరి మూర్ఖ
ఓరి గురుద్రోహి యోరి పాపాన్వేషి
 యోరి యహంకారి యోరి కపటి
ఓరి దుష్పథగామి యోరిహారాజ్ఞాని
 యోరి కేవలమోహి యోరి కలహి
యేలరా మనంబునఁగొంక కిందుధరుని
హరుని నిందచేసెదవు దురాగ్రహమున
నఖిలరత్నాకరుండు నీ కమ్మహాత్ముఁ
డకట యేకల్ల చేసెరా? యధమ! చెపుమ,

క. నినుఁ గ్రూరుండగు కొఱఁగక
పనివడి నీకూఁతు నన్నుఁ బరిణయమయ్యెన్
విని మఱువందగు దోషం
బని యెన్నఁగ నేది యొకఁడు నాశివునందున్.

సీ. రాజసయుక్తి యూరంగఁ బద్మజుఁడనా
 వెలసి లోకముల భావించుచుండు
సాత్త్వసక్తి మించఁగ శ్రీవరుండనఁ
 జెలఁగి యింతయును రక్షించుచుండుఁ
దామసవృత్తి యందముగ రుద్రుండనా
 నడరి సర్వము నుక్కణఁపుచుండు
సకలసంపత్తి నచ్చముగ నాత్ముండనా
 నలరి విశ్వమునందు వెలుఁగుచుండు
నమరుఁ డద్వయుఁ డక్షరుఁ డజితుఁ డజరుఁ
డతితరస్థూలుఁ డవకారుఁ డలఘు తేజుఁ
డచలుఁ డవిచింత్యుఁ డవ్యయుఁ డధికసూక్ష్మ

దవిరలశ్రీకుఁ డగు సదాశివుఁడు దాన.

క. ఈశ్వరుఁ డెక్కడ నిలుచును
శాశ్వతముగ నచట నుండు సన్మంగళముల్
విశ్వపతి యెచటఁ దొలఁగును
నశ్వరత వహించు శోభనము లచ్చోటన్.

ఆ. ఇది నితాంతధర్మ మిది వేదవిహిత మం
చరసి యిప్పు డీవు జరుపుచున్న
మఖము తుట్టతుది సమగ్రత ఫలియించు
నందు శంభుఁ డొక్కరుండు సూవె.

చ. శ్రుతులు యుగాది నిర్జరులఁజూచి మఖంబుల నబ్బు హవ్యముల్
చతురత నధ్వరేంద్రుఁడగు శంభున కిచ్చి యతండ యిచ్చినన్
మతు లలర న్భుజింప నగు మంగళ; మట్టిజగద్విధాత యా
నతుల నిరాకరింప, నగు నాశము పొందని చాటి చెప్ప వే.

క. నెఱయఁగ నిదియును మనమున
నెఱుఁగవె యీదృశుఁడు శంభుఁ డీమఖమున నే
తెఱఁగున రాఁదగఁడొకో
యఱపుల కిటు లెద్ది పాటి యధమాధముఁడా!

వ. అని పల్కి మఱియు నచట... సంతకంతకు నిగుడు నాగ్రహంబున నాననంబు జేవురింప నాజగన్మాత యరుణాంబురుహేక్షణంబులంబాహాత్మ్య దక్షుం గనుంగొని ... సకల్మషుండును దుస్స్వభావుండును నగు నీకు మున్ను నే జనియించినట్టి యీశరీరంబు దాల్పను మదీయవల్లభుం గదియింప నుచితంబుగా దనుచుఁ దదనంతరంబ.

చ. పరమసమాధి నొంది నిజభావమునందుఁ గరంబు నిష్ఠ నీ
శ్వరు విడియించి యర్థి నినచంద్రులవీథులఁ గప్పి మిక్కిలిన్
బరువడితోడఁ బ్రాణుని నపానుని గూర్చి సుషుమ్నలోనికిన్

జనియె భవాని యోగశిఖఁ జక్కఁగ మేల్కొనఁ జేసియుండఁగా.

ఉ. ఆపయి యోగ పావకమునందులనాలుక లోలిఁ గ్రోయుచుం
జూపఁజ కెంతయు స్వయము చొప్పడ నుగ్రనిరూఢిఁ జేర్చియా
లోపల నింతిమీఁదికిని లోలత నుబ్బుచు నద్భుతక్రమా
టోపము దాల్చె శాంభవి గడు న్విలసిల్లఁగ నిశ్చలస్థితిన్.

గీ. ఆత్మశిఖ యట్లు తనచుట్టు నగ్గలింప
నడుమఁ బాయక యాసతి వపువు మీఱ
సహజ తేజంబు నిశియందుఁ జాలఁ బడసి
లాలితంబగు నోషధిలతయుఁ బోలె.

క. తదనంతరంబ శాంభవి
కదలక తద్గాఢదహనఘనకీలములన్
పొదవుకిపి శరీరము స
మ్మదమున భస్మముగఁ జేసె మహిమ దలిర్పన్.

వ. ఇట్లు పరమమాహేశ్వరి యగు నీశ్వరి దక్షువలని రోషంబున భస్మసాత్కారంబు నొందిన ... యప్పటి మంత్రంబులు తదీయగేహంబు వెడలె నింక నిక్కడ నునికి గర్జంబు గాదని ముకుంద శతానంద పురస్సరులైన యమరు లందఱు దమతమనివాసంబుల కరిగి రంత. నిట సదాశివుం డిచ్చటి వృత్తాంతం బంతయు దివ్యభావంబునను బుపరాగతప్రమథయూథంబులవలనను నెఱింగి నిజప్రియసుందరి యందలి ప్రేమంబు రోషరూపంబున నిగుడుటయు నుగ్రుం డుదగ్రరభసంబున.

ఆ. దక్షుఁ గష్టశీలు ధర్మవిదూరాత్ము
గతవివేకుఁ దలఁచి కటము లదర
బొమలు ముడివడంగఁ బొలియింపఁ దలఁచి యి
ట్లనుచు శాపమిచ్చె నభవుఁ డంత.

గీ. ఓరి! యాత్మాధికంమన్య! రౌరి! దక్ష!
యశార! మత్ప్రాణవల్లభ యందు నట్లు
కడు నహంకృతి చూపిన చెడుగ వగుట
నడఁకు మంతకు దుర్ధాంతయాతనలను.

క. పుట్టుము ప్రచేతసునకుం
బట్టి వగుచుఁ బిదప నిట్ల పటుమూఢతఁ జే
పట్టుము దురధ్వరము ను
ద్ఘట్టించెద నపుడ నిన్నుఁ గ్రతువున నలుకన్.

వ. అనిన నిట్లు నిష్ప్రతీపంబగు శాపంబున దక్షు నుపలబ్ధయమ సమక్షుం గావించిన నతండును దన్ను సకలజనంబులు నిందింపఁ బంచత్వంబు నొంద నీశ్వరుండును యథోచితవర్తనంబులం బ్రొద్దులు పుచ్చుచుండె.

చ. చదురుగ దక్షునాశ మనఁజాలిన యీశివలీల నిచ్చలుం
జదివిన విన్న వ్రాసినను జక్కఁగ వారల కెల్ల నిక్కడం
గుదురుపడ న్ఫలించు ననుకూలశుభంబులు నిత్యసంపద
ల్పొదిసమకూరుఁ జాల భవులోకము గౌరవలక్షులాభ ముల్.

ఆ. వినుఁడు సముచితముగ వివరింతు నిటమీఁద
నభవుఁ డవధరించినట్టి లీల
గరము వెలయు నదియుఁ గందర్పదహనాఖ్య
నమరసార్థగుంఫనములు గలిగి.

వ. దక్షుండు క్రియాదక్షుండు గాక దురవరోధంబునఁ జేసిన యపరాధంబున గాసిల్లి యాగసన్నాహంబున దేహంబు విడిచిన దేవశిఖామణి దాక్షాయణియగణ్యపుణ్యవంతుండగు హిమవంతున కుం దనపునర్జన్మం బానతిచ్చినఁ బ్రాపించినఁ దత్సతియగు మేనక మేన నుపసంక్రమించి, పరిపూర్ణవివర్ధనంబున విడంబించి, సముచిత క్రమంబున.

చ. అటతఱి వర్ణనీయసమయంబున దక్షతనూజ కేవల
స్ఫుటమహిమ న్గిరీంద్రునిజసుందరియందు జనించె నుజ్జ్వలో
త్కట విలసన్నవాబ్జసుముఖద్యుతి రత్నశలాక మోహనో
త్కటగరిమ న్విదూరమహిత స్థలలియందుజనించుచాడ్పునన్.

మ. పొలసెం గల్పకపుష్ప వర్షము జను ల్పొం దెన్సుఖామోదముల్
మలసె న్పావనగంధవాహము దిశ ల్పొ మెం బ్రసన్నప్రభల్
వలరెం దైవతతూర్యనాదములు నిర్వ్యాజపదీప్తార్చులన్
గలసెన్ శంకరపత్ని యుత్కలిత రేఖాపూర్వభావంబునన్.

క. ప్రతిపన్నజన్మవతి యా
సతి యాభిజనాఖ్య నెసఁగె సతికై యాపా
ర్వతి యనఁగ వెలసె లీలం
బ్రతివాసర వర్ధమాన భావాకృతినై

వ. ఇట్లనన్యసామాన్యాగణ్య లావణ్యవిశేషంబులు నెట్టన గను
పట్టం గ్రమక్రమంబునం బరిపోషణంబు గలిగి యుల్లసిల్లఁగ

క. ప్రజనిత సమ్మదుఁ డచల
ప్రజవల్లభుఁ డంత నాదరం బలరంగా
నిజనందన కొప్పఁగ జయ
విజయలు మునుగాఁగ సఖుల వెరవున నొసఁగెన్.

ఉ. ఆసఖు లెల్లఁ దన్ను ననయంబును నొక్కటఁ గొల్చుచుండఁ గ్రీ
డాసము పేశభంగుల కొడంబడియు న్మదితాత్మగల్గు ప్రా
గ్వాసన నెప్పుడుం శివునఖండదయావిభవుం దలంచున
భ్యాసము సేయఁ జొచ్చెఁదుహినాద్రితనూభవ భక్తిసంపదన్.

గీ. అబల యపుడును వలయునయ్యాటలపుడు
బాటలప్పుడుఁ దగు జోలపాటలపుడు
మఱియుఁ దగువర్తనంబులు నెఱపునపుడు
మఱువ దయ్యె సదాశివస్మరణ మబల.

వ. ఆసమయంబున.

సీ. అనియతన్యాసంబు లగుమృదుపాదముల్
సతులయానంబుల జడత లెఱిఁగె
నకలితదోషంబు లగు ...
ల్వలయుభావంబుల వలను లెఱిఁగె
నకృతసంస్కారంబు లగుభాషితంబులు
సరసవైభవముల గరిమ లెఱిఁగె
నచపలశ్రీకంబు లగులోచనంబులు
కుటిలవర్తనముల నటన లెఱిఁగె
నవిదితనియంత్రణము లగు నంగకములు
నవ్యలజ్జాసమాశ్లేషణంబు లెఱిఁగె
నద్భుతావహంబుగఁ దుహినాచలేశ్వ
రాత్మజకు బాల్య యౌవనవ్యతికరమున.

క. పువ్వుల విలుకాఁ డిచ్చో
గొవ్విరులకుఁ దాన మొదలి కోత్తల యనఁగా
జవ్వనముఁ బడసె నిండుగ
నవ్వనజాతాస్యమేన నట్లవిరళమై.

సీ. సత్ప్రవాళఖ్యాతిఁ జదురొందు నీరామ
పదతల పదనఖ పాణిగరిమ
వజ్రపుష్పఖ్యాతి వలనొందె నీ భామ
రదనమందస్మితఘ్రాణమహిమ
రాజబింబఖ్యాతిఁ బ్రకటొందె నీ లేమ
యవయవ కంఠాధరాస్యకలన
నీలకంజఖ్యాతి నెఱి నొందె నీ బోటి
యలకావళీకంధరాక్షినటన

అనుచు బహువిధముల నంద ఱాత్మలోన
మాపుగాఁ గను దనరు నామాపు వోగడ
వటలె నట్లును మధురయౌవనవతియగు
హైమవతిమైవిలాసంబు లగ్గలింప.

వ. ఆకమలముఖి నొక్కనాఁడు పితృసమీపంబునం జూచి కామచరుండగు నారదుం డచలాధిపతితోడం దావకనందన యిట మీఁద నీశ్వరునకు నేక వల్లభయును దదర్ధగాత్రసంగతయును గాఁగలయది; యని పలికి యిష్టగమనంబునం జనిన, నతండు నివృత్తాన్యవరాభిలాషుం డగుచునుండునమయంబున నక్కడ శివుండు దత్తురోషంబున వినిముక్త దేహావతి యగుట యదిగా నితరసతీపరిగ్రహణవిముఖుం డగుచు నొక్కనాఁడు మనంబునం దపశ్చరణ కుతూహలంబు చిగురొత్త.

శా. కైలాసంబున నుండఁ దాఁ బ్రమథలోకగ్రామణు ల్గొల్వఁద
న్నైలాభర్త వృషభేంద్రు నెక్కి నియతేచ్ఛన్వచ్చి పొందెన్నదా
ఖేలత్కిన్నరకామినీ నికర సంగీత ప్రబంధారవ
శ్రీలీలాపరిశోభమానమగు నా శీతాచలస్థానముల్.

చ. సకలతపఃఫలప్రభుఁడు సర్వసురేశ్వరుఁ డష్టమూర్తి త
త్ప్రకనిజమూర్తి భేదమగు పావకముం దగఁదెచ్చి ముందటం
బ్రకటముగాఁగ నిల్పి మదిఁబాయక యచ్చట నుండి యెద్దియో
యొకఫల మాత్మఁ గోరి తపమూని చరించెఁ నదేకనిష్ఠుఁడై.

వ. అంతఁ దత్క్రియం బంతయు నద్రిపతి యెఱింగి యేకత్వంబ మేనకతోడ మన పార్వతి యఖండితగుణప్రాయంబగు పెండ్లి ప్రాయంబున నున్నయది. తనయంత నీశ్వరుం డడుగక మనయంతన యిత్తమనుట తత్తరం; బిప్పు డవ్విభుండు సమీపంబున నున్నవాఁ డిప్పుడిక్కన్నియం దత్సన్నిధిం బరిచర్య నెట్టన నను పుట యు నీప్సితసిద్ధి దొర

కొను నని విచారించి నిర్ణయించి యక్కడికి నిజనందనం దోడ్కొనుచు నేగు సమయంబున.

సీ. పదముల కెంపుపైఁ బరగి యుర్వర యెల్ల
సురగోపకశ్రీలఁ బరిఢవింప
కన్నులతళుకు పైఁ గదిరి పార్శ్వము లెల్ల
శంపావళి శ్రీల సంఘటింప
వేనలికప్పు పై విరిసి యంబర మెల్ల
నంబుధరశ్రీల నలవరింప
రవణంబుమించుపై నివిడి దిక్తటు లెల్ల
నమరధనుశ్శ్రీల నావహింప
వఱలు తన మనోహరమూర్తి వర్షలక్ష్మి
యనుచు వనమయూరములు నృత్యములు సలుప
సఖులు నలుదిక్కులను గొల్వ జనకుపిఱుఁద
నరిగె శంకరాశ్రమభూమి కద్రితనయ.

గీ. అంత నాకన్యకయుఁ దాను నచలవిభుఁడు
సముచితంబుగ శంభునిచరణములకు
నెరఁగి యర్ఘ్యపాద్యాదుల నెఱయఁ బూజ
లిచ్చి భక్తిఁ జేతులు మోడ్చి యిట్టు లనియె.

మ. హర సర్వజ్ఞ జగత్ప్రమోదకర చంద్రార్ధస్ఫురన్మూర్ధ నీ
చరణాబ్జంబులు గంటి మంటి నిదె యస్మద్భాగ్యప్రవృత్తియాకన్నియం
బరిచర్యార్థ మనుగ్రహించి తగ వొప్పన్మన్చి మావంశము
స్ఫురితానందముగా నొనర్పుము కృపాభంగీసమంగీకృతిన్.

క. అనుటయుఁ దన మానసమున
ననుకంప దలిర్ప భవుఁడు నాతని విజ్ఞా

పనమవ ధరించి వీడ్కొలి
పిన నరిగె న్గిరియు మిగులఁ బ్రీతాత్మండై.

క. అది మొదలుగాఁగఁ బార్వతి
పదిలంబగు నిష్ఠతోడఁ బ్రతివాసరమున్
మదిఁ దత్పరముగ నిల్పుచుఁ
గుదియక యీశ్వరునిఁ గణఁకఁ గొలువఁ దొణంగెన్.

మ. అలరు ల్దెచ్చు లతానివాసము కరం బందంబుగా నల్కు ని
మ్ముల ముగ్గు ల్రచియించుఁ భావన జలంబు ల్వేడ్కఁ జేర్చుంగుశం
బులు చాల న్సమకట్టు నిట్లు సతతంబుం ద త్త దర్హా క్రియా
కలనానందితుఁ జేయుచుండె శివుఁ దత్కంజాస్య యవ్యగ్రమై.

వ. తదనంతరంబునఁ దారకుండను మహాసురుం డతిఘోర తపంబుకలిమి బ్రహ్మవలన వరంబు వడసి యుద్రేకంబున లోకంబున కుపద్రవంబు గావించుచుండఁ దద్బాధావిహ్వలాయమానమాన సులగు శతమఖప్రముఖామరులు పద్మసంభవుం గాన నరిగి, తత్స న్నిధి వడసి, భక్తి సాష్టాంగంబుగాఁ బ్రణామంబులు సలిపి,కరంబులు మొగిచి, పెక్కు భంగులఁ బ్రస్తుతించి, యిట్లని విన్నవించిరి.

క. తారకుఁడు జగదుపప్లవ
కారకుఁడు భవద్వరాత్త గర్వక్రమసం
భారకుఁడు ధర్మగుణవి
స్తారకుఁ డలసితిమి దేవ ! తద్ఘాతములన్.

ఉ. ఇంతట నైన వానిఁ బొలియింపఁ దలంపక యూరకున్నఁ గ
ల్పాంత విజృంభమాణ భయదానల భాతిఁ బరిజ్వలించి దు
ర్దాంతత నమ్మహాబలుఁడు తక్కక లోకసమూహ మెల్ల భ
స్మాంతము సేయుఁ గావున దయం బరికింపఁ దగుం బితామహా!

వ. అని విన్నవించినఁ గొంత విచారించి, వారలకు విరించి యిట్లనియె.

ఉ. ఏవర మీఁకయున్నఁ గడునేచిన వాని తపోగ్ని హెచ్చి లో
కావలిఁ గాల్చు నంచు వినుఁ డప్పటికిం దగుశాంతి గోరి ము
న్నావిధ మాచరించితిని నాక్రియఁ దక్కని యట్టి కూరిములన్
వారిరిఁ జెందియు న్మఱి ధ్రువంబుగ నుండవు భాగ్యసంపదల్.

వ. అట్లు గావునం దారకప్రతాపంబునకు శంకింప న్వలవదు. వానిం జంపించుటకు వీర్యంబు గల శూరుండు పార్వతియందు నిషిక్తం బగు పరమేశ్వరునివీర్యంబునం గలుగు కుమారుండు. తజ్జన్మంబునకుం దగు యత్నంబు గావింపుఁ డని నిలింపుల వీడుకొలిపిన నాప్రజాపతికి పునఃప్రణామంబులు సలిపి, పురుహూతుం డమరగణసమేతుండగుచు మరలి చనుచు ... తనూజ సంధాయకుం డసమసాయకుం డని తలంచి సత్వరంబుగ.

మ. తలఁచెం దైవతవల్లభుం డటజగత్సంపోష సంపోషణా
కలనా కీర్తి తకీర్తిహారుని సురంగద్గంధపుష్పంధయా
వలిమౌర్వీరవగర్విత ప్రసవ భాస్వచ్చాపదుర్వారు ని
స్ఖలిత శ్రీనయనాంతకాంత విశిఖాలంకారునిన్ మారునిన్.

చ. మసలక వచ్చె నత్క్షణమ మన్మథుఁడు న్సురనాథుఁ డంతఁ దెం
పెసఁగఁగ నున్చె నాతని సమీపసువర్ణ విభాసిపీఠమం
దసదృశ మత్తషట్పద నిరంతర నిశ్చల పంకజావళీ
హాసనమనోజ్ఞలోచనచయంబులఁ దన్ముఖ మొప్పఁజూచుచున్.

వ. తదనంతరంబ సముచితార్చనాప్రముదితుం గావించినం బాకశాసనునకుఁ గుసుమశరాసనుం డిట్లనియె.

ఉ. నీపద మొక్కఁ డెవ్వఁడును నిష్ఠుర ఘోరతంబుచేత. స
పాపముగాఁగ నాత్మఁ దలపండుగదా! కుటిలాక్రమంబు డసూ
యాపరతంత్రుఁడై యురక యాతని నిష్ఫుడ చేయువాఁడ మ
చ్చాప ఝుణంఝుణ క్వణన సంచకితాత్ముని గాఁ బురందరా!

మ. అదిగా కెవ్వఁడు నీకసమ్మతముగా నాత్మంబున న్జన్మదుః
ఖద సంసారవిమోక్ష మార్గమునకుం గావించినాఁ డాతనిం
గుడియింతుం జిరకాల ముజ్జ్వల మదాకుంచత్సమాంచద్భ్రమ
త్సుదతీ దీర్ఘ కటాక్ష పాశముల బద్ధున్జేసి వజ్రాయుధా!

మ. పలుకు ల్మాటికి నేఁటి కింకఁ బచరింపం దళ్కుపూములుక్కలం
బొలుపొందంగఁ బినాక ధన్వుఁడగు నాఫాలాక్షునై నన్ను మా
కులుఁగావించి కలంతుఁ దాల్మి, ననిలోఁ గోపించియే నిల్చినన్
విలుకాం డ్రెవ్వరు నాకె దుర్వఁ గల రీవిశ్వంబున న్వాసవా!

వ. అని యాత్మసంభవుం డనష్టంభ విజృంభణంబునం బల్కు పల్కులు నిజప్రార్థనార్థ సంగతంబులగుటకు సమందానం దభరసుం దరుండగుచుఁ బురందరుం డతని కిట్లనియె.

మ. తగు నేమన్నను నీకు నిప్పటి భవద్వ్యాహారము ల్బీరముల్
ప్రగుణార్థత్వగభీరము ల్సురహిత ప్రారంభ సంభారముల్
జగదానందనసారముల్ చటుల భాస్వద్గర్వ దుర్వారముల్
విగతాసత్యవిచారముల్ శుభకళా విష్కారము ల్మన్మథా!

శా. శ్రీనాథుండు భవద్గురుండు జగమాత్రిం బ్రోచుచు న్రూపుగా
దా నానాగతుల స్ఫురించు నెపుడుం దద్భంగి యూహించినన్
మీనాంకా శరణాగతావనవిధు ల్మీ కెందుఁ గర్తవ్యముల్
జానారంగొనియాడ మాతరమె యుష్మచ్చిత్ర చారిత్రముల్.

ఆ. కాన వినుము నీదుఘన కీర్తి వర్ణన
మొంద గురుతర ప్రయోజనంబు

సంఘటింపు మీవు సకలనిర్జరగణ
ప్రమదకరము గాఁగఁ బంచబాణ!

వ. అది యెట్టి దనినం, ఘోరతారకవధాహార్యవీర్యంబు గలుగు శూరుండు పార్వతీనిషిక్త పరమేశ్వర వీర్యంబునం గలుగు కుమారుం డని విరించి యవధరించినాఁడు. గిరిశుండు నిపుడు హిమగిరి ప్రస్తరంబునఁ దపంబున నున్నవాఁడు. గిరిజయుఁ దత్సమీపంబున జనకనియోగంబునం బరిచర్యాకార్యప్రసన్నతే నున్నయది. వారల నిద్దఱం గూర్పుము. నీదు నేర్పున నిప్పని దీర్పుము; యిది యనన్యసాధారణం బగుటకు నీ విఖ్యాతి కారణం బగు నని మఱియును.

చ. సుర లిది వేఁడువారు పని చూడఁ ద్రిలోకహితంబు చేతయుం
బరులకుఁ గాదు; పుష్పనవబాణుచేతన సాధ్య మింక నీ
శ్వరునకు మీఁద విక్రమము సమ్మత మెప్పుడు గాంచి రిట్టి పెం
పరయఁగ నీవకాక సుఖదాతవై భవ! యోమనోభవా!

తే. అనిన నంగజాతుఁ డౌఁగా కయని యియ్య
కొనిన నెలమిఁబొదలి గోత్రభిదుఁడు
ప్రస్తుతించి యాతనిఁ బరిరంభ మొనరించి
విజయమందు మనుచు వీడుకొలిపె.

వ. తదనంతరంబ మదనుండు దక్కడఁ గదలి యరిగి, నిజసఖుండగు వసంతునిం బిలిచి, నిర్జరగణంబునకు నీశ్వరుమీఁద దండయాత్ర సేయవలయు. రథప్రముఖ సాధనంబులు బెట్టు సమకట్టు మనినఁ బ్రసాదంబని.

సీ. కమలకర్ణికలు చక్రములుగా సమకట్టి
వెరవున బిసకాండ మిరుసుఁ బెట్టి
చిన్ని మొల్లలు కొన్ని చీలలుగాఁ గూర్చి
నునులేత చిగురులు నొగలుఁ జేసి
కమ్మగేదఁగిమొగ్గ కాడిగాఁ గదియించి

పొగడ దండలు మొకులుగ రచించి

రాజకీరములు వార్వములుగా డీకొల్పి

తొలదమ్మినూ ల్పల్పులుగను నిలిపి

క్రమమగు తీఁగ మునుకోలగా నమర్చి

కడఁకఁ బుండరీకము తెల్లగొడు గొనర్చి

మఱియుఁ దగువాని వలయు నిర్మాణవిధులు

సలిపి రథము గావించె వసంతుఁ డిట్లు

క. అకలంకత నతఁ డటఁ ద

త్ప్రకటరథముపైఁ దమాలపల్లవరచనా

వికచచ్ఛాయావ్రజమగు

మకరధ్వజ మెత్తె గగనమండలిఁ గ్రాలన్.

వ. ఇట్లు మోహనాయితంబగు తనతేరాయితం బగుటయు జూచి యేచినప్రమోదంబున.

సీ. కర్పూరహిమకరకలితమేళనమున

జాదుచందనకవచంబు దొడిగి

శతపత్రదళచిత్రవితతగుంభనమున

మెఱయు సంపెంగబొమ్మికము వెట్టి

పూరితవిషమాస్త్రభూరిసంపదల నిం

పలరుప్రవాళతూణములు బిగిచి

రంజితబిసతంతుసింజినీతతుల భా

సిల్లు మవ్వపుఁదియ్యవిల్లు దాల్చి

మఱియు బహువిధముల మధురప్రకారశృం

గారగౌరవములు గరము చెలువు

గలిగి రతియుఁ దానుఁ గమనీయసరణి స

య్యసమబాణుఁ డెలమి నరద మెక్కె.

# ఆంధ్ర సాహిత్య పరిషత్తు

అధ్యక్షులు

ఆంధ్రాస్థానకవి, కవిసార్వభౌమ, మహామహోపాధ్యాయ

శ్రీ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి.

ప్రధాన కార్యదర్శి, కోశాధికారి

శ్రీ దంటు భాస్కరరావు.

సహాయ కార్యదర్శి

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.

కార్యనిర్వాహక సభ్యులు

1. శ్రీ కోరా శివనాథశాస్త్రి.
2. శ్రీ రా. సా. మూదిరెడ్డి సీతారామయ్య. బి. ఏ., బి. యల్.,
3. శ్రీ వేదుల రామచంద్రకీర్తి, ఎం. ఏ., (ఆనర్సు) బి. ఇడీ.,
4. శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి (వ్యాకరణవిద్యా, భాషా, ప్రవీణ)
5. శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి (కవిమూర్ధన్య, పౌరాణికకవిచంద్ర)
6. శ్రీ యండమూరి వేంకటరమణ (మధురకవితావిశారద)
7. శ్రీ బండారు తమ్మయ్య (ఐతిహాసికసమ్రాట్)
8. శ్రీ జయంతి బుచ్చిరామశర్మ.
9. డాక్టరు శ్రీ ఇవటూరి జోగారావు, (యం. బి. బి. యస్.,)
10. శ్రీ చిరువోలు కోటీశ్వరరావు.

పత్రికా సంపాదకుడు :

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

సంపాదక సహాయులు :

శ్రీ బండారు తమ్మయ్య

---

Published by Andhra Sahitya Parishat, Kakinada.

Edited by C. PAPAIAH SASTRY

Printed by J. Bhaskara Rao at Republic Press Kakinada